# విశ్వహిందు

ధార్మిక - సామాజిక మాస పత్రిక

సంపుటి : 28 సంచిక : 2 ఖర - మాఘ-ఫాల్గుణములు ఫిబ్రవరి - 2012 రూ. 10/-



## మహాశివరాత్రి శుభాకాంక్షలు




2012 జనవరి 7వ తేదీన భాగ్యనగరం, రామ్‌కోఠి- జైనభవనంలో జరిగిన అఖిల భారతీయ గోరక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న పరిషత్ అంతర్జాతీయ కార్యాధ్యక్షులు డా॥ ప్రవీణ్‌భాయి తొగాడియా. వేదికపై అంతర్జాతీయ అధ్యక్షులు మాన్యశ్రీ జి. రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులు మాన్యశ్రీ హుకుంచంద్ సావ్లా, కేంద్రీయ కార్యదర్శి మాన్యశ్రీ ఖేమ్‌చంద్ శర్మ తదితర పదాధికారులు

## విశ్వహిందూ పరిషత్

ఆంధ్రప్రదేశ్

హిందవః సోదరాః సర్వే - న హిందుః పతితో భవేత్ ।
మమదీక్షా హింద రక్షా - మమ మంత్రః సమానతా ॥

# విశ్వహిందు

ధార్మిక-సామాజిక మాసపత్రిక

వ్యవస్థాపనం : 1984

సంపుటి : 28 సంచిక : 2 ఖర - పుష్య-మాఘములు ఫిబ్రవరి - 2012 రూ. 10/-

గౌరవ సంపాదకులు :

**కె.బి. సోమయాజులు**

సంపాదకులు :

**శ్రీ సిహెచ్. లక్ష్మీనాథాచార్యులు**

కార్యనిర్వాహక సంపాదకులు :

**డా॥ వై.వి. కృష్ణకుమారి**

కార్యనిర్వాహక మండలి :

**ఆచార్య కసిరెడ్డి**

**డా॥ బి.మాణిక్యాచారి**

**డా॥ మాళిగ వ్యాసరాజ్**

**పి. కృష్ణారెడ్డి**

**జి. దుర్గయ్య**

**డి.జి.విజయలక్ష్మి**

**ఎం. రాంరెడ్డి**

**చందా వివరాలు :**

| | | |
|---|---|---|
| జీవిత సభ్యత్వం | : | రూ. 1000/- |
| వార్షిక చందా | : | రూ. 100/- |
| విడిప్రతి | : | రూ. 10/- |

డిడిలు **విశ్వహిందు** పేరిటనే పంపాలి

చిరునామా :
**విశ్వహిందు**
4-5-212, విజయశ్రీ భవనం
కోఠి, భాగ్యనగర్ - 500 095
ఫోన్ : 24757209, 24757377
vhpnewsap@gmail.com

## ఈ సంచికలో......

పరిషత్ లేఖ : హిందువు జీవనోపాధిని ............ 2
సంపాదకీయం : దాగని వాస్తవాలు ................ 4
భీష్మైకాదశి ................................................ 6
వైదిక సాహిత్యములో .................................. 10
ఛత్రపతి జయంతి... ..................................... 13
ఓంకార స్వరూపుడు. ..................................... 19
నేటి అవసరం గోరక్షణ ................................. 21
బాల హైందవం ........................................... 25
స్వామి దయానంద సరస్వతి ......................... 27
వార్తాహైందవం ........................................... 30
ధార్మిక, జాతీయ, సాంస్కృతిక ...................... 42
గావో విశ్వస్య మాతరః ............................... 44
కేంద్రీయ ట్రస్టు బోర్డు, తీర్మానం .................... 49
కుల పెద్దల సమావేశము .............................. 52
భారత భాగ్య విధాత శ్రీ గురూజీ ................. 55
ప్రేమను స్వాగతిద్దాం ! .................................. 58
మాతా అమృతానందమయి ......................... 60

ఆయా రచయితల అభిప్రాయాలు వారివే. పత్రిక ఆలోచనా వేదిక మాత్రమే

# హిందువు జీవనోపాధిని, విద్యను కాపాడండి

***ఆత్మీయ బంధువులారా! శివరాత్రి శుభాకాంక్షలు***



**1. గత నెల కార్యక్రమాలు:** గత నెల ప్రాంతంలో ధర్మరక్షానిధి కార్యక్రమాలను విజయవంతంగా జరుపుకున్నాం. జనవరి 7,8 తేదీలలో భాగ్యనగరం - రాంకోఠి - జైనభవన్‌లో అఖిలభారతీయ గోరక్షా ఆయాం సమావేశాలను విజయ వంతంగా జరుపుకున్నాం. ఈ సమావేశాలలో పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షులు మాన్యశ్రీ జి.రాఘవరెడ్డి, కార్యాధ్యక్షులు డా॥ ప్రవీణ్‌భాయి తొగాడియా మార్గదర్శనం చేశారు. జనవరి 28, 29 తేదీలలో భాగ్యనగరం - గుడి మల్కాపూర్ ఉషాగార్డెన్‌లో ప్రాంత సమావేశాలు జరిగాయి. అక్కడ మనం తీసుకున్న నిర్ణయాలను కచ్చితంగా అమలు పరుస్తూ పరిషత్ కార్యాన్ని మరింత వేగంగా ముందకు తీసుకొని వెళదాం.

ముస్లిం ఓట్ల కక్కుర్తితో కేంద్ర ప్రభుత్వం హిందూజాతిలోని ఓ.బి.సి.కి చెందిన 27 శాతం రిజర్వేషన్ నుండి చీల్చి ముస్లింలకు 4.50 శాతం ఇచ్చింది. ఇపుడు 9 శాతం వరకు ఇవ్వాలని ప్రకటిస్తున్నది. ఇంతవరకే ఎస్.సి., ఎస్.టి. కులాలకు చెందిన రిజర్వేషన్లు చీల్చి వెనుకబడిన వర్గాల సాకుతో క్రైస్తవ - ముస్లింలకు ఇచ్చింది. ఇప్పుడు యస్.సి., యస్.టి. రిజర్వేషన్లను ఇంకా ఎక్కువగా చీల్చి, ముస్లిం-క్రైస్తవులకు ఇవ్వాలని కుట్ర పన్నుతున్నది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) ప్రకారం హిందువులలోని వెనుకబడిన కులాలకు మాత్రమే రిజర్వేషన్లు కల్పించబడినవి. ముస్లిం - క్రైస్తవులలో కులాలులేవు. అయినప్పటికి కేంద్రప్రభుత్వం రంగనాథమిశ్ర, రాజేంద్ర సచ్చార్ కమిటి రిపోర్టు ఆధారంగా - భారత రాజ్యాంగాన్ని సవరించి, ఓ.బి.సి. రిజర్వేషన్లను చీల్చి ముస్లింలను, క్రైస్తవులను, వెనుకబడిన వారిగా పేర్కొంటూ రిజర్వేషన్లు ఇవ్వాలని చూస్తున్నది. మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధం. కావున మైనార్టీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని సలహా ఇచ్చిన రంగనాథమిశ్ర కమీషన్, రాజేంద్ర సచ్చార్

కమిటి, రిజర్వేషన్లు పొందుతున్న ముస్లిం - క్రైస్తవులు, రిజర్వేషన్లు కేటాయిస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశద్రోహ నేరం క్రిందకు వస్తాయి.

హిందూ జాతిని సర్వనాశనం చేయాలని కలలు కంటున్న దుష్టశక్తుల ఆటలు సాగనివ్వం. హిందూజాతికి చెందిన ఏ ఒక్క రిజర్వేషన్‌ను ముస్లిం - క్రైస్తవులకు ఇవ్వనివ్వం. అధిక సంఖ్యాక హిందువుల మనోభావాలను గౌరవిస్తూ కేంద్ర ప్రభుత్వం ఓ.బి.సి. నుండి చీల్చి ముస్లిం-క్రైస్తవులకు ఇచ్చిన రిజర్వేషన్లు రద్దుచేయాలి. ఇకముందు ఏ ఒక్క హిందువు రిజర్వేషన్‌ను మైనార్టీలకు ఇవ్వమని వాగ్దానం చేయాలి. రంగనాథమిశ్ర కమీషన్, రాజేంద్ర సచ్చార్ కమిటి రిపోర్టులను రద్దు చేయాలి. హిందువుల మనోభావాలను గాయపరచినందుకు క్షమాపణ చెప్పాలి.

ఈ డిమాండ్లను సాధించడానికి పరిషత్ ఆధ్వర్యంలో "హిందువుల జీవనోపాధిని, విద్యను కాపాడండి' అనే గొప్ప ఉద్యమాన్ని లేవదీద్దాం. ఈ నెలలో గ్రామ గ్రామాలలో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిద్దాం. అలాగే పార్లమెంటు సభ్యులను కలసి హిందూజాతి రిజర్వేషన్లు కాపాడుమని, వినతి పత్రాలు సమర్పిద్దాం. కావున రాజ్యాంగాన్ని గౌరవిస్తున్న దేశప్రజలు, ధర్మాభిమానులు ఈ ప్రచండ ఉద్యమంలో పాల్గొని, విజయం వరించేదాకా పోరాడాలని మనవి.

భవదీయ

'విజయశ్రీ" కోఠి-భాగ్యనగరం.
తేది : 2012 ఫిబ్రవరి 1

**గోల దుర్గయ్య**
ప్రాంత కార్యదర్శి

---

## "విశ్వహిందు" జీవిత సభ్యులకు మనవి

పెరిగిన ధరల దృష్ట్యా "విశ్వహిందు" మాసపత్రిక నష్టంతో కొనసాగుతున్నది. ఈ విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకొని 14 సంవత్సరాల కంటే ముందుగా జీవిత సభ్యులుగా చేరిన చందాదారులు రూ. 1000/- ఒక వేయి రూపాయలు ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

**మా చిరునామా : సంపాదకులు - విశ్వహిందు**

4-5-212 విజయశ్రీ, కోఠి, హైద్రాబాద్ - 500 095

ఫోన్ : 040-24757377

# సంపాదకీయం


## దాగని వాస్తవాలు

దార్శనికులైన మహర్షులు ఈ విశాల విశ్వాన్ని బ్రహ్మమన్నారు. వసుధైక కుటుంబమ్ అని కవులు తమ రచనలలో నిరూపించారు. ఒకే విధమైన జీవనసరళి ఉండి, సకల జనులు సుఖంగా ఉండాలని మతసంస్కర్తలు భావించారు. అయితే ఈ భావనలన్ని కూడా పరమార్థ దృష్ట్యా ఆదర్శప్రాయంగా కన్పించినప్పటికీ, వ్యవహారికంగా, కన్పిస్తున్న ఈ సమాజంలో మాత్రం ఎంతమాత్రము వాస్తవంకాదు అనే తేలుతోంది. ప్రస్తుత కాలంలో రాజ్యపాలన అంతుబట్టని విధంగా ఉంది. ఏ ఒక్క అంశంలో కూడా ఏకతా భావం గాని, సమానతగాని కన్పించడం లేదు. ఏ పార్టీ దేశాన్ని పాలిస్తున్నది అన్నది ముఖ్యం కాదు, పాలిస్తున్న ప్రభుత్వం ప్రజల కష్టసుఖాలను, అవసరాలను ఎంతవరకు పట్టించుకుంటున్నది అనేదే ముఖ్యం. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమే ఇది. కాని ప్రజలకు ప్రతినిధులుగా మాత్రం కన్పించటం లేదు. ఇసుక ఎడారిలో తుఫాను వస్తే క్షణం క్రితం కన్పించిన ఇసుక గుట్టలు అప్పుడు కన్పించవు. మరుక్షణమే ఇంకొకచోట ఇసుక కుప్పగా కన్పిస్తుంది. అంతవరకు సమతలంగా కన్పించిన ప్రదేశంలో ఒక గుంట కన్పిస్తుంది. అనూహ్యంగా మారే ఈ ఇసుక ఎడారి ఎవరికి ఏ రకంగా ఉపయోగపడదు. ఇది నిజం. ప్రస్తుత రాజకీయాలు సరిగ్గా ఇట్లాగే ఉన్నాయి. ఏ వ్యక్తి ఏ పార్టీకి చెందినవాడో, ఆ పార్టీలో ఎంతకాలం ఉంటాడో, ఏ క్షణాన ఇంకొక పార్టీలోకి చేరిపోతాతో అంతుబట్టదు. ప్రజాసేవ నిష్కామంగా చేయాలనుకున్న వ్యక్తికి నిజానికి ఏ పార్టీ అవసరం లేదు. కాని నేటి రాజకీయ పక్షులు ఏ క్షణాన, ఏ కొమ్మమీద వాలుతామో, క్షణం తర్వాత ఏ కొమ్మమీద వాలటానికి ఎగిరిపోతాయో తెలుసుకోవటం అసాధ్యంగా ఉంది. నేటి రాజకీయులందరు పదవి నిల్పుకోవటానికో, పదవిని దక్కించుకొనేందుకో తప్ప, తమని నమ్మి ఓటు వేసిన ప్రజలకు మంచి జీవితాన్ని ఇద్దామని భావించటంలేదు. ఇంత నిలకడలేని వ్యక్తులు సమాజాన్ని ఎటువైపు మళ్లించాలని చూస్తున్నారు? ఒకవైపు నిత్యదరిద్రంలో ఉంటూకూడా, తిండికి లేకపోయినా మద్యానికి ఉన్నకొద్దీ డబ్బు ఖర్చుపెట్టే ప్రజలు, ఇంకొకవైపు సాధ్యమైనంత వరకు ఎదుటివాడి నెత్తికొట్టి పదితరాల వరకు సంపదను దాచుకున్నవారు – సమానత రమ్మంటే ఎట్లా వస్తుంది? ప్రజలకి మరింతగా మద్యం అలవాటు చేయాలని, మద్యం అమ్మకాలు మరింత పెంచాలని పైనుంచి ప్రభుత్వం ఉత్తర్వులు. ఇదేం ప్రభుత్వం? శారీరకంగా, మానసికంగా అరోగ్యంగా ఉన్న ప్రజలున్న సమాజం అభివృద్ధి పథంవైపుకు దూసుకొనిపోతుంది కాని, దుర్బలులుగా ఉన్న ప్రజలు జీవితంలో ఏం సాధించగల్గుతారు?

తిండి కలిగితే కండ కలదోయి, కండ కలవాడేను మనిషోయ్ అన్నారు గురజాడ.

అయితే తిండి ఏది? దేశంలో పంటల పరిస్థితి ఏమిటి? ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఎంత వరకు పట్టించుకుంటున్నది? పండిన పంటకు తగిన గిట్టుబాటు ధర ఏది? ఏపుగా పెరిగిన పంట అమ్ముడుకాక కంటి ముందు ఎండిపోతుంటే నిస్సహాయుడైన రైతు ఏం చేస్తాడు? ఆత్మహత్యలే శరణ్యమనుకోడా? పంటకు పట్టిన చీడపీడలను అడ్డుకోలేని క్రిమి సంహార మందులు రైతు ప్రాణాల దగ్గరికి వచ్చేసరికి రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి, ప్రాణాలను తీసుకుంటున్నాడు. ఆలోచిస్తే క్రిమి సంహారక మందులు రైతు ప్రాణాలు తీయటానికే తప్ప చీడ పురుగుల సంహారం కోసం కావేమో అన్పిస్తుంది.

ఇంత అస్తవ్యస్తంగా ఉన్న దేశం బాగుపడేదెప్పుడు? నేరం చేసి జైలుకెళ్ళిన వారిని సంస్కరించాలన్న ఉద్దేశ్యంతో కొంత శిక్షణ నిస్తారు అక్కడి అధికారులు. ఇటువంటి శిక్షణా తరగతులు నేటి రాజకీయులకి చాలా అవసరం. సమాజాన్ని అడ్డంగా, నిలువుగా చీల్చేసి, కులాలని మరింతగా ప్రచారం చేసుకుంటూ, తమ వాడయితే చాలు ఎటువంటి తప్పులు చేసినా కప్పిపుచ్చే ఊపనికిమాలిన రాజకీయాలకి ఇకనైనా అడ్డుగోడ కట్టాలి. ప్రజలు ఏ కారణం వల్ల మానసికంగా పిరికివారు అయ్యారో అంతుబట్టడం లేదు. మనదేశం మీదికి విదేశీయులు దండయాత్రలు చేసి, అధికారాన్ని చేజిక్కుంచుకొని, అత్యంత క్రూరంగా పరిపాలించినప్పుడు జనమంతా ఒక్కటై వాళ్ళని ఏ విధంగా దేశం నుంచి వెళ్ళగొట్టారో, ఆ స్ఫూర్తి నేటి ప్రజలకు రావాలి. ప్రస్తుతమున్న అవినీతిపరులైన రాజకీయులందరిని దేశం నుంచి వెళ్ళగొట్టాలి లేదా కఠినంగా శిక్షించాలి. దేశాన్ని పరిపాలించటానికి నిజాయితీగల, దేశంపట్ల ప్రేమగల యువతరం ముందుకు రావాలి. ఆ తరం త్వరగా రావాలని, దేశం ఎదిగి సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా జీవించాలని కోరుకుందాం.



## పాఠకుల స్పందన

శ్రీ హెబ్బార్ నాగేశ్వరరావుగారు “ధర్మరక్షానిధి – సనాతనవిధి” వ్యాసంలో హిందూ సమాజ సంరక్షణకై మన కర్తవ్యం గురించి చక్కగా వివరించారు. శ్రీ పరవస్తు సుందర్‌గారు ఉత్తరాయణం, దక్షిణాయణం మరియు సంక్రాంతి, భోగి, కనుము గురించి సమాజానికి తెలియని విషయాలనెన్నింటినో తెలిపారు. శ్రీమతి డి.జి.విజయలక్ష్మిగారి ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న బాలహైందవం శీర్షిక–విద్యార్థులతోపాటు పెద్దలకు ఎన్నో ధార్మిక విషయాలు అందిస్తున్నందుకు సంతోషిస్తున్నాము. చక్కని ధార్మిక విషయాలు అందిస్తున్న రచయితలకు – రచయిత్రులకు ధన్యవాదాలు.

– ఆరె. వీరయ్య, భువనగిరి

# భీష్మైకాదశి

**(తేది : 3-2-2012 శుక్రవారం భీష్మైకాదశి)**

**- పరవస్తు సుందర్**

భగవదారాధన విధానాల్లో "వ్రతం" ఎక్కువ ప్రాధాన్యం వహించింది. కఠినమైన వ్రత నియమాలు పాటించి మనస్సును భగవంతుడి మీద లగ్నం చేస్తే ఆయనకు చేరువయ్యే అవకాశం ఉందనీ, సద్గతి ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. శ్రీహరికి ప్రీతికరమైన వ్రతాలలో ఏకాదశీ వ్రతం చాలా శ్రేష్ఠమైనది.

ఏకాదశి అంటే 1+10=11 పదకొండు అని అర్థం. మానవుడు దశేంద్రియాలపై నిగ్రహం సాధిస్తే జీవాత్మ పరమాత్మ సన్నిధానం చేరి, నర, నారాయణులు (1+1) కావచ్చునని ఈ ఏకాదశి సంఖ్య పరమార్థం.

సంవత్సరంలోని ప్రతి నెలలో రెండు పక్షాలు (శుక్ల, కృష్ణ) వస్తాయి. ఆవిధంగా శుక్ల పక్షంలోని పదకొండవ రోజును శుక్లఏకాదశి అనియు, కృష్ణపక్షంలోని పదకొండవరోజును కృష్ణ ఏకాదశి అని వ్యవహరిస్తారు. నెలకు రెండు చొప్పున సంవత్సరంలో ఇరవైనాల్గు ఏకాదశులు వస్తాయి. ఒకవేళ అధికమాసం వస్తే అదనంగా మరో రెండు ఏకాదశులు వస్తాయి. సంవత్సరంలో వచ్చే ఇరవై నాలుగు ఏకాదశులకు వాని సందర్భాన్ని బట్టి వేరువేరు పేర్లతో పిలువబడుతూ, ఏకాదశీ మహాత్యాన్ని తెలిపే తదనుగుణమైన వ్రత కథలు ప్రచారంలో వున్నాయి.

"ఏకాదశీ మహాత్యం" ప్రస్తావన నారదీయపురాణం ఉత్తరభాగంలో వున్నది. సూతుడు నైమిశారణ్యంలోని మునులకు "రుక్మాంగధరాజు" అనుష్ఠించిన ఏకాదశీ వ్రతాన్ని వినిపిస్తాడు.

రుక్మాంగదుని రాజధాని విదిశాపురం. అక్కడి ప్రజలంతా ఈ వ్రతాన్ని రాజ శాసనం ప్రకారం అనుష్ఠించడంతో ఆ రాజ్యంలో పాప దేవతలకు నిలువనీడ లేకుండా పోయింది. ఆ సంయమి నగరంలో (యమలోకంలోకి) పాపాత్ములు అడుగు పెట్టడమే మానేస్తారు. ఈ అవాంతరాన్ని గుర్తించిన "సమవర్తి" (యమధర్మరాజు) బ్రహ్మతో మొరపెట్టుకుంటాడు. బ్రహ్మ మోహినిని సృష్టించి, రుక్మాంగదుడి వ్రతనిష్టను చెడగొట్టి రమ్మంటాడు. ఆమె ప్రయత్నించి విఫలురాలవుతుంది. చివరకు రుక్మాంగదుడు నిజపరివార సమేతంగా హరికృపకు పాత్రుడౌతాడు. ఆయన పాలనలో రాజ్యంలోని ప్రజలంతా ధర్మవర్తనులై సమవర్తి బారిన పడకుండా ఇహపరసుఖాల్ని అనుభవిస్తారు. ఈ విధంగా రుక్మాంగదుని కథ ద్వారా ఏకాదశీ మహాత్యం వివరింపబడింది.

పాపాలనే అరణ్యాన్ని సమూలంగా దగ్ధంచేసి పరమపుణ్యం ఇచ్చేది ఏకాదశీ వ్రతం. ముల్లోకాలలో దానికి సాటిగా చెప్పదగిన ఉత్తమమూ, సంపత్కరమూ, శుభకరమూ అయిన వ్రతం మరొకటి లేదు.

ఏకాదశికి "హరివాసరము" లేక "హరిదినము" అనిపేరు. ఈ దినం శ్రీహరికి ఎంతో ఇష్టమైన దినం. ఈ రోజున ఉపవాసం చేయాలనేది నియమం. ఉప+వసతి అంటే దగ్గరగా ఉండటం అని అర్థం. అంటే భక్తి ప్రపత్తులతో శ్రీహరికి దగ్గరగా ఉండటం అంటే ఆస్వామిని స్తుతించాలని దీని పరమార్థం. కేవలం ఉపవాసం పేరుతో ఫలహారాలను సుష్టుగా ఆరగించడం ఏకాదశి వ్రతం అనిపించుకోదు!

**ఏకాదశీ వ్రతాచరణ విధానం :** ఏకాదశినాడు సూర్యోదయానికి పూర్వమే నిదురమేల్కొని నిత్యకృత్యాల అనంతరం చన్నీటితో శిరఃస్నానం చేయాలి. పరిశుద్ధమైన మొదటిరోజు ఉతికి ఆరవేసిన సంప్రదాయదుస్తులు ధరించాలి. ఆరోజు ఆశుచిగా వున్నవ్యక్తిని చూడరాదు. అసత్యమాడరాదు. కాని పనులు చేయరాదు. పగలు నిద్రించరాదు. మనసు ఎలాంటి దుష్ట చింతనకు లోనుకారాదు. విడెము (తాంబూలం) వేసుకోరాదు. ఆ రోజంతా విష్ణు కథలను చదవాలి లేదా చదివించుకొని వినాలి.

దశమినాడు ఏకభుక్తం (ఒక్క పూట మాత్రమే భుజించడం) మర్నాడు ఏకాదశిరోజు పూర్తిగా ఉపవాసం – సాయంత్రం విష్ణ్వాలయానికి వెళ్ళి ఆరాత్రి జాగారం చెయ్యాలి. వేకువకాగానే స్నాన సంధ్యాదులు ముగించుకొని, హరినామ సంకీర్తనం చేస్తూ ద్వాదశి ఘడియలు రాగానే, విష్ణుభక్తులు, విద్యాంసులున్నూ అయిన విప్రులకు భోజన తాంబూల దక్షిణలు సమర్పించి వారిని సంతుష్టులనుచేసి, అనంతరం బంధు మిత్రులతో కలిసి సహపంక్తి పారణ చెయ్యాలి. దీనితో ఏకాదశి వ్రతం సుసంపన్న మవుతోంది. ద్వాదశినాటి భోజనంలో ఉసిరికాయ వంటకం విధిగా వుండాలి. నూనె, పిండి వంటలు ద్వాదశినాడు చేయకూడదు. శాస్త్ర నిషిద్ధమైన కాయగూరలను భుజించరాదు. ఆనాటిపగలు కూడా నిదురించరాదు. సద్గ్రంథకాలక్షేపం చేయాలి. ఆనాటి రాత్రి భోజనం మానివేయాలి. బ్రహ్మచర్యాన్ని విధిగా పాటించాలి. ఈ నియమాలను సరిగా పాటించినప్పుడే పెద్దలు చెప్పిన ఈ ఏకాదశీ వ్రతఫలితం మనకంది తీరుతుంది.

ఏకాదశి కేవలం శ్రీ వైష్ణవులకేగాదు, స్మార్త, మధ్వ, బ్రాహ్మణులు. ఏకాదశీ వ్రతాన్ని వారివారి ఇష్టదేవతాప్రీత్యర్థం ఆచరించవచ్చును. అంతేగాక భక్తజనులు, ఆధ్యాత్మిక చింతకులందరూ స్త్రీ, పురుష కుల వర్ణ భేదం లేకుండా ఈ ఏకాదశీ

ఉపవాస వ్రతాన్ని పాటించి వారి ఇష్ట దైవాలకు సన్నిహితులు కావచ్చును.

దశమినాడు ఏకభుక్తం చేయలేనివారు ఏకాదశినాడైనా రెండుపూటలా ఉపవసిస్తే హరిప్రీతి అవుతుంది. వృద్ధులు, పిల్లలు, అశక్తులు వారి వారి శక్త్యానుసారము ఉపవాసనియమము పాటించవచ్చును. అన్ని ఏకాదశులూ ఈ నియమాన్ని పాటించి ఉపవాసాలు చేయలేని పక్షంలో ఏ ఒక్క మాసంలోని ఏకాదశినాడైనా నియమ నిష్ఠలతో ఉపవాస వ్రతాన్ని ఆచరించడం, శ్రీమన్నారాయణునకు ప్రీతికరమూ, పుణ్యప్రదమూ అవుతుంది.

**మాఘమాసం విశిష్టత :** మాఘమాసం సంవత్సరంలో పదకొండవ మాసం. మఖానక్షత్రయుక్త పూర్ణిమగల మాసం. ఈ మాఘమాసంలో వచ్చే శుక్ల ఏకాదశికే "భీష్మైకాదశి" అని పేరు.

మాఘశుద్ధ సప్తమి మొదలు మాఘ శుక్ల ఏకాదశి వరకుగల ఐదు రోజులు భీష్మ పంచకం అంటారు. దక్షిణాయనంలో భారత యుద్ధంలో గాయపడిన భీష్ముడు ఉత్తరాయణం వచ్చేవరకూ అంపశయ్యపై పరుండి ఉత్తరాయణంలో మాఘశుక్ల అష్టమినాడు ప్రాణం వదిలాడు. భీష్ముడు తన పంచ ప్రాణాలలో ఒకదానిని సప్తమినాడు, రెండోదానిని అష్టమినాడు, మూడోదానిని నవమినాడు, నాల్గవ దానిని దశమినాడు, ఐదవది ఏకాదశినాడు వదిలాడని కొన్ని ప్రాంతాలవారు చెబుతారు. అందుకే మాఘశుక్ల ఏకాదశిని "భీష్మైకాదశి" అని పిలుస్తారు.

మాఘ శుక్ల అష్టమి భీష్ముని నిర్యాణ దినంగా చెప్పబడింది. ఈ దినమున భీష్ములకు శ్రాద్ధము, తర్పణము చేసినవారికి సంవత్సర పాపం నశిస్తుందంటారు. భీష్మద్వాదశి వ్రతం ఈ దినాన్నే ప్రారంభిస్తారని నిర్ణయసింధు వివరిస్తుంది.

ఈ మాఘమాసంలోనే శ్రీకృష్ణభగవానుడు భీష్మునిచేత "విష్ణుసహస్రనామ స్తోత్రాన్ని" పాండవులకుపదేశింపజేస్తాడు. తానుపదేశించిన భగవద్గీత కన్నా శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పఠనం వల్లనే సులభంగా తరించవచ్చని శ్రీకృష్ణులవారి అభిమతము. దీనిని మించిన గొప్ప మంత్రము మరొకటి లేదు. వేయినామాలు కల మూల మంత్రమే సహస్రనామ స్తోత్రం. శ్రీమన్నారాయణుని గుణముల ననుభవించిన ఋషులు, ఆ అనుభవసారంగా ఒక్కొక్క నామాన్ని దర్శించి ఆనందించగల, అక్కడక్కడ గల ఆ ఋషుల వాగామృతం కలిసి పరీవాహమై లోకంలో మనం కూడా పాడగలిగేటట్లు శ్రీ వ్యాసభగవానుడు సేకరించి కృప చేయగా భీష్మపితామహుని ద్వారా శ్రీకృష్ణుని అనుగ్రహంతో మనకందించబడిన స్తోత్రరత్నం ఇది. ఇట్టి అమూల్యమైన స్తోత్రాన్ని

మాఘమాసంలో పాండవుల ద్వారా మనకందరికీ కృపజేసిన భీష్ముని వల్లనే ఈ మాఘమాసానికి పవిత్రత కల్గి ఈ శుక్ల ఏకాదశి భీష్మైకాదశిగా ప్రసిద్ధమవడానికి ప్రధానకారణం.

ఈ ఏకాదశిరోజున పూర్తిగా ఆలయాలలో అఖండ "విష్ణుసహస్రనామం" సామూహికంగా పారాయణం చేస్తారు.

పుణ్య సంపాదన కోసం ఏవేవో వ్రతాలు చెప్పారు. హరిదివస వ్రతం వంటి ధర్మమింకేదియును లేదు. శ్రీహరిని సేవించిన పుణ్యాత్ములు సకల సంపదలతో సర్వభోగాలు పొందుతారు. హరిపదసేవ కలికల్మషహరం. మృత్యుబాధాహరం. ఇక లౌకికంగా ఆలోచిస్తే పదిహేను రోజులకొకసారి ఉపవాసం చెయ్యడంవల్ల శారీరక ఆరోగ్యానికి ఎంతో మేలు కల్గుతుందని, తెలిసో, తెలియకో ఏకాదశి రోజున ఉపవాసం చేయటం వల్ల శ్రీహరికరుణా కటాక్షాలకు పాత్రులు కాగలరన్నది పెద్దలు చెప్పిన శృతి వాక్యం!

-: ఓం శాంతి శాంతి శాంతిః :-

## విశ్వహిందు - జీవిత సభ్యులు

**1.** రశీదు సంఖ్య - 12577

**శ్రీ. మిడిదొడ్డి పాండు**

శ్రీగణేశ్ ఆటో ఫైనాన్స్,

నాగర్‌కర్నూలు

జిల్లా - మహబూబ్‌నగర్ - 509 209



**2.** రశీదు సంఖ్య -

**శ్రీ బి.భూపతిరెడ్డి**

ఇ.నెం. 369/29, జన్మభూమి నగర్, లంగర్‌హౌజ్

హైద్రాబాద్ - 500 008



**3.** రశీదు సంఖ్య -

**శ్రీమతి బి.చంద్రకళ, డా॥ బాలనారాయణ**

యస్.బి.హెచ్. ప్రక్కన,

మెయిన్‌రోడ్ - అచ్చంపేట

జిల్లా - మహబూబ్‌నగర్ - 509 375



# వైదిక సాహిత్యములో దాగియున్న వైజ్ఞానిక విశేషాలు

**- కె.బి.సోమయాజులు**

వైదిక సాహిత్యములో "జ్ఞానం విజ్ఞాన సహితమ్‌యద్ జ్ఞాత్వా తమ్ పూర్వమభివాదయేత్॥" అని ఒక నియమము పేర్కొనబడినది. అనగా ఏ వ్యక్తి జ్ఞానముతో బాటు దానిని అమలుపరచుటకు కావలసిన విజ్ఞానము-సైన్స్, టెక్నాలజీ - కలిగియుండునో అతనికే ప్రథమ తాంబూల మిచ్చి గౌరవించవలెనని. కేవలము బ్రహ్మ జ్ఞానము నార్జించిన మహానుభావులు అనేకమంది యుండవచ్చును. కానీ ఆ జ్ఞానాన్ని నిత్యజీవితములో ఆచరణలో పెట్టవలెనంటే విజ్ఞానము కావలసియుండును. అందువలననే అఖిల ద్రష్టలైన ఋషి మహర్షులు జ్ఞాన, విజ్ఞాన సంపన్నులుగా విలసిల్లినారు.

వేదములు ధర్మానికి మూలములు. అందుకే మనము ధర్మాన్ని నమ్ముతాముగానీ మతాన్ని కాదు. మత మన్నది ఒక వ్యక్తి మతి నుంచి పుట్టినది. కానీ ధర్మము అటువంటిది కాదు. ఈ ధర్మానికి రెండు రకాలైన గతులుంటాయి. అవి సమానాంతర, లంబగతులు. ధర్మము భూమికి సమానాంతరముగాను, లంబగతిలోను నడుస్తుంది. సమానాంతరగతికి అభ్యుదయమని, లంబగతికి నిశ్రేయస్సని పేరు. అభ్యుదయమంటే వ్యక్తి పరమవైభవ సంపన్నతతో కూడిన భౌతిక జీవనమును కొనసాగించాలి. కానీ అతని దృష్టి ఆవైభముల మీద, సంపదలమీద లగ్నము లేకుండా బ్రహ్మోమీద అనగా పరతత్వము నందు లగ్నము కావాలి. దానికే నిశ్రేయస్సని పేరు. ఈ అభ్యుదయ, శ్రేయస్సులను గురించి తెలియజేయుటకు చక్కని ఉదాహరణ క్షీరసాగరమందు ఆదిశేషునిపై పయనించు పరమాత్మ యొక్క చిత్రము. నిరంతరము ఉవ్వెత్తున లేచే తరంగాలతో కూడిన పాల సముద్రమది. దాని మధ్యలో ఆదిశేషుడిని పక్కగా చేసుకుని శయనించాడు విష్ణుమూర్తి. లక్ష్మీదేవి ఆయన పాదములొత్తుతూ సేవ చేస్తోంది. శయ్యకు పక్కన నిలబడి నారద, తుంబరాదులు తియ్యటి సంగీతము వినిపిస్తున్నారు. విష్ణు పరమాత్మ ఎనలేని సుఖాలననుభవిస్తున్నా ఆయన చూపు మాత్రము పాదము లొత్తుతున్న లక్ష్మీదేవి మీదగాని, పాటలు పాడుతున్న నారద, తుంబురుల మీద గానీ నిలపకుండా సాక్షాత్తు బ్రహ్మో మీద లగ్న మొనరించుట కనబడుతుంది ఆ చిత్రములో అందులో నొకవైపున అభ్యుదయము, మరియొక వైపున నిశ్రేయస్సు - రెండూ దర్శనమిస్తాయి.

అభ్యుదయాన్ని సాధించాలంటే విజ్ఞానము కావాలి, నిశ్రేయస్సును సాధించడానికి జ్ఞానము కావాలి. మన ఋషి మహర్షులు యీరెండింటిని పరిపూర్ణముగా సాధించిన ఘనులు. ఈ రెండింటితో కూడినది ధర్మము. ఈ ధర్మాన్ని మనకందించినవే వేదములు, శాస్త్రములు, పురాణములు, కావ్యములు.

శ్రీ భరద్వాజ మహర్షి గొప్పద్రష్టయే గాక విమాన శాస్త్ర వేత్త, సివిల్ మరియు మెకానికల్ ఇంజనీరు కూడా., ఆయన విమానములను గురించి "విమాన సర్వస్వము" అను గ్రంథమును రచించుట జరిగింది. అట్లాగే వివిధ యంత్రముల నిర్మాణమును గురించి "యంత్ర

సర్వస్వము” అను గ్రంథమును కూడా వ్రాశారు. ఐతే, దురదృష్టమేమంటే ఆయన రచించిన గ్రంథములేవీ యీనాడు మనకు లభించుటలేదు. ఈ గ్రంథమేగాక ఆయన ఫోటోగ్రఫీకి సంబంధించిన “అంశుబోధిని” అనునొక యుద్గ్రంధమును కూడా వ్రాసిన మహామహులు.

మనకు పదునెనిమిది మహాపురాణములు, పదునెనిమిది యుపపురాణములు కలవు వాటిలో సంఖ్యాకములైన కథలున్నవి. అవి కేవలము కల్పిత గాధలుకావు. ప్రతి కథను ఏడు విధాలుగా వ్యాఖ్యానించవచ్చును. ఆ వ్యాఖ్యామునకు ఏడు కల్పశాస్త్రములుండెడివి. అవి – చారణ, వైతానిక, నాక్షత్రాదికల్పములు. ఆ కల్పములు కూడా యీనాడు లభించుట లేదు. మహా భారతములోని యొకగాధను యిందుకుదాహరణగా పేర్కొనబడుతోంది. దీనికి సుపర్ణాఖ్యానమని పేరు.

కశ్యప ప్రజాపతియను పేరు గల వారొకరుండెడివాడు. ఆయనకు కద్రువ, వినతయను యిరువురు భార్యలు. వారిలో కద్రువ యొక్క సంతానము వాసుకి వంటి పాములు. వినత యొక్క సంతానము గరుత్మంతుడు. ఒక రోజున కద్రువ, వినతలు సముద్రపు ఒడ్డునకు వ్యాహ్యాళికి వెళ్లారు. అక్కడవారికి కను దూరములో ఒక గుఱ్ఱము కనబడినది. దానిని చూచిన యీసవతులిద్దరు దాని తోక నల్లగానున్నదా? లేక తెల్లగానున్నదాయన్న వివాదములోమునిగారు. కద్రువ దానితోక నల్లగానున్నదని, వినత తెల్లగానున్నదని వాదించడమారంభించారు. దగ్గరకు వెళ్లి చూద్దామంటే సూర్యాస్తమయమౌతోంది, కశ్యపప్రజాపతి ఇంటికి వచ్చి సాయంకాలము చేయవలసిన అగ్నిహోత్రకార్యాన్ని ప్రారంభించే సమయమా సన్నమయింది. ఆ సమయములో ఆయనకు ధర్మ పత్నులయిన వారిద్దరూ భర్తప్రక్కనుండాలి. కావున వాళ్లిద్దరు మరునాడు వచ్చి చూద్దామని, అప్పుడు వారిలో ఎవరిమాట నిజమైతే వారు గెలిచినట్లు, ఆ గెలిచినవారికి ఓడినవారు జీవితాంతము దాసులుగా నుండాలని నిర్ణయించుకొని యిద్దరూ ఇంటికి వెళ్లారు.

కద్రువ ఆ రాత్రి తన సంతానమైన పాములను పిలిచి జరిగినదంతా వివరించి ఆ పోటీలో తాను గెలుపు సాధించాలని, తనకు వినత దాసీగా మారాలని, తాను గెలవవలెనంటే ఆ అశ్వము యొక్క తోక నల్లగా కనబడవలెనని, అందుకు వీలుగా తన సంతానమైన పాములను వెళ్లి ఆ గుఱ్ఱము తోకకు చుట్టుకొనమని అడిగింది. అందుకు వాసుకి వంటి పెద్దపాములు అది మోసము చేయుటయని, అటువంటి నీచకార్యానికి తాము పాల్పడమని చెప్పి వెనుతిరిగాయి. కానీ కొన్ని బురదపాముల వంటివి తల్లి మాట ప్రకారము వెళ్లి గుఱ్ఱము తోకకు చుట్టుకున్నాయి.

మరునాడు సవతులిద్దరూ వెళ్లి చూచేసరికి ఆ గుఱ్ఱము తోక నల్లగా కనబడింది. దాని ఫలితంగా కద్రువ గెలిచింది, వినత ఓడి దాసీగా మారింది. వినతా సుతుడైన గరుత్మంతుడు దాసీ పుత్రుడయాడు. రోజూ పాములకు సేవ చేయడము ఆతని పని అయింది. ఒక రోజున గరుత్మంతుడు ఎంతో విసుగుచెంది తల్లి వద్దకు వచ్చి తనకు పట్టిన యీ దాస్యము నుంచి విముక్తి నందే ఉపాయములు తెలుపమని వేడుకున్నాడు. అందుకు వినత అమృతము

తెచ్చి కద్రువకు యిచ్చినచో ద్యాసవిముక్తి కలుగునని, అందుకు మరియొక మార్గములేదని కుమారునికి తెలిపింది. తల్లి మాటవినగానే గురుత్మంతుడు ఆకాశమునుంచి అమృతము తెచ్చి, కద్రువ కియ్యడము జరిగింది. ఫలితముగా ద్యాసవిముక్తి జరిగింది.

పైన పేర్కొనబడిన గాధకు 'సుపర్ణాఖ్యానము అనిపేరు. సుపర్ణమంటే మంచి రెక్క అని అర్థము. సుపర్ణమన్న యీ సంస్కృత భాషాపదానికి సూర్యకిరణమన్న మరియొక అర్థము కూడా కలదు. కద్రువ పాములకు తల్లి. సంస్కృతములో పాముకు 'అహి' అని పేరు. ఈ అహియన్న మాటకు మేఘమనికూడా మరియొక అర్థము కలదు. గురుత్మంతడు అమృతమును తీసుకువచ్చాడు. అమృతమన్న మాటకు నీరు అని కూడా అర్థముకలదు.

పైన తెలిపిన వివరణను బట్టి సూర్యకిరణము భూమిలోని నదులు, సముద్రము నుంచి నీటిని గ్రహించి మేఘములకు అందించగా ఆమేఘములు వర్షించి ఆ వర్షములవలన పంటలు పుష్కలముగా పండినవని, దాని ఫలితముగా దరిద్రముపోయి దాస్యము అంతరించినదని తెలుపుట జరిగినది. ఈ విధముగా పురాణగాధలన్నింటికి అంతరార్థములు కలవని గ్రహించాలి.

మనదేశానికి భారతదేశమని పేరుగదా! 'భా' అనగా కాంతి, 'రతి' అనగా యిష్టము. దీనిని బట్టి భారతీయులు కాంతి యందిష్టము కలిగియుందురని అర్థము. చీకటి అంటేవారికి సుతరామూ యిష్టముండదు. అందుకే "తమసోమా జ్యోతిర్గమయా" అన్నది వేదముయొక్క ఆదేశము. అనగా చీకటి నుంచి వెలుతురులోనికి రమ్మని అర్థము.

'భారత' అన్న మాట ఎవరో వ్యక్తి యొక్క నామధేయము కాదు. ఇది సాక్షాత్తు వేదము అందించిన నామము. అసలు వేదమంటే జ్ఞానము – విద్‌జ్ఞానే – అని అర్థము. ఆ మహత్తర జ్ఞానము తెలియజేసిన శబ్దమే' 'భారత' యన్నమాట. వేదములో "అగ్నిమిచ్ఛధ్వం భారతా!" అన్న మంత్రము ఇందుకుదాహరణ.

భరతభూమి యజ్ఞభూమి లేక కర్మభూమి. దేవతల నివాసమైన స్వర్గము కేవలము భోగభూమిమాత్రమే. వారు అనుభవించే భోగములు యజ్ఞభూమియైన భరత భూమిలో చేసే యజ్ఞకర్మల యొక్క ఫలితములు మాత్రమే.

**రథ సప్తమిరోజు జిల్లేడాకుపై రేగుపండు పెట్టుకుని స్నానం చేద్దాం ఎందుకంటే...**

ఆమ్లగుణం గల రేగుపండూ, జిల్లేడాకూ శిరస్సుకు ఎంతోమేలు చేస్తాయి. ఆకులోని రసాయనాలు మెదడును చల్లబరుస్తాయి. జుట్టు కుదుర్లను గట్టిపరుస్తాయి. చర్మవ్యాధులను అరికడతాయి. అంచేత తలపై భుజాలపై పెట్టుకుని స్నానం చేయటం సంప్రదాయం. సూర్యుడు ఆరోగ్యప్రదాత కనుక సూర్య జయంతి (సప్తమి) రోజు ఆయనకిష్టమైన అర్కపత్రములు (జిల్లేడాకులు)తో స్నానం చేయటమంటే ఆయన ఆశీస్సులు పొందటమే!

*సేకరణ : డి.జి. మీనారాణి*

# ఛత్రపతి జయంతి... విజయానికి వైజయంతి

**- హెబ్బార్ నాగేశ్వరరావు**

ఛత్రపతి శివాజీ జన్మించి మూడు వందల ఎనభై రెండేళ్లయింది. కలియుగం 4,731 మాఘ మాసంలో ఆయన జన్మించినట్టు అత్యధిక చరిత్రకారులు నిర్ధారించారు. క్రీస్తు శకం ప్రకారం 1630 ఫిబ్రవరి 19వ తేదీన ఆయన జన్మించాడట. శివాజీ తాత-పితామహుడు – మాలోజీ భోసలే అహమద్‌నగర్ కేంద్రంగా పెత్తనం సాగించిన 'నిజాంషాహీ' రాజ్యంలో ఒక ప్రధాన సేనానిగా పనిచేశాడు. ఆయన మాతామహుడు – తల్లి తండ్రి లోకోజీ యాదవరావు అదే "రాజ్యం"లోని గొప్పఅధికారి. ఇది క్రీస్తుశకం పదహారవ శతాబ్ది చివరి రోజుల మాట. పదిహేడవ శతాబ్ది ఆరంభంలో శివాజీ తండ్రి షహాజీ భోసలే గొప్ప వీరుడు. నిజాం షాహి "రాజ్యం" లోనే కాకుండా బిజాపూర్ కేంద్రంగా అధికారం చెలాయించిన 'ఆదిల్‌షా' రాజ్యంలోనూ, మన దేశంలోని అధిక ప్రాంతాలను దురాక్రమించి ఉండిన మొఘలాయిల దర్బారులోను కూడ షహాజీ గొప్ప పదవులను పొందాడు. మూడు రాజ్యాల మన్ననలకు పాత్రుడయ్యాడు. శివాజీ తన పూర్వులవలె విదేశీయ దురాక్రమణదారులకు కొలువు చేయడానికి అంగీకరించకపోవడం భరతమాత పుణ్యఫలం-భారతీయులకు వరం.

"ఆదిల్షాహీ" రాజ్యంలో గొప్ప "సామంతుడి"గా షహాజీ మహారాష్ట్రలోని పూణే ప్రాంతంలోను, కర్ణాటకలోని బెంగుళూరు ప్రాంతంలోను చిన్న చిన్న సంస్థానాలను ఏర్పాటు చేసుకోగలిగాడు. అందువల్ల తల్లి పోషణలో ప్రధానంగా పూనా ప్రాంతంలో గడిపినప్పటికి శివరాజు పన్నెండు ఏళ్లు వచ్చేవరకు బిజాపూర్, బెంగుళూరు ప్రాంతాలకు కూడ తరచూ వెళ్ళేవాడు. శివాజీ బాల్యంలో గురువైన దాదాజీ కొండ దేవుడు శివపురం అన్న కొత్త గ్రామాన్ని నిర్మించాడు. అది తరువాత శివనేరి దుర్గంగా ప్రసిద్ధికెక్కింది. తల్లి జిజియాబాయితో కలిసి బాల్యంలో శివాజీ ఎక్కువ సమయం ఈ దుర్గంలోనే గడిపాడు. క్రీ.శ. 1642 లో పన్నెండవ ఏట శివాజీకి బెంగుళూరులో సాయిబాయి అన్న బాలికతో వివాహం జరిగింది. ఈ పెళ్ళి సందర్భంగా షహాజీ తన కుమారుని పూనా సంస్థానానికి అధిపతిగా అభిషేకించాడు. పూనాకు తిరిగివచ్చిన శివాజీ పూనా ప్రాంతాన్ని విదేశీయుల పెత్తనం నుండి విముక్తం చేసి స్వతంత్ర్య రాజ్యంగా నిర్మించడానికి నడుం బిగించాడు. శివాజీ ఛత్రపతిగా స్థాపించిన హిందూ సామ్రాజ్యానికి అది అంకురార్పణ.

శివాజీ స్వాభిమాన స్వాతంత్ర్య భావాలను పసికట్టిన బిజాపూర్ నవాబు పూనా సంస్థానాన్ని స్వాధీనం చేసుకోవలసిందిగా ధీరజ్ కూపడే, జేదే దేశ్‌ముఖ్ అన్న అధికారులను క్రీ.శ. 1644లో ఆదేశించాడు. శివాజీ వయస్సు అపుడు పదునాలుగేళ్లు. అయితే ఈ అధికారులిద్దరూ బిజాపూర్ ప్రభుత్వాన్ని ధిక్కరించి శివాజీకి విధేయత ప్రకటించారు. బిజాపూర్ నియంతల ప్రమాదాన్ని ఎదురించడానికి వీలుగా సంస్థానాన్ని సామ్రాజ్యంగా విస్తరింపజేయాలన్న సంకల్పం శివాజీకి అప్పుడే అంకురించింది. పడమటి కనుమల ఒడిలో ఉన్న తోరణ దుర్గాన్ని శివాజీ మెరుపుదాడి చేసి వశం చేసుకున్నాడు. బిజాపూర్ "ప్రభుత్వం"తో బాహాటంగా సంఘర్షణకు దిగాడు. ఈ సంఘర్షణకు పరాకాష్ఠ సువిశాల హిందూ సామ్రాజ్య నిర్మాణం. తోరణ దుర్గంలో లభించిన ఐదు లక్షల రూపాయల సొమ్మును, తోరణకు ఐదుమైళ్ల దూరంలో ఉన్న రాజగఢ్ గిరి దుర్గాన్ని శివాజీ శత్రు దుర్భేద్యంగా రూపొందించాడు. అది శివాజీ మొదటి రాజధాని. క్రీ.శ. 1647 లో శివాజీ "కొండానా" – సింహగఢం – దుర్గాన్ని జయించాడు. కానీ తండ్రి షహాజీని బిజాపూర్ "దొరలు" బంధించడంతో శివాజీ వ్యూహాత్మకంగా రాజీ కుదుర్చుకున్నాడు. తండ్రిని బంధ విముక్తని చేయడానికై సింహగఢాన్ని 1649 లో బిజాపూర్ నవాబుకు అప్పగించాడు. ఆ తరువాత సింహగఢాన్ని మళ్లీ పట్టుకొనడం శివాజీ సామ్రాజ్య విస్తరణలో సహజ పరిణామం.

1654 నాటికి పురంధర దుర్గంతో సహా అనేక కోటలు శివాజీ రాజ్యంలో భాగమయ్యాయి. క్రమంగా పూనా ప్రాంతంలోను సహ్యాద్రి పర్వత శ్రేణికి వచ్చి పశ్చిమాన ప్రాంతంలోను గల దేశ్‌ముఖ్‌లు, దేశపాండేలు, వతన్‌దారులు వంటి అధికారగణం శివాజీపట్ల విధేయులుగా మారారు. జావళీ ప్రాంతంలో రెండేళ్లపాటు జరిపిన పోరాటాల ఫలితంగా 1656 నాటి సహ్యాద్రికి ఇరువైపులా కల ప్రాంతమంతా శివాజీ రాజ్యంలో భాగమైపోయింది. జావళీ, రాయగఢ దుర్గాలను కైవసం చేసుకొనడంలో వ్యూహాత్మకంగా శివాజీ బీజాపూర్ సుల్తానులపై ఆధిక్యతను సాధించగలిగాడు. రాయగఢదుర్గంలోనే 1674 లో శివాజీ పట్టాభిషేకం చేసుకున్నాడు.

శివాజీ ఉమ్మడి శత్రువుగా మారడంలో మొఘలాయిలు దక్షిణ భారత ప్రతినిధి ఔరంగజేబు బిజాపూర్ ప్రభుత్వంతో సయోధ్య కుదుర్చుకున్నాడు. అయితే ఔరంగజేబు కుటుంబ కలహంలో చిక్కుకోవడం అదనుగా తీసుకొని శివాజీ ఉత్తర కొంకణ ప్రాంతంలోకి దూసుకొనిపోయాడు. కల్యాణ్, భివండీ, మహూలీ వంటి పట్టణాలను

స్వాధీనం చేసుకోగలిగాడు. కళ్యాణ్‌లోను భివండీలోను నౌకాస్థావరాలను ఏర్పాటు చేసుకొని శివాజీ పడమట సముద్ర మార్గాలపై ఆధిపత్యం పొందగలిగాడు. కళ్యాణ్ దుర్గాన్ని స్వాధీనం చేసుకున్న సందర్భంగా తన సైనికులు బంధించిన ఒక ముస్లిం వనితను శివాజీ సోదరివలె సమ్మానించి అత్తింటికి పంపించడం భారతీయ సద్గుణ సంపదను చాటించిన చారిత్రక సంఘటన. అమాయకులైన హిందూ యువతుల మానాలను ఇస్లాం జిహాదీ మూకలు మట్టిపాలు చేస్తుండిన సమయంలో, ముస్లిం వనిత మర్యాదను రక్షించిన ధర్మవీరుడు శివాజీ. క్రీ.శ. 1657 మే లో శివాజీకి శంభాజీ అన్న కుమారుడు జన్మించాడు. ఆ మరుసటి సంవత్సరం ఔరంగజేబు మొఘలాయి రాజ్యానికి అధిపతి అయ్యాడు. ఆ తరువాత ఇరవై రెండేళ్లపాటు ఔరంగజేబుకు ప్రధాన ప్రత్యర్థి శివాజీ.

శివాజీని మట్టు పెట్టడానికై బిజాపూర్ సుల్తాన్ ఆదిల్షా అఖీ పంపించిన అఫ్జల్‌ఖాన్ మట్టి కరచిన తీరు అఖిల భారతదేశాన్ని ఆశ్చర్యపరచిన మహా పరిణామం. బిజాపూర్ సేనాధిపతులందరిలోను అఫ్జల్‌ఖాన్ అతిభయంకరుడు, క్రూరుడు. హిందువులను సామూహికంగా హత్యలు చేయడంలోను, ఆలయ విధ్వంసం జరపడంలోను వాడు పేరు మోసినవాడు. సర్వమత సమ భావతత్వానికి, శివాజీ ప్రతినిధికాగా, అన్యమత నిర్మూలన ఉద్యమానికి నాటి ఔరంగజేబు, షయిస్థఖాన్, అఫ్జల్‌ఖాన్, వంటి వారు ప్రతినిధులు. వంచనతో తనను హతమార్చదలచిన అఫ్జల్ ఖాన్‌ను పులిగోళ్లతో చీల్చి వేయించడం ద్వారా శివాజీ నరసింహుడుగా భాసించాడు. అప్పటికి శివాజీ వయస్సు ఇరవై తొమ్మిది ఏళ్ళు క్రీ.శ. 1663లో ఔరంగజేబు ప్రతినిధిగా షయిస్తఖాన్ శివాజీని బంధించడానికి దండెత్తి వచ్చాడు. అయితే శివాజీ ఊహించని విధంగా షయిస్తఖాన్ శిబిరంపై మెరుపుదాడి జరిపాడు. పూనాలోని లాల్‌మహల్‌లో విడిదిచేసి ఉండిన షయిస్తఖాన్ నిద్రిస్తుండిన గదిలోని శివాజీ హనుమంతునివలె, ఘటోత్కచునివలె చొరబడినాడు. చిన్నప్పుడు లాల్‌మహల్‌లో అనేక ఏళ్లు నివసించిన శివాజీకి ఆ భవనంలోకి చొరబడిన తరువాత పరిచారకులకు రక్షకులకు తెలియకుండా శివాజీ అతి రహస్యంతో షయిస్తఖాన్ ఉండిన గదిలో ప్రత్యక్షమయ్యాడు. షయిస్తఖాన్‌కు చావు తప్పినప్పటికీ చేయి లొట్టపోయింది. కుడిచేయి బొటనవ్రేలు తెగిపోయింది. వాడి కుమారుడు హతుడయ్యాడు. షయిస్తఖాన్ కాని, అఫ్జల్‌ఖాన్ కాని, ఔరంగజేబుకాని, అలీ ఆదిల్షాలు కానీ ప్రజలకు "క్షతి"ని – బాధను – తొలగించిన పాలకులు కాదు.

అందువల్ల వారు క్షత్రియులు కాదు. వారు "క్షతి" కారకులు, ప్రజలను, నిరాయుధులను హత్యచేసిన ఆతతాయిలు - బీభత్సకారులు - టెర్రరిస్టులు. క్షతిని తొలగించి సర్వప్రజలను సమానంగా ఆదరించి పాలించిన నిజమైన క్షత్రియుడు శివాజీ - అందువల్ల రాక్షసుల వంటి అఫ్జల్‌ఖాన్ తదితరులను ఎలాగైనా వధించడమే ధర్మమన్న రాజధర్మాన్ని మళ్లీ నిలబెట్టిన వాడు శివాజీ. అంతకు పూర్వము. శతాబ్దులపాటు మన దేశంలోని రాజులు విదేశాల నుండి వచ్చి పడిన జిహాదీ హంతకులను రాజులవలె సంభావించడం వల్ల, ఆ హంతకులు స్వదేశ రాజులను వంచించి, వెన్నుపోటు పొడిచి హత్యచేసి క్రమంగా దేశాన్ని కబళించారు. నేరస్థులను నేరస్థులుగానే పరిగణించాలన్న నీతిని పునరుద్ధరించిన స్వదేశీ వీరుడు శివాజీ. దాదాపు ఇరవై వేలమంది సైన్యం నెలకొని ఉండిన షయిస్తఖాన్ స్థావరంలోకి కేవలం నాలుగువందల మంది సైనికులతో రాత్రిపూట చొచ్చుకొనిపోయి, ఆ బీభత్సకారుడిని తరిమివేయడం అపూర్వ సాహసం. అభిమన్యునిలా షయిస్తఖాన్ స్థావరంలోకి దూసుకుపోయిన శివాజీ అర్జునునిలా మ్లేచ్ఛ వ్యూహాన్ని ముక్కలు చేయగలిగాడు. షయిస్తఖాన్ పలాయనంతో కొంకణం పశ్చిమ మరాఠా సీమలలో మొఘలాయిల పరాజయం ధ్రువపడింది. క్రీ.శ. 1664 సం॥లో శివాజీ ప్రస్తుతం గుజరాత్‌లో ఉన్న సూరత్ ఓడ రేవును స్వాధీనం చేసుకున్నాడు.

షయిస్తఖాన్ వంటి అమిత క్రూరుడు కుంగిపోవడంతో ఔరంగజేబు 1665లో మీర్జాజయసింగ్, దైలేర్‌ఖాన్‌ను శివాజీ మీదికి తోలించాడు. పదిహేను వేలమంది సైన్యంతో వచ్చిన ఈ ఇద్దరు మొదట "పురంధర" దుర్గాన్ని శివాజీ నుండి వశపరచుకున్నప్పటికీ ఆ తరువాత ఈ హైందవ వీరుని దాటికి తాళలేక రాజీ పడవలసి వచ్చింది. కలసికట్టుగా తమపై తిరగబడుతున్న గోల్కొండ, బిజాపూర్ సుల్తానులను ఓడించడానికి శివాజీ సహాయం అవసరమని జయసింగ్ ఔరంగజేబును ఒప్పించాడట. అందువల్ల ఔరంగజేబు శివాజీని తన రాజధానికి ఆహ్వానించాడు. రెండు వందల యాభైమంది అనుచరులతో 1666 మే నెలలో ఆగ్రాకు చేరిన శివాజీ ప్రయాణాల ఖర్చులను ఔరంగజేబు భరించాడట. కానీ ఆగ్రా చేరిన శివాజీని ఔరంగజేబు వంచించాడు. ఆయనను, తొమ్మిదేళ్ళ శంభాజీని బంధించాడు. మూడు నెలల తర్వాత 1666 ఆగస్టులో శివాజీ మొఘలాయి షహరాను ఛేదించి కుమారునితో సహా అదృశ్యమయ్యాడు. మధురకు చేరుకుని కుమారున్ని అక్కడ భద్రంగా మిత్రుల

వద్ద ఉంచి సన్యాసి వేషం వేసుకుని ప్రయాగకు వెళ్ళి చుట్టు తిరిగి భద్రంగా రాజధాని రాయగఢ్‌కు చేరుకున్నాడు. ఆ తరువాత అటు మొఘలాయిల ఆధీనంలోని సీమలను, ఇటు బిజాపూర్ దురాక్రమణలోని భూమిని స్వాధీనం చేసుకొనే కార్యక్రమాన్ని1674 వరకు శివాజీ అప్రతిహతంగా కొనసాగించాడు.

ఈ సుదీర్ఘ స్వాతంత్ర్య సమర యాత్రలో శివాజీ ప్రభువువలె పెత్తనం కోసం ప్రాకులాడలేదు. సైనికునివలె యుద్ధరంగంలో ముందుండి పోరాడాడు. విదేశీయుల భారిన పడి విలపిస్తుండిన భరతమాత దాస్య శృంఖలాలను ఛేదించడమే శివాజీ లక్ష్యం. అందువల్ల క్రీ.శ. 1649 నాటికే ఆయనకు ఒక స్వతంత్ర రాజ్యం ఏర్పడినప్పటికీ దాదాపు ఇరవై ఏళ్లపాటు సిహాసనాన్ని అధిష్టించలేదు. తనకు తాను సమ్రాట్టుగా ప్రకటించుకొనలేదు. రాజ్యం సువిశాల సామ్రాజ్యంగా మారిన తరువాత గురుదేవుడు సమర్థరామదాసు ఆదేశించిన తరువాత మాత్రమే, ఆయన సామ్రాజ్యాభిషిక్తుడయ్యాడు. అధికార దాహం లేకుండా సమాజాన్ని సేవించడం అన్న ఆదర్శానికి సజీవ విగ్రహం ఛత్రపతి శివాజీ. ఆయన సాగించిన సమరంలో చీకటి మూకలపై దూకిన వెలుగుల శరాలవలె అనేకమంది స్వదేశీయ వీరులు శివాజీకి బాసటగా నిలిచారు. బాజీ ప్రభుదేశ్‌పాండే, తానాజీ మాల్‌సరే వంటివారు శివాజీ ఉద్యమ యజ్ఞాన్ని తమ రక్తాన్ని ధారపోసి వెలిగించారు. ప్రాణాలను అర్పించి అజరామరులయ్యారు. క్రీ.శ. 1660 జూలైలో పన్హాలా దుర్గంలో చిక్కువడిన శివాజీ నలభై మైళ్ల దూరంలోని విశాలగఢ దుర్గానికి చేరడానికై శత్రు సేనలను చీల్చుకుంటూ పురోగమించాడు. అయితే అతి తక్కువ సైన్యంతో బయలుదేరిన శివాజీని పదిహేను వేలమంది బిజాపూర్ సైనికులు వెన్నంటినారు. బిజాపూర్ సైన్యాలను కనుమ మార్గాలలో ఒక రోజంతా నిరోధించడం ద్వారా బాజీ ప్రభువు, శివాజీని సురక్షితంగా విశాల్‌గఢ దుర్గానికి చేరడానికి వీలు కల్పించాడు. ఈ ప్రయత్నంలో బాజీ ప్రభువు తన ప్రాణాలొడ్డి తన ప్రభువు ప్రాణాలను కాపాడాడు. అలాగే 1670 ఫిబ్రవరిలో "సింహగఢాన్ని స్వాధీనం చేసుకున్న తానాజీ ఆ యుద్ధంలో మరణించాడు. "గఢం" కోట – మిగిలింది, "సింహం" తానాజీ వెళ్ళిపోయింది. అని శివాజీ ప్రసంశకు పాత్రుడైన తానాజీ చరితార్థులలో అగ్రగణ్యుడు.

క్రీ.శ. 1674 జూన్‌లో శివాజీ 'ఛత్రపతిగా' సింహాసనాన్ని అధిష్టించాడు. హిందూ సామ్రాజ్యాన్ని ఆరంభించినట్టు ప్రకటించాడు. అయితే ఈ సామ్రాజ్యాన్ని ఆయన

గురువుకు దక్షిణగా సమర్పించి విదేశీయుల పాలనలో మరుగుపడి ఉండిన సనాతన సంప్రదాయాన్ని పునరుద్ధరించాడు. యుగాలుగా స్వదేశీయ రాజులు నిర్ణీత సమయంలో సర్వజిత్ యజ్ఞాన్ని చేసి తమ కోశాగారంతో సహా సర్వస్వాన్ని సమాజానికి సమర్పించేవారు. ఆ పద్ధతిని శివాజీ మళ్లీ నిలబెట్టాడు. గురు మాధ్యమంగా సామ్రాజ్యాన్ని సమాజానికి సమర్పించిన శివాజీ, సమాజ ప్రతినిధి మాత్రమే సామ్రాజ్యాన్ని పాలించాడు. హిందూసామ్రాజ్యం మత ప్రభుత్వ వ్యవస్థకాదు. అనాదిగా ఈ దేశంలో అనేక మతాలున్నాయి. వేదమతాలున్నాయి. వేదాన్ని ప్రమాణంగా అంగీకరించని మతాలు కూడ పుట్టాయి. ఇవన్నీ కూడ హైందవ జాతీయతలో భాగమయ్యాయి. అందువల్ల హిందుత్వం ఈ దేశంలోని వివిధ మతాలు, భాషలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, విద్యలు, విభాగాలు, వ్యవసాయ వాణిజ్యాలు, ఆహార-ఆహార్యాలు వంటి వైవిధ్యాల సంపుటం. వైవిధ్యాలను పరిరక్షించడం హిందుత్వం లక్ష్యం, అందువలన హిందూ సామ్రాజ్యంలో మత వైవిధ్యాలకు కూడ రక్షణ లభించింది. మత వైవిద్యాలకు నష్టం చేసిన వారు విదేశాల నుండి వచ్చి పడిన విదేశీయ జిహాదీలు. శివాజీ సామ్రాజ్యంలో ఇస్లాంతో సహా అన్ని మతాలకు సమాన రక్షణ లభించింది. హిందుత్వం అంటేనే సర్వమత సమభావం. దీనికి పూర్తి భిన్నంగా పక్కనే ఉండిన ఔరంగజేబు రాజ్యంలో ఇస్లామేతర మతాల నిర్మూలనకు నిరంతరం ప్రయత్నం జరిగింది. శివాజీ స్థాపించిన హిందూ సామ్రాజ్యం కాని, ఈ దేశంలో అనాదిగా వికసించిన హిందూ జాతి కాని ఏ మతానికి వ్యతిరేకం కాదు. మత వైవిద్యాలను ధ్వంసం చేసే ఉన్మాదపు వృత్తికి, రాక్షస స్వభావానికి మాత్రమే హిందూ జాతీయులు అనాదిగా వ్యతిరేకించారు. వాటిని ప్రతిఘటించారు. కలియుగంలో అలా ప్రతిఘటించిన పుష్యమిత్రుడు, సముద్రగుప్తుడు, విక్రముడు, శాలివాహకుడు, భోజుడు, రాణాప్రతాపుడు, కాకతీయ విజయనగర పాలకులు వంటి జాతీయ వీరులపరంపరలోనివాడు ఛత్రపతి శివాజీ. మహాకవి గుఱ్ఱం జాషువా అన్నట్లు ఆయన "హిందూ ధరణీ శుభంకరుడు, మహాకవి గడియారం వేంకట శేషశాస్త్రి అన్నట్టు ఆయన "హైందవ ధరిత్రీ సత్య సింహాసన ప్రారంభుడు".

అతని స్మృతులు, మధుర స్మృతులు....

# ఓంకార స్వరూపుడు.

డా॥ అనంతలక్ష్మి

"ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ" అని ఈ జగత్సృష్టికి మూలకారకమైనధ్వని, సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపం అని ఓంకారం గురించి వేదాలు చెప్పినమాట. ఈ ఓంకారానికే "ప్రణవం" సూక్ష్మపంచాక్షరి అనే పేర్లుకూడ ఉన్నాయి. అనాది అయిన పరమాత్మ సృష్టికార్యోన్ముఖుడైనపుడతని నుండి వెలువడిన తొలిధ్వని ఓంకారమని పురాణాలన్నీ చెప్పేమాట, వివరాలలో స్వల్ప భేదాలున్నా, మౌలికమైన అంశం మాత్రం ఇదే, ఎప్పటి కప్పుడు క్రొత్తగా ఉండేది కనుక "ప్రణవం" అనికూడ పిలువబడుతోంది.

తన ముఖంనుండి పుట్టిన ఈ 'ఓం' తన మంత్రమేనని, తానే ఉపదేశించానని, ఓంకారమనేది వాచకము, తాను వాచ్యుడు, అది తన స్వరూపుమే, దానిని నిత్యం స్మరించటం తనని స్మరించటమేనని శివుడు స్వయంగా చెప్పినట్టు శివపురాణములో ఉంది.

పంచముఖుడైన శివుని ఉత్తరముఖం నుండి ముందుగా 'అ'కారం, పశ్చిమ ముఖంనుండి 'ఉ' కారం, దక్షిణముఖం నుండి 'మ'కారం, తూర్పుముఖం నుండి బిందువు, మధ్యముఖం నుండి నాదం పుట్టి, అవి అయిదువిధాలుగా విస్తరించి, మళ్ళీ అయిదూ కలిసి ఒక్కటిగా కూడి 'ఓం' అనే ఏకాక్షర మంత్రం అయింది. నామ రూపాత్మకమైన సకల జగత్తు ఈ మంత్రంచే వ్యాపించబడి ఉంది.

అ,ఉ,మ, బిందువు, నాదం – పుట్టిన క్రమంలోనే, న, మ, శి,వా,యః అనే అక్షరాలు ఉద్భవించి, స్థూలపంచాక్షరిగా రూపుదాల్చాయి. సూక్ష్మ పంచాక్షరి నిరాకార నిర్గుణ పరబ్రహ్మవాచకం. స్థూలపంచాక్షరి సాకార, సగుణ భగవానుని భోధిస్తుంది. ఈ పంఛాక్షరి నుండి ఒక్కొక్క దానిలోను అయిదు వర్ణాలున్న అయిదువర్గాలు జనించాయి. శిరోమంత్రమనే నాలుగవ పాదంతో సహా మూడుపాదాల గాయిత్రిమంత్రం పుట్టింది. దాని నుండి సమస్తవేదాలు, వాటి నుండి కోట్లాది మంత్రాలు, పుట్టాయని, ఆయా మంత్రాలవల్ల, ఆయా సిద్ధులు మాత్రమే లభిస్తాయి. కాని, వాటికి మూలమైన 'ప్రణవము' వలన సర్వ సిద్ధులు కలుగుతాయని, ప్రణవంవలన భోగమూ, మోక్షమూ కూడా సిద్ధిస్తాయని శివపురాణం చెపుతోంది.

అవాఙ్మానస గోచరుడైన పరమాత్మ 'ఓం' కారమనే ఒకే ఒక అక్షరం చేత నిర్దేశించ బడతాడు. 'ఓం' కారంలో ఉన్న 'అ' కారం సృష్టి కారకుడైన బ్రహ్మను, ఉకారం స్థితి కారకుడైన విష్ణువుని, 'మకారం శివుని సూచిస్తాయి. ఓంకారంలోని అకారం సృష్టికర్త, ఉకారం మోహింపచేసేది. మకారం సదా అనుగ్రహదాయకం

‘మ’ కార వాచ్యుడైన శివుడే ‘బీజి” “అ” కారం బీజం, ఉకార వాచ్యుడైన విష్ణువు యోని ప్రకృతికి పురుషుడికి ప్రభువైన మహేశ్వరునిలో బీజి, బీజం, యోని ఐక్యమవుతాయి. ఆయన నాదస్వరూపుడు. ఇక్కడి నుండి సృష్టి కొనసాగుతుంది– అని ప్రణవంలో ఉన్న ఐదు అంగాల వైశిష్ట్యాన్ని శివపురాణం విశదీకరించింది.

ఓంకారం ముందు చేరితేనే ఏ శబ్దమైనా “మంత్రత్వం” (అంటే మంత్రం అనేస్థాయి) పొందుతుంది.

అ,ఉ,మ అనే ఓంకారంలోని స్థూల అంగాలు సృష్టి, స్థితి, లయాలకు సంకేతాలు, బ్రహ్మాండము, సృష్టి మాత్రమే కాదు, సృష్టి, స్థితి లయం అనే మూడు స్థితులను ప్రతిజీవి నిరంతరం అనుభవిస్తూనే ఉంటుంది. దానికి కూడ వాహిక ఓంకారమే. దీనిని మనం ప్రత్యక్షంగా అనుభవించి తెలుసుకోవచ్చును.

జీవి యొక్క ఉనికి ఉచ్ఛ్వాస, నిశ్వాసలమీద ఆధారపడి ఉంటుంది. శరీరంలో ప్రాణం ఉన్నదనటానికి గాలిపీల్చి వదలటమే గుర్తు. కొద్దిగా శబ్దంవచ్చేట్టు గాలిపీల్చితే ‘సో’ అనే శబ్దం వస్తుంది. అలాగే వదిలినపుడు ‘హం’ అనేధ్వని వినబడుతుంది. ఈ రెండు కలిస్తే ‘సోహం’ ఈ రెండింటిలోనూ ఉన్న భౌతికతను అంటే హల్లులను తొలగిస్తే మిగిలేది “ఓ” “మ్” అదే ‘ఓం’ శబ్దం వినపడకుండా నెమ్మదిగా శ్వాసక్రియ జరుగుతున్నపుడు ప్రతి జీవి చేసే నాదం “ఓం” ఈ ‘ఓ’ అనేధ్వని ‘అ’ ‘ఉ’ ల కలయిక ప్రాణవాయువు స్వీకారం, దానితో జీవి అస్తిత్వానికే బలం చేకూర్చటం అనే బ్రహ్మ, విష్ణువుల కృత్యాలను ‘ఓ’ నిర్వర్తిస్తుంది. మళ్ళీ ఆగాలిని బయటి గాలిలో లయం చేయటమనే విధిని ‘మ’ కారం నిర్వహిస్తుంది. ఈ విధంగా ప్రతిజీవి, అప్రయత్నంగా ఓంకార నాదం చేస్తూనే ఉంటుంది. అయితే, తెలిసి, శ్వాసప్రక్రియలో ఓం కారాన్ని దర్శిస్తూ, వింటూ అనుభూతిచెందేవారు నాదోపాసకులు, యోగులు అనిపించుకుంటారు.

నిశ్వాస, ఉచ్ఛ్వాస క్రమంలో గమనిస్తే ‘సోహం’ అన్నది ‘‘హంసః’’ గ వినబడుతుంది. ఈ హంస స, హ, అనే రెక్కలున్నది. దానిపై ఓం అనే ప్రాణం కదులుతూ ఉంటుంది. అందుకే ప్రాణాన్ని ‘హంస’ అనటం ఈ ‘ఓం’ ని హంసగాయిత్రి అని కూడ అంటారు. పాలను, నీళ్ళను వేరు చేసేది కూడ ఈ హంసయే. పీల్చిన గాలిలోని ప్రాణవాయువుని గ్రహించి, మిగిలిన వాటిని వెలుపలికి పంపుతుంది కదా!

ఇటువంటి ఓంకార స్వరూపుడైన సదాశివుడు లింగాకృతిగా దిగివచ్చిన రోజు శివరాత్రి. కనుక ఆనాడు శివుని అర్చించటం శ్రేయోదాయకం. ప్రతి జీవిలోను ఉఛ్ఛ్వాస నిశ్వాస రూపంగా ఉన్న సూక్ష్మ పంచాక్షరి అయిన ఓంకారాన్ని రుద్రుడుగా అనుభూతి చెంది ఆరాధించటం ప్రారంభించదగిన రోజు శివరాత్రి.

# నేటి అవసరం గోరక్షణ-గోసంవర్ధనం

**- మూలం: పూజ్య సంత్ శ్రీ రామచంద్రదాస్ జీ మహారాజ్**
**భావానువాదం: 'మంజీరా'**

(గత సంచిక తరువాయి)

ఆర్థిక సమృద్ధికి ఆధారం గోవు. ఆవు లేకుండా ఆర్థిక సమృద్ధి అసంభవం. గో సేవకులైనవారికి స్వయంపోషకత్వం, ఆత్మ నిర్భరత సహజంగా సిద్ధిస్తాయి. గో సేవకునికి పరావలంబనం అవసరం లేని ఒకరోజు అనవచ్చు, గోవు ద్వారా లభ్యమయ్యే గవ్య పదార్థాల ద్వారా గోసేవకునికి ఆర్థిక వనరులు సమకూరుతాయి. గోవు వల్ల అతనికి ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుంది. వ్యవసాయంద్వారా గోసేవ చేసే వారికి శ్రీ కృష్ణుని దివ్య దర్శనంతో పాటు అతని ప్రాప్తి కూడా కలుగుతుంది. దీనికి ఋజువేమిటి అంటారా ? ఆదిపురాణంలో వేదవ్యాస భగవానుడు ప్రవచించినదే ఋజువు. వారంటారు.

**"శ్రీ కృష్ణః ప్రాప్యతే విప్ర నిత్యం గోకుల సేవయా"** వేద శాస్త్రాల్లో దేవుని మహిమ కన్నా గోమహిమనే ఎన్నోరెట్లు అధికంగా ప్రస్తుతించడం జరిగింది. అయితే సామాన్య వ్యక్తులు గోవును పశువుగా భావిస్తారు. గో సేవ చేసే వారెన్నడూ దరిద్రులు కారు.

మా చిన్నతనంలో పెద్దలు చెప్పగా వినేవాళ్లం ఓ కాలం ఇలా ఉండేది. వరుణ్ని చూడడానికి ఓ మంగలి నిచ్చి పురోహితుణ్ణి పంపేవారు. వారితో ఆ ఇంటి వ్యక్తికూడా ఒకరుండేవారు. పురోహితుని సేవ కోసం మంగలిని వెంట తెచ్చేవారు. అయితే ఆ మంగలికి మొదటే చెప్పి ఉంచిన విధంగా అతడు, పురోహింతుడు, ఇంటి వ్యక్తి పెళ్లి వారితో మాట్లాడుతున్న సమయంలో మెల్లగా బయటకు వెళ్ళి, పెళ్ళివారి గోశాల చూసివచ్చేవాడు. గోశాలలో ఎన్ని గోవులను కట్టివేసే గుంజులు ఉన్నాయో లెక్కపెట్టుకొని వచ్చి పురోహితుని చెవిలో చెప్పేవాడు. నలబై గుంజలున్నాయంటే ఇక నిశ్చితంగా అమ్మాయిని ఆ ఇంటికి ఇవ్వవచ్చునని నిర్ధారించుకునేవారు. నలభై గోవులున్నాయంటే పాడి సమృద్ధిగా ఉంటుంది. అమ్మాయి, పిల్లలు ఆరోగ్యంగా, బలంగా ఆనందంగా ఉండడానికి లోటు ఉండదు అని భావించేవారు. అయితే వరుని పక్షంవారు ఈ కిటుకు ముందే తెలుసు కనుక తమవద్ద ఇరవై అయిదు

గోవులే ఉన్న పక్షంలో మరో 15 గుంజలు ఎక్కువగా పాతించి, వాటికి ఆవులను కట్టివేసే తాళ్ళు కూడా బిగించి ఉంచేవారు'. మంగలి వచ్చి చూస్తే గుంజలు తక్కువగా కనిపించకూడదని ఈ ఉపాయం! గుంజలు ఎక్కువ కనిపిస్తే అమ్మాయి వివాహం తొందరగా అయిపోతుంది. ఆరోజుల్లో ఈ లాంటిస్థితి ఉండేదని పెద్దలు అంటుండేవారు. గోవంశంలేని ఇంటికి వారెంత సంపన్నులైనా అమ్మాయిని ఇచ్చేవారు కాదు. అబ్బాయికి వివాహం జరిగేదే కాదు.

పూర్వకాలంలో సంపదను వారికుండే గోవుల సంఖ్యతోనే లెక్కగట్టేవారు. ఎవరెంతధనవంతులో ఈ గోవుల సంఖ్యనే సూచించేది. గోసంతతి ఎంత ఎక్కువగా ఉంటే ఆ రాజు అంత గొప్పరాజని భావించేవారు. ప్రజభూమిలో నందుని కంటే కూడా రాధారాణి తండ్రి వృషభానుని గొప్పవానిగా చూసేవారు. ఎందుకంటే అతని వద్ద నందుని కంటే రెండు లక్షల గోవులు అధికంగా ఉండేవి. గర్గ సంహితలోని గోలోక ఖండంలో గోవుల సంఖ్యను బట్టి వాటిని పోషించే యజమానులకు ఇవ్వదగిన పదవులకు ఇచ్చి సన్మానించే విషయం ఇలా చక్కగా వర్ణించారు.

వృషభాను – 10 లక్షల గోవులను పోషించే వారు.

నంద – 9 లక్షల గోవులు పోషించేవారు.

ఉపనంద – 5 లక్షల గోవులు పోషించేవారు.

ఇదీ గాక ఓ వ్యక్తి ఎంత సుఖ సమృద్ధులతో తులదూగినా అతనివద్ద కనీసం ఒక్క గోవైనా లేకపోతే అతన్ని పరమ దరిద్రునిగానే జమకట్టేవారు. కనుక మీరు దరిద్రులు కాకూడదనుకుంటే ఆవులను పోషించండి. ప్రతివ్యక్తి తన ఇంటిలో కనీసం ఒకటైనా పోషించండి. పల్లెటూళ్లు, గ్రామాల్లో జన్మించిన వారు వారికి తగినంత భూమి ఉన్నట్లయితే తప్పకుండ గోవులను పోషించాలి. 2,3 ఎకరాలు భూమి దేవుడిస్తే తప్పక గోవులు పెట్టండి. ఇక గొప్ప నగరాలలో ఉండేవారు, మేడలు, ప్లాట్లలో ఉండేవారు గోవును తమవద్ద ఉంచుకోవడానికి వీలుకాదు. కనుక పట్టనానికి దూరంగా 20,25 కిలోమీటర్ల దూరంలో తమ ఫ్యాక్టరీ లేదా ఏదో పరిశ్రమ పెట్టుకున్నట్లయితే అట్టివారు తమ భావాలతో ఏకీభవించే వారిని కొందరిని జత చేసుకుని ఓ ట్రస్టుగా ఏర్పడి గ్రామీణ వాతావరణంలో ఓ విశాలమైన భూమిని తీసుకుని అక్కడ చక్కని అందమైన భారతీయ – దేశీయ గో సంతతిని పెంచినట్లయితే ఎంత బాగుంటుంది.

తమ ఇళ్ళలో జరిగే పండుగలను గోశాలలోనే జరుపుకోవాలని నిశ్చయించుకోవాలి. పిల్లల పుట్టిన రోజులు గోశాలలో జరుపుకుంటూ గోవులకు ఆ రోజు కడుపునిండా మేత, ధాన్యం బెల్లం తినిపించడం గోశాలలోని గోపాలురను సత్కరించడం, అందరూ గోపూజ చేయడం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. పుట్టిన రోజులు, వివాహదినాలు, సంస్మరణదినాలు ఏవైనా సరేవాటిని గోశాలతోనూ, గోవులతోనూ కలిసి మళ్ళీమళ్ళీ కుటుంబసభ్యులతో సహా జరుపుకుంటుంటే వారిలో ఉత్తమ సంస్కారాలు ఏర్పడతాయి. ఈ రోజుల్లో పిల్లల పుట్టిన రోజులు హోటళ్లలో జరుపుకోవడం జరుగుతున్నది. రాను, రాను అక్కడ సంస్కారాలు ఎలా అలవడతాయి?

బృందావనంలో ఒక చోటుంది. దాన్ని "ఖాక్‌చౌక్" అంటారు. అక్కడ మహారాజుల వారి సన్నిధిలో  ఎప్పుడూ గోవులు ఉండేవి 10-15 గోవులు ఎప్పుడూ ఉండేవి. స్థలం చిన్నది కావడం వలన 10-15 గోవులతోనే అది నిండి పోయేది. ఒకసారి బొంబాయి నుండి కొన్ని కుటుంబాలవారు వచ్చారు. అదే సమయానికి గోవులు బయటంతా తిరిగి మరలివస్తున్నాయి. అవి లోపలకి అడుగు పెడుతుండగానే వాటిని చూసిన పిల్లలు. 8,10 సం॥ల వారు ఒక్కసారిగా భయంతో అరిచారు. సింహం ఏదైనా ప్రవేశించిందా!  అన్నట్లు. వాళ్లంతా ఉరుకులు పరుగులతో పారిపోయి దేవాలయంలో దాక్కున్నారు. అక్కడి నుండి ఏడుపులు! అరుపులు. ఈ దృశ్యం చూసిన మహారాజావారు ఆశ్చర్యచకితులైనారు. ఆవులను చూసి "ఈ పిల్లలు ఇంత భయకంపితులెందుకయ్యారు." అని అడిగారు. ఆవులేమో అవి ముందుకు సాగిపోయాయిగాని పిల్లలను ఏడుపులు మాన్పించి బయటకు తేవడానికి ఎంతో ప్రయత్నించాల్సి వచ్చింది. రాజన్నారు " ఏమిటి దౌర్భాగ్యం? భరతవర్షంలో పుట్టిన ఈ పసివారు గోవులను చూసి భయపడుతున్నారు? ఆ కుటుంబాల పెద్దలు "మహారాజా" బొంబాయిలో ఆవులెక్కడ ఉన్నాయని పిల్లలంతా మొదటిసారి ఆవును, చూశారని, ఆ కారణంగా భీతిల్లారు తప్ప వేరేమికాదని, సంజాయిషీ ఇచ్చుకున్నారు.

కాబట్టి పెద్దపెద్ద నగరాల్లో ఉండేవారు కూడా మొదట చెప్పినట్లు ఒక ఆలోచన ఉండేవారు కలిసి గ్రామీణ  భాగంలో వీలైనంత భూమిని కొని గోశాలలలు పెట్టండి. చాలా గోశాలల్లో కమిటీలైతే పెద్దగా ఉంటాయి. కానీ ఆ కమిటీ సభ్యులు నెలకోసారైనా వచ్చి గోవులను చూసిన పాపాన పోరు. అలా రావడం తమ కర్తవ్యం అని భావించరు

కూడా. ఇలాంటి కమిటీల వల్ల ఏమి ఉపయోగం? వెళ్ళి గోవులను చూస్తుండాలి వాటి వీపు నిమురుతూ ఉండాలి. మేము గోవు పాలను, పెరుగును మాత్రమే సేవిస్తామని ప్రతిజ్ఞచేస్తూ తమ గోభక్తిని చాటుకోవాలి. గోవుపాలతో చేసిన మిఠాయిలనే పండుగలు, పర్వాల్లో వాడతామని నిశ్చయించు కోవాలి. ఇందువల్ల ఎన్నో లాభాలున్నాయి. గోరక్షణకు మరింత అవకాశం ఏర్పడుతుంది. పెద్దపెద్ద పారిశ్రామిక వేత్తలు శాస్త్రీయ పద్ధతిలోనూ గోసేవ చేయవచ్చు. ధార్మిక భావనతో పాటు ఆర్థిక దృష్టికోణం ఉన్నా తప్పులేదు. గోవు ద్వారా పెద్దఎత్తున సుఖ సమృద్ధాలను సాధించవచ్చని మన అర్థశాస్త్రం చెబుతుంది. ఇందులో నష్టపోయేమాటే లేదు. పద్ధతి ప్రకారం చేయగలిగితే అన్నీలాభాలే. ఎన్నో పరిశ్రమల వారు ఈ గోవుపాలతో అదనపు లాభాన్ని గడిస్తున్నారు. చరక సంహితలో పాలలో పదిగుణాలు ఉన్నాయని ఉంది.

**"స్వాదు శీతం మధు స్నిగ్ధం**
**బహలం శ్లీక్ష్ణ పిచ్ఛిలమ్**
**గురుమన్దం ప్రసన్నంచ**
**గవ్యం దశ గుణం పయః**

అంటే గోవు పాలు (స్వాదు) రుచికరమైనవి.
(శీతం) శీత (చల్లని)గుణము కలవి
(మధు) తీక్షణము కానివి
(స్నిగ్ధం) నేయి చమురు ( స్నేహం గలవి)
(బహలం) స్వచ్ఛమైనవి.
(శ్లీక్ష్ణ) జారుడు **గుణం** గలనున్ననిది
(పిచ్ఛిలమ్) జిగురు స్వభావము గలవి.
(గురు) – తేలికగా జీర్ణము కానివి
(మన్దం) నిదానముగా పని చేయునవి
(ప్రసన్నం) – నిర్దోషమైనవి
అని అర్థం .

బాల విజ్ఞానం

# బాల హైందవం

- నిర్వహణ - విజయలక్ష్మీ దేశాయ్

**చెప్పుకోండి చూద్దాం !**

1. బ్రహ్మ నివసించే లోకం పేరు ?
2. విష్ణుమూర్తి చేతిలో కత్తి పేరు ?
3. ఆదికావ్యం అని దేనినంటారు ?
4. వాల్మీకి మహర్షి కాకముందు (పూర్వనామం) పేర్లు ఏవి ?
5. మహాభారతమునకు మొదటి పేరు ?
6. భగవద్గీతలో మొదటి శ్లోకం ఏ పదంతో మొదలైంది ?
7. జనగణమన గీతం వ్రాసింది ఎవరు ?
8. అక్టోబరు 2న పుట్టిన ప్రముఖులెవరు ?
9. ఉగాది పండుగ వచ్చే తెలుగు నెల ఏది?
10. మీ పాఠశాలలు తెరిచే తెలుగు నెల ఏది ?

1. కోసల దేశం, 2. సుమిత్ర, 3. కుంతీపుత్రులు, (ధర్మజ, భీమార్జునులు) 4. సూర్యుని, 5. మహతి, 6. సునీతి, 7. నవంబరు 14, 8.బంకించంద్ర ఛటర్జీ, 9. సాయంకాల సంధ్యవేళ, 10. కృష్ణపక్షం లేక బహుళపక్షం.

1. వై. సుకన్య–కోవెల కుంట్ల, 2. కె. లాస్య– హైద్రాబాద్, 3. సాయిచరణ్–అనంతపురం.

గుడ్‌మార్నింగు కు గుడ్‌బై కొట్టూ !
శుభోదయమ్మని మొదలుపెట్టూ !!

## కథ - కృతజ్ఞత

ఒక గ్రామంలో పెద్ద చెరువున్నది. ఆ చెరువు చుట్టూ గట్టుపై పెద్ద పెద్ద చెట్లు వున్నాయ్. అందులో ఒక మర్రి చెట్టు కొమ్మలు చెరువు మీదకు విస్తరించి వున్నాయి. ఒక సారేమో గండుచీమ చెట్టుకొమ్మ మీద పాకుతూ పట్టు తప్పి నీళ్లలో పడిపోయింది. పాపం! చీమకు యీదరాక నీళ్లలో మునకలు వేస్తోంది. ఇదంతా చూస్తున్న కాకి ఎలాగైనా రక్షిద్దామనుకొని, ఒక మర్రి ఆకును ముక్కుతో కొరికి చీమకు దగ్గరగా జారవిడిచింది.

ఆకును చూసిన చీమ అమ్మయ్య అనుకుని ఆకుపై కెక్కింది. ఆ ఆకునీటిపై తేలుతూ ఒడ్డుకు చేరింది. కాకి చేసిన మేలుకు సంతోషించింది చీమ.

కొన్ని రోజుల తర్వాత ఒక వేటగాడు ఆ చెరువులో నీరుత్రాగటానికి వచ్చి, చెట్టుపై కాకిని చూచి, ఆహారం దొరికింది కదాని విల్లును ఎక్కుపెట్టాడు. బాణం గురి చూసి వదలబోతున్నాడు. క్రింద నున్న గండు చీమ చూసింది. తనకు మేలు చేసిన కాకికి, ప్రమాదం రాకూడదని, గబగబా పాకుతూ వచ్చి వేటగాని కాలును బలంగా కుట్టింది.

వేటగాని బాణం గురితప్పి ముందుకు దూసుకుపోయింది. కాకి ఎగిరిపోయింది. వేటగాడు ఏమి కుటిందోనని వంగి చూసేలోగా చీమ పారిపోయింది.

చిన్న చీమ కూడ తనకు మేలు చేసిన వారికి బదులు చేసింది. మరి మనం చేస్తున్నామా ?

## మనపద్యం-మణిపూస నేర్చుకుందామా !

అమ్మగారు, అన్నమును పెట్టు
నప్పుడు ఇంటిలో లేనివస్తువు, తెమ్మని తంటాలు
పెట్టబోకు ఉన్నదానితోతిని
తృప్తినొందుము పుత్రా !!

# స్వామి దయానంద సరస్వతి

**- డా॥ తుమ్మలపల్లి వాణీ కుమారి**

హైందవ ధర్మానికి మూలాలైన వేదాలకు భాష్యాన్ని వ్రాసి, ఆర్య సమాజాన్ని స్థాపించి, హైందవ జాతిలో నవ్య చైతన్యాన్ని కలిగించిన వాడు స్వామి దయానందుడు. దయానందులు ఫిబ్రవరి 12 1824 లో గుజరాత్‌లోని కథియవాడ్ ప్రాంతానికి చెందిన టంకారలో జన్మించాడు. కార్షన్ లాల్‌జీ తివారి, యశోదాబాయి అతని తల్లిదండ్రులు, దయానందుని అసలు పేరు మూల్‌శంకర్. మూలానక్షత్రంలో జన్మించటం వలన అతనికి ఆ పేరు పెట్టారు. చిన్న తనం నుండే వేద విద్యను అభ్యసించాడు.

దయానందుని బాల్యంలో జరిగిన అనేక సంఘటనల వలన అతనిలో ధర్మజిజ్ఞాస, తత్త్వచింతనలు అంకురించాయి. భగవంతుని గురించి తెలుసుకోవాలని తపించాడు. చాలా చిన్నతనంలో మహాశివరాత్రి రోజున దయానందుడు తల్లిదండ్రులతో కలసి శివాలయానికి వెళ్ళాడు. భగవంతుడు వచ్చి తాము అర్పించిన (వస్తువులను) పదార్థాలను స్వీకరిస్తాడని అతడు ఎంతో సేపు ఎదురుచూసాడు. అందరూ నిద్రపోతుండగా ఒక ఎలుక వచ్చి భగవంతునికి నివేదించిన పదార్థాలను భుజించింది. అది చూసి దయానందుడు ఆశ్చర్యపోయాడు. భగవంతుని అస్తిత్వాన్ని గురించి ప్రశ్నించటం మొదలుపెట్టాడు. ఎనిమిదవ సంవత్సరంలో అతనికి ఉపనయనం జరిగింది.

దయానందుడు పద్నాలుగు సంవత్సరాల వయస్సులో ఉండగా అతని సోదరి మరణించింది. ఆమె మరణంతో దయానందునిలో మృత్యురహస్యాన్ని తెలుసుకోవాలనే కోరిక కలిగింది. ఇంటి నుండి వెళ్ళిపోయి దాదాపు ఇరవై సంవత్సరాలు దేశమంతా సంచరించాడు. ఎన్నో దేవాలయాలను దర్శించాడు. ఎంతో మంది యోగులను కలుసుకొన్నాడు. కాని అతని ప్రశ్నలకు సరైన సమాధానాలు లభించలేదు. చివరకు అతడు మధురకు వెళ్ళాడు. అక్కడ విరజానందుని సందర్శించి అతని శిష్యుడయ్యాడు. గురువు ఆజ్ఞతో వేద విజ్ఞానం శంకరుని సందేహాలను నివృత్తి చేసింది. మూలశంకర్ క్షుణ్ణంగా వేదాలను అధ్యయనం చేశాడు. విరజానందుడు అతనికి దయానందుడనే పేరు పెట్టి వేద విజ్ఞానాన్ని వ్యాప్తి చేయమని ఆదేశించాడు.

1875 ఏప్రియల్ 7న, దయానందుడు బొంబాయిలో ఆర్య సమాజాన్ని స్థాపించాడు. **"కృణ్వంతో విశ్వమార్యమ్"** అనేది ఆర్యసమాజ ముఖ్య లక్ష్యం, ఆర్యసమాజ శాఖలు క్రమంగా దేశ విదేశాలలో స్థాపించబడినాయి. దయానందుడు వేద మతోద్ధరణకు, నడుం కట్టాడు. హిందూ మతంలోని లోపాలను కొన్నింటిని ఎత్తి చూపి వాటిని సంస్కరించటానికి ప్రయత్నించాడు. తాను ఆర్జించిన వేద విజ్ఞాన బలంతో ఎంతో మందితో వాదించాడు. మూఢ నమ్మకాలను తొలగించి వేదధర్మాన్ని ప్రచారం చేయటానికి తన జీవితాన్ని ధారపోశాడు. భారతీయ సంస్కృతికి మూలమైన వేదాలను అధ్యయనం చేయమని ఉద్బోధించాడు.

సతిసహగమనం, అస్పృశ్యత మొదలైన దూరాచారాలను ఖండించాడు. స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. దైనందిన జీవనంలో యోగాసనాల ప్రాముఖ్యతను గురించి తెలిపాడు. తన బోధనలతో భారతీయులలో జాతీయ భావనలను రగుల్కొలిపాడు. ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగించాడు.

దయానందుడు వేదాలను, హిందూ మత గ్రంథాలనే కాక బౌద్ధ, జైన, క్రైస్తవ, మహమ్మదీయ మత గ్రంథాలను కూడా లోతుగా అధ్యయనం చేశాడు. సత్యార్థ ప్రకాశంలో దయానందుని సిద్ధాంతాలు, వాటి ఆంతర్యం ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. కుల మతాలకు అతీతంగా విశ్వమానవతను బోధించిన దయానందుని సిద్ధాంతాలు ఎందరకో అనుసరణీయాలయినాయి. విశ్వమంతా నిండి ఉన్న పరమాత్మ తత్త్వాన్ని విశదపరచి దయానందుడు ప్రాచీన మహర్షులకు వారసుడయ్యాడు.

సత్యార్థ ప్రకాశం, సంస్కార విధి, ఋగ్వేదభాష్యం, యుజుర్వేద భాష్యం, పాణినీయ అష్టాధ్యాయికి వ్యాఖ్య మొదలైన ఎన్నో గ్రంథాలను దయానందుడు రచించాడు. వేదాంగాలకు భాష్యాన్ని వ్రాసాడు. నిరాకారుడు, నిరంజనుడు, దయామయుడు అయిన భగవంతుని తత్త్వాన్ని ఎలుగెత్తి చాటాడు. ప్రజలందరకూ సామాజిక, శారీరక, బౌద్ధిక, ఆధ్యాత్మిక శక్తులను కలిగించటానికి జీవితమంతా కృషి చేసాడు. అవిద్యను తొలగించి, సద్విద్యను వ్యాప్తి చేయటానికి నిర్విరామంగా కృషి చేసాడు. నైతికబలం జాతిని వీర్యవంతం చేస్తుందని బోధించాడు.

హిందూమత సంస్కరణకు నడుంకట్టిన దయానందుడు సంప్రదాయ వాదుల నిరాదరణకు గురయ్యాడు. ఎంతోమంది స్వామికి శత్రువులయ్యారు. వారితో జోధ్‌పూర్ మహారాజు ఒకడు. ఒక దీపావళికి మహారాజు దయానందుని ఆహ్వానించి విషప్రయోగం చేసాడు. లౌకిక సుఖాల మీది మోజులో కన్నుగానని రాజును దయానందుడు మందలించటంతో రాజు కోపంతో అతని మీద విషప్రయోగం చేసాడనే

అభిప్రాయం కూడా ఉన్నది. ఏది ఏమైయినా ప్రాచీన ఋషి పరంపరకు వారసుడైన, వేద విజ్ఞాన ప్రచారానికి జీవితాన్ని ధారపోసిన ఒక మహానీయుడు అస్తమించాడు. 1883 అక్టోబరు 30వ తేదీన భారతీయులలో ఆధ్యాత్మిక జాతీయతా స్ఫూర్తిని కలిగించిన ఒక మహాజ్యోతి ఆరిపోయింది. సనాతన ధర్మానుయాయులైన ఎంతో మంది మహాత్ములు దయానందునికి నివాళులర్పించారు.

"బాల్య వివాహమ్ము బలహానియని చాటి
బ్రహ్మచర్యమునకు, బదును పెట్టి
స్త్రీవిద్య మిగిలిన స్త్రీ విద్య లేదని
ఘోషించి ఘోషాను కించపఱచి
సర్వ భౌతిక రహస్యములు ముక్తియు వేద
మూలమ్ములని ఢక్కమొరయవేసి
దివి భాను మండలమ్ము వలె భారతమండ
లము భువినొప్ప నల్గడ శ్రమించి
పోదు పోదు సంఘీ భావముననె తక్క
నస్వతంత్రత యని జాతినంతటి నొక
బంతిగా నిల్ప జీవిత పణమొసంగి
కన్నుమూసె దయానంద ఘన తపస్వి"
" సాయణాదులను పాశ్చాత్యులన్ ఖండించి
లిఖించె భాష్యమ్ము వేదపరిధి
బొట్టు తేడా తోడు, బుట్టె, గల్లోలమ్ము
లంచు జందనమునే యామతించె
బొంబాయి పత్తనమ్మున నిల్పెనార్యస
సమాజమ్ము పేరనాత్మ మత సంస్థ
ఉత్తరదేశము మొత్తము చరియించె
శతసహస్రమ్ముగా చాత్ర సంఖ్య
కాశిలో మూడు నూర్ల దిగ్దంతి సమమీ
నీషులెదురాడ జాలని నేటుగొని యు
పన్యసించె యవ్వనమ్మున సన్యసించె,
జిరయశుడు విరజానంద శిష్యుడతడు."

ఆ మహాత్ముని జయంతి సందర్భంగా ఒక్కసారి స్మరించుకొని, స్వామి అందించిన జ్ఞాన సంపదను సద్వినియోగం చేసుకొని ఆస్ఫూర్తితో ముందుకు సాగుదాం.

# "వార్తాహైందవం"

## ప్రాంత - దుర్గావాహిని, మాతృమండలి అభ్యాసవర్గ

తేది. 24-12-2011 నుండి 28-12-2011 వరకు భాగ్యనగరం బండ్లగూడెం -శారదాధామంలో - ప్రాంత దుర్గ వాహిని వర్గ జరిగింది. అక్కడే 27,28 తేదీలలో ప్రాంత మాతృమండలి వర్గ జరిగింది. 12 జిల్లాల నుండి 57 మంది దుర్గలు (యువతులు) 11 జిల్లాల నుండి 37 మంది మాతృమూర్తులు పాల్గొన్నారు.

24వ తేదీన జరిగిన ఉద్ఘాటనలో - కేంద్రీయ ఉపాధ్యక్షురాలు - శ్రీకృష్ణదేవరాయల వంశస్థురాలు - రాణి చంద్రకాంతాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ప్రాంత కార్యదర్శి శ్రీ జి. దుర్గయ్య, ప్రాంత మాతృమండలి ప్రముఖ్ శ్రీమతి వరలక్ష్మి పాల్గొన్నారు. అన్నదానం సీతగారు "సంఘటనద్వారా సమాజాన్ని ఏ విధంగా జాగృతంచేయాలో వివరించారు. 25వ తేదీన డా॥ వాణికుమారి - రామాయణంలో స్త్రీ వ్యక్తిత్వం గురించి, 26వ తేదీన డా॥ కృష్ణకుమారి నేటి పరిస్థితులలో భారత మహిళ కర్తవ్యం గురించి వివరించారు.

తేది. 27న జరిగిన మాతృమండలి దుర్గవాహిని వర్గలో శ్రీ లింగం సుధాకర రెడ్డి హిందూధర్మ విశిష్టత, మతమార్పిడుల నిరోధం గురించి వివరించారు. శ్రీ ఆకారపు కేశవరాజు, డా॥ మాణిక్యాచారి పాల్గొన్నారు. 28వ తేదీన జరిగిన సమారోప్ కార్యక్రమంలో అంతర్జాతీయ అధ్యక్షులు శ్రీ జి. రాఘవరెడ్డి పాల్గొని, "లవ్ జిహాద్ కుట్రలద్వారా హిందూ అమ్మాయిలను మోసగిస్తున్న ముస్లిం యువకుల బారిన పడకుండ యువతలు జాగ్రత్త పడాలి" అన్నారు. శ్రీమతి డి.జి. విజయ లక్ష్మి, శ్రీ జయంత్ రావు, పాల్గొన్నారు. శ్రీ ఆకారపు కేశవరాజు సమారోప్‌లో మార్గదర్శనం చేశారు. వర్గలో శ్రీమతి లలితారాణి పర్యవేక్షకులుగా, ముఖ్య శిక్షక్‌గా వ్యవహరించారు. శ్రీ పండరినాథ్  సత్సంగ నిర్వహణగురించి వివరించారు.

ఈ కార్యక్రమములో శ్రీ యం .రామరాజు, శ్రీ యమన్‌సింగ్, శ్రీ సుధాంశు మోహన్ పట్నాయక్, నాగదుర్గ ఆలయం చైర్మెన్ శ్రీ మహేందర్ పాల్గొన్నారు.

# విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షులు

## మాన్య శ్రీ గుణంపల్లి రాఘవరెడ్డి గారి అభినందన సభ – భాగ్యనగరం

భాగ్యనగరం – నారాయణగూడ కేశవ మెమోరియల్ స్కూల్‌లో **తేది 1–1–2012న** ఇటీవల విశ్వహిందూపరిషత్ అంతర్జాతీయ అధ్యక్షులుగా నియుక్తులైన మాన్యశ్రీ గుణంపల్లి రాఘవరెడ్డి గారిని, వారి సతీమణి శ్రీమతి భారతిగారిని, పూలమాలలతో ఘనంగా సత్కరించడం జరిగింది. విశ్వహిందూపరిషత్ వైపునుండి ధనస్సును, దుర్గావాహిని వైపునుండి త్రిశూలాన్ని వారికి బహూకరించడం జరిగింది.

ఈ అభినందన సభలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పెద్దలు, విశ్వహిందూ పరిషత్ పదాధికారులు, వివిధ క్షేత్రాల ప్రముఖులు, రాజకీయ నాయకులు, వివిధ ధార్మిక సంస్థలపెద్దలు, ప్రతిష్టిత వ్యక్తులు, అభిమానులు, కుటుంబసభ్యులు, కార్యకర్తలు సుమారు 1000 మంది పాల్గొన్నారు.

ఈ అభినందన సభలో శ్రీ జి. రాఘవరెడ్డి ప్రసంగిస్తూ "విశ్వహిందూ పరిషత్ కార్యాన్ని గ్రామ గ్రామాలకు తీసుకొని వెళ్ళడానికి ప్రతి ప్రఖండ కేంద్రంలో ఒక కార్యాలయాన్ని ప్రారంభిస్తామని, ఒక పూర్తి సమయ కార్యకర్తను నియుక్తి చేసి, శక్తివంతమైన సంఘటన  నిర్మాణం చేస్తామన్నారు.

## మాన్యశ్రీ గుణంపల్లి రాఘవరెడ్డి గారి అభినందన సభ – పాలమూరు

పాలమూరు నగరం – శివశక్తి నగర్ – విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో తేది. 22–1–2012న విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షులు మాన్యశ్రీ రాఘవరెడ్డి గారిని ఘనంగా సన్మానించడం జరిగింది. అంతకుముందు ఆ బస్తిలో ఉన్న శివాలయం నుండి మేళతాళాలతో, పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతూ, ఉరేగింపుగా కార్యాలయానికి తీసుకొని వెళ్ళడం జరిగింది. ఆ తరువాత జరిగిన సన్మాన సభలో" మాన్యశ్రీ రాఘవరెడ్డి మాట్లాడుతూ" విశ్వహిందూపరిషత్ ఆవిర్భవించి 2014 నాటికి 50సం॥రాలు పూర్తవుతున్న సందర్భంగా మనం రజిత జయంతిని జరుపుకోబోతున్నాం. ఆనాటి వరకు విశ్వహిందూపరిషత్ సమితులను గ్రామగ్రామాన ఏర్పాటు చేయాలి. ఏ ఒక్క హిందువు లేదా దళిత బంధువు మతం మారకుండ తగు జాగ్రత్తలు తీసుకోవాలి. సత్సంగాల నిర్వహణ ద్వారా హైందవ చైతన్యం తీసుకొని రావాలి. ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శ రాష్ట్రంగా తీర్చి దిద్దాలి", రాజకీయాలకు అతీతంగా

మనం అందరం సంఘటితమై హిందూజాతిపై జరుగుతున్న ప్రమాదాలను ఎదుర్కోవాలి" అన్నారు.

ఈ అభినందన సభలో మాజీ న్యాయ శాఖామంత్రి శ్రీ పి. చంద్రశేఖర్, బి.జె.పి. నాయకులు శ్రీ కె. రాములు, పరిషత్ జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీ మద్దియాదిరెడ్డి, అధ్యక్షులు శ్రీ పట్లోళ్ళ లక్ష్మారెడ్డి శ్రీ సంగవిశ్వనాథ్, శ్రీ కొత్తహన్మంతు, శ్రీ ఎ. నరేంద్ర, శ్రీ ఎ. కేశవులు పాల్గొన్నారు.

అలాగే విభాగ్ అధ్యక్షులు శ్రీ బండారి రమేశ్, సంఘటనా కార్యదర్శి, శ్రీ బిక్షమయ్య, శ్రీ పరమేశ్వరరెడ్డి, శ్రీ లక్ష్మికాంతారెడ్డి, సిందుజ, శ్రీమతి చంద్రకళ, శ్రీ నలిగేశి లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

## ధర్మరక్షానిధి - ఉత్సవం

తేది. 21-1-2012న ఇందూరు జిల్లా - భీంగల్‌లో శ్రీ సరస్వతీ విద్యా మందిరం నందు ధర్మరక్షానిధి ఉత్సవం జరిగింది. డా॥ బసంత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీ ఏడాకుల పాండురంగారెడ్డి, శ్రీ నరసయ్య, శ్రీ రవికుమార్ పాల్గొన్నవారిలో ఉన్నారు. "విశ్వహిందు" మాస పత్రిక సహ సంపాదకులు శ్రీ మర్పల్లి రాంరెడ్డి మాట్లాడుతూ" నేడు హిందూజాతిపై జరుగుతున్న ప్రమాదకర దాడులను ఎదిరించడానికి ప్రతి హిందువు సంసిద్ధం కావాలి. హిందూ ధర్మరక్షణకై తన సంపాదనలో కొంత ధనాన్ని సమర్పించాలి. అలాగే కార్యకర్తగా కొంత సమయం కేటాయించి కూడ పని చేయాలి" అన్నారు.

## కొవ్వూరు జిల్లా కార్యకర్తల సమావేశం

తేది. 28-12-2011న నిడుదవోలు - శ్రీమదన గోపాలస్వామి దేవాలయంలో - కొవ్వూరు జిల్లా కార్యకర్తల సమావేశం జరిగింది. శ్రీ డి.వి. సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వాంధ్ర ప్రాంత ఉపాధ్యక్షురాలు శ్రీమతి గద్దెవరలక్ష్మి "మాట్లాడుతూ" హిందూధర్మ పరిరక్షణకు ప్రతి హిందువు ప్రతినబూనాలి. అందుకు గ్రామగ్రామాలలో మాతృమండలి - సత్సంగాలు నిర్వహించడానికి కార్యకర్తలు ముందుకు రావాలి" అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ బి.వి. యన్. రాజు, శ్రీ వెంకట రమణ, శ్రీ శివశంకర్, శ్రీ వేదుల జనార్ధన్‌రావు, శ్రీ ఇ. శివరామ్, శ్రీరామారావు, శ్రీ ప్రసాద్ పాల్గొన్నారు.

## కాకినాడలో - జిల్లా సత్సంగ వర్గ

తేది. 18-12-2011న కాకినాడలో జిల్లా సత్సంగవర్గ నిర్వహించబడింది. వర్గలో శ్రీ యేలేటి వీరభద్రరావు, శ్రీ చిక్కం సత్యనారాయణ మార్గదర్శనం చేశారు. ఈ వర్గలో - మహిళలు 55మంది పురుషులు 20మంది మొత్తం 75 మంది పాల్గొన్నారు.

## గోరక్షణకై - ప్రత్యేక పూజలు

తేది. 15-1-2012న అనంతపురం - శ్రీ కాశీవిశ్వేశ్వర కోదండ రామాయలం నందు గోకర్ణ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్యులు, శ్రీ రాఘవేశ్వర భారతి స్వామివారు విచ్చేసిన సందర్భంగా ప్రత్యేక గోపూజలు నిర్వహించారు. పూజ్య స్వామీజీ ప్రసంగిస్తూ “ గోవును ప్రతి హిందువు పూజించి, రక్షించాలి. గోవధ నిషేధ చట్టం అమలయ్యే విధంగా ప్రభుత్వం గట్టిచర్యలు తీసుకోవాలి” అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీపాద వేణు, శ్రీమతి లలితా ప్రభాకర్, శ్రీ యర్రగుంట్ల శ్యాం సుందర్, శ్రీ నారాయణ స్వామి, శ్రీ ఆనంద కుమార్, శ్రీ గోపాల్‌రెడ్డి, శ్రీరామ సుబ్రహ్మణ్యం, శ్రీ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

## కనిమెట్టలో వివేకానంద జయంతి

వనపర్తి జిల్లా - కొత్త పేట మండలం - కనిమెట్ట గ్రామంలోని శ్రీ హరిహర అయ్యప్ప స్వామి దేవాలయంలో తేది. 12-1-2012న వివేకానంద జయంతి జరిగింది. ఆలయ కమిటి అధ్యక్షులు శ్రీ కుంటమల్లేశం గారు సభా కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా శ్రీ పొద్దుటూరి ఎల్లారెడ్డి, వివేకానందుని ఆదర్శ జీవనం, యువత కర్తవ్యం గురించి ప్రసంగించారు. మాజి శాసన సభ్యులు శ్రీరావుల రవీంద్రనాథరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి శ్రీ కుంట మల్లేశం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఏపురంగారెడ్డి, శ్రీ రామిరెడ్డి, శ్రీ రాజేందర్, శ్రీ కడదాసు జనార్దన్ పాల్గొన్నారు.

## ఇందూరులో - వివేకానంద జయంతి

తేది. 12-1-2012న నిజామాబాద్ గాజులపేటలో వివేకానంద స్వామి విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు సమర్పించి, కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సంఘటనా కార్యదర్శి శ్రీ ఏడాకుల పాండురంగారెడ్డి

"యువతకు స్వామి వివేకానంద చూపిన మార్గం గురించి వివరించారు. శ్రీ పిట్లస్వామి, శ్రీ బి. నరేష్, శ్రీ రమేష్, శ్రీ లక్ష్మణాచారి, శివ తదితరులు 130 మంది యువతీ - యువకులు పాల్గొన్నారు.

సంజీవయ్య కాలనీలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో "జరిగిన జయంతి ఉత్సవంలో" 76 మంది విద్యార్థులుపాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ గంగాకిషన్, శ్రీ దినేష్ ఠాకూర్, శ్రీ నరేందర్ ఆచారి, శ్రీనివాస్, శ్రీ ప్రణవశర్మ పాల్గొన్నారు.

## గోసంరక్షణ - సంవర్ధన పరిషత్

### అఖిల భారతీయ సమావేశాలు

భాగ్యనగరం - రాంకోఠి - జైన భవన్‌లో 2012 జనవరి 7,8 తేదీలలో - విశ్వహిందూ పరిషత్ - ఆయాం - అఖిల భారతీయ గో సంరక్షణ - సంవర్ధన పరిషత్ సమావేశాలు నిర్వహించబడ్డాయి. 32 ప్రాంతాల నుండి 125 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. తేది. 7-1-2012న జరిగిన ఉద్ఘాటన కార్యక్రమంలో - పరిషత్ - అంతర్జాతీయ అధ్యక్షులు మాన్యశ్రీ జి. రాఘవరెడ్డి, కార్యాధ్యక్షులు డా॥ ప్రవీణ్ భాయితొగాడియా గోమాత, భారతమాత చిత్ర పటాలముందు జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. వేదికపై ఉన్న కేంద్రప్రతినిధులందరికి స్థానిక కార్యకర్తలు కండువాలతో సన్మానించారు. తరువాత జరిగిన సభలో డా॥ ప్రవీణ్‌భాయితొగాడియా, మాన్యశ్రీ రాఘవరెడ్డి ప్రసంగించారు.

మధ్యాహ్నం జరిగిన కులపెద్దల సమావేశంలో మరియు పత్రికా విలేఖరుల సమావేశంలో డా॥ ప్రవీణ్‌భాయితొగాడియా ప్రసంగించారు. తేది. 8-1-2012న జరిగిన సమారోప్ కార్యక్రమంలో - కేంద్రీయ ఉపాధ్యక్షులు మాన్యశ్రీ హుకుంచంద్ సావ్లా మార్గదర్శనం చేశారు.

ఈ సమావేశాలలో - మాన్యశ్రీ ఖేంచంద్‌శర్మ, శ్రీ భవరీలాల్‌జీ కొఠారి, శ్రీ వీరేంద్ర బండారి, డా॥ గంగాసత్యం, శ్రీ జస్‌రాజ్‌శ్రీశ్రీమల్, శ్రీ ఆర్. యస్. సావరేకర్, శ్రీ టి. యాదగిరిరావు, తదితర గోరక్ష విభాగ్ ప్రముఖులు పాల్గొన్నారు.

అలాగే పరిషత్ పదాధికారులు శ్రీ యం రామరాజు, శ్రీ లక్ష్మీనాథాచార్యులు, శ్రీ జి. దుర్గయ్య, శ్రీ లగిశెట్టి జగదీశ్వర్, శ్రీ కైలాస్ నారాయణ బాంగ్డియా, శ్రీ పి. కృష్ణారెడ్డి శ్రీ ఆకారపు కేశవరాజు, శ్రీ సురేందర్‌రెడ్డి మరియు వివిధ ఆలయాల ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేరం పేటలో – పునరాగమనం

పశ్చిమ గోదావరి జిల్లా – జంగారెడ్డి గూడెం ప్రఖండ – పేరంపేట గ్రామంలో తేది. 4–1–2012న పునరాగమనం (స్వధర్మంలోకి రావడం) కార్యక్రమం జరిగింది. శైవ క్షేత్ర పీఠాధిపతి పూజ్య శ్రీ శివస్వామి, ఇంకా నలుగురు స్వామీజీలు కలసి గ్రామంలోని వారి ఇంటింటికి వెళ్ళి పరామర్శించి, అందరిని దేవాలయం వద్ద జరుగు యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన వలసిందిగా ఆహ్వానించారు. యజ్ఞ నిర్వహణ తర్వాత సామూహికంగా భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో 53మంది. తిరిగి హిందూధర్మాన్ని స్వీకరించారు. శ్రీ శివస్వామి మాట్లాడుతూ" " హిందూధర్మ రక్షణకై స్వామీజీలు అందరు గ్రామ గ్రామాలకు వెళ్ళి, మతి తప్పి మతం మారిన మనసోదరులందరిని తిరిగి హిందూధర్మంలోకి తీసుకొని రావాలి" అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ యం. హన్మంతరావు, శ్రీ డి.వి. సుబ్బారావు, శ్రీ సింగం సుబ్బారావు, శ్రీ శివశంకర్, శ్రీ ప్రసాద్ పాల్గొన్నారు.

## సీతంపేటలో – స్వగృహ ప్రవేశం

విజయనగరం విభాగ్ – సీతంపేట గిరిజన ప్రఖండలో తేది. 7–12–2011న పునరాగమన కార్యక్రమం సందర్భంగా యజ్ఞం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో 8 గిరిజన గ్రామాలనుండి 19 కుంటుంబాలకు చెందిన 95 మంది తిరిగి హిందూ ధర్మాన్ని స్వీకరించారు. వీరందరు భావి జీవితంలో హిందూ సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తామని, హిందూ దేవీ దేవతలను పూజిస్తామని ప్రతిజ్ఞ చేశారు. హిందూధర్మం స్వీకరించిన వారందరికి పసుపు, కుంకుమ, కొత్తబట్టలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ దేవరాల సంజీవయ్య, శ్రీ సరిదేవి జగదీశ్వరరావు, శ్రీ నడిమింటి శ్రీ నివాసరావు శ్రీ బైరసింగి లక్ష్మీనారాయణ, శ్రీ సమర ఆనందరావు, శ్రీ అరిక తిరుపతి, శ్రీ రేవళ్ళ భాస్కరరావు పాల్గొన్నారు.

## స్వర్గీయ శ్రీ తూములూరి లక్ష్మీనారాయణ గారికి శ్రద్ధాంజలి

విజయవాడ - సూర్యారావు పేటలోని శ్రీ తూములూరి లక్ష్మీనారాయణగారి స్వగృహంతో తేది 20-12-2011న వారి శ్రద్ధాంజలి కార్యక్రమం జరిగింది. ఈ సభలో అంతర్జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి మాన్యశ్రీ వై. రాఘువులు, కేంద్రీయ కార్యదర్శి శ్రీ రాజేంద్ర పంకజ్‌జీ, జాగృతి పత్రికా సంపాదకులు శ్రీ వడ్డి విజయసారధి, శ్రీ పులుసు గోపిరెడ్డి, ప్రాంతసంఘచాలక్ శ్రీ శ్రీనివాసరాజు, మరియు భారతీయ జనతాపార్టీ, భారతీయ మజ్దూర్ సంఘ్, అఖిల భారతీయ విద్యార్థిపరిషత్, భారతీయ కిసాన్‌సంఘ్, సంస్కృత భారతి, భారతీయ విద్యాభవన్, జర్నలిస్టుల సంఘం, మొదలైన అనేక సంస్థల ముఖ్య కార్యకర్తలు, పాల్గొని శ్రీ తూములూరి వారి బహుముఖ ప్రజ్ఞాశీలతకు, సమాజ సేవలో వారి నిష్ఠను సంస్మరిస్తూ నివాళులు అర్పించారు.

## మైనారిటీల రిజర్వేషన్లు రద్దు చేయాలి

తేది. 27-12-2011న నెల్లూరు - గాంధీ బొమ్మవద్ద "బిసిల కడుపు కొట్టి మైనారిటీల కడుపు నింపే రిజర్వేషన్లు రద్దుచేయాలని", ధర్నా నిర్వహించి, సోనియాగాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ మెంటా రామమోహన్ మాట్లాడుతూ" భారతదేశ ప్రజాస్వామ్య మౌళిక వ్యవస్థకు భిన్నంగా, దేశాభివృద్ధికి పట్టుకొమ్మల వంటి బిసిల హక్కులను కాలరాస్తూ, మత రిజర్వేషన్లు చేయడం రాజ్యాంగ విరుద్ధం" అన్నారు. ఈ కార్యక్రమంలో - కొండూరు వెంకటేశ్వర్లు, శ్రీ భయ్యా శ్రీనివాసులు గుప్త, శ్రీ రామరావు, శ్రీ మల్లారెడ్డి, శ్రీ కోడూరి సత్సం శ్రీవిళ్ళారి మధుసూధన, శ్రీమామిడ సత్యనారాయణ పాల్గొన్నారు.

## దేవాలయాలలో ఆంక్షలు విధించరాదు.
## డి.సి.పి.కి విజ్ఞాపన పత్రాన్ని అందించిన విశ్వహిందూ పరిషత్

తేది. 23-1-2012న భాగ్య నగరం చార్మినార్ ఆవరణలోని ప్రముఖ దేవాలయమైన బాగ్యలక్ష్మి ఆలయంలో హారతి సమయంలో మ్రోగించే గంటలను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ "విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సహ కార్యదర్శి శ్రీ యమన్‌సింగ్ ఆధ్వర్యంలో పరిషత్ సభ్యులు సౌత్ జోన్ డి.సి.పి. ని కలిసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అందుకు డి.సి.పి. పరిషత్ సభ్యులతో

మాట్లాడుతూ" హారతి సమయంలో గంటలు కొట్టవద్దంటూ స్థానిక పోలీసులు చేపట్టిన చర్యలు తనకేమి తెలియవని, శాఖా పరంగా కూడా తానెలాంటి ఆదేశాలు జారీ చేయలేదని " అన్నారు. ఏది ఏమైన ఈ దుశ్చర్యపై విచారణ చేపడతామని, వచ్చే భక్తులకు, పార్కింగ్ సౌకర్యం కూడా కల్పిస్తామని, అందుకు 15 రోజుల వ్యవధి కావాలని, డి.సి.పి.గారు శ్రీ యమన్ సింగ్‌తో అన్నారు. డి.సి.పి.ని కలిసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీ గనేశ్‌లాల్, ఆర్యనగర జిల్లా కార్యదర్శి శ్రీ రాంరెడ్డి, జిల్లా బజరంగదళ్ ప్రముఖ్ విశాల్, సునార్‌కర్, తదితరులు ఉన్నారు.

## గూడూరులో - గీతా కంఠస్థ పోటీలు

తేది. 12-12 2011న గూడూరులో విభాగ్ సంఘటనాకార్యదర్శి శ్రీ విళ్లారి మధుసూధన్ ఆధ్వర్యంలో - ప్రఖండ స్థాయి భవద్గీత కంఠస్థ పోటీలు జరిగాయి. 226 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎల్.కె.జి. నుండి 3వ తరగతి వరకు బెల్లంకొండ రేవతి, మానికల వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, 4 నుండి 7వ తరగతి వరకు గౌతమ, సాయితేజ, ధనూషాలు, 8 నుండి 10వ తరగతి వరకు, సుశ్మిత, రాజేశ్వరీ, లక్ష్మీశ్రావణ, కళాశాల స్థాయిలో రుద్రరాజు గీత, స్వప్న, లావణ్య, వయోజన స్థాయిలో, నీరజ, సురేంద్ర కుమారి వరుసగా - ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో గెలుపొందారు. వీరందరూ జిల్లాస్థాయి పోటీలో పాల్గొనడానికి అర్హత పొందారు.

## ఒంగోలులో - గీతా కంఠస్థ పోటీలు

తేది. 11.12.2011న ఒంగోలులో - ప్రకాశంజిల్లా స్థాయి గీతా కంఠస్థ పోటీలు జరిగాయి (17వ అధ్యాయం) తరువాత జరిగిన బహుమతి ప్రధాన సభకు శ్రీ మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. శ్రీ బూచెపల్లి సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూజ్యశ్రీ సత్యాత్మానందస్వామి 17వ అధ్యాయం యొక్క విశిష్టత గురించి వివరించారు. మొత్తం 90 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ జిల్లెళ్ళ మూడి వెంకటేశ్వర్లు, శ్రీ మల్లికార్జున శర్మ - శ్రీ మల్లికార్జున రావు, శ్రీ కె. సుబ్బారావు, శ్రీ కె. నరసింహరావు శ్రీ రామచంద్రారావు, శ్రీ బండి సుబ్బారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# గెలుపొందిన విద్యార్థులు:

| క్ర.సం. | విభాగము | ప్రథమ | ద్వితీయ | తృతీయ |
|---|---|---|---|---|
| | 1 నుండి 3వ తరగతి వరకు | యం. వినూత్న, కరవది | బి.హెచ్.త్రివిక్రమశర్మ చెరుకూరు | కె. అక్షయ, ఒంగోలు |
| 2. | 4 నుండి 7వ తరగతి వరకు | యస్. మౌనిక రావూరు | బి.కావేరి - రావూరు | సి. సుష్మశ్రీ, రావూరు |
| 3. | 8 నుండి 10వ తరగతి వరకు | యస్. అనూష, ఒంగోలు | యం. స్వరూప, రావూరు | కె. దివాకర్, రావూరు |
| 4. | కళాశాల | సి.హెచ్. అనూరాధ, ఒంగోలు | కె. ధనలక్ష్మి, ఒంగోలు | బి. హరిప్రియ, కందుకూరు |
| 5. | మహిళలు | పచ్చిశెట్టివల్లి, ఒంగోలు | గోరుగంటి మారుతి, ఒంగోలు | కె. వెంకటేశ్వరమ్మ, ఒంగోలు |
| 6. | పురుషులు | జి. వరదరాజు, ఒంగోలు | యన్.సత్యనారాయణ, మార్టూరు | కె.వెంకట శేషయ్య, మార్టూరు |

# ప్రాంత స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీల విజేతలు వీరే

## 17వ అధ్యాయం తేది 25-12-2012 ఒంగోలు

| క్ర.సం. | విభాగము | ప్రథమ | ద్వితీయ | తృతీయ |
|---|---|---|---|---|
| 1. | 1 నుండి 3వ తరగతి వరకు | బి. త్రివిక్రమ్ శర్మ (ప్రకాశం) | తట్టా భాష్యకారాచార్యులు (పశ్చిమ కృష్ణ) | చింతల భవిష్య (మార్కాపురం) |
| 2. | 4 నుండి 7వ తరగతి వరకు | ఎ. గౌతమి (గూడూరు) | బి. ప్రియాంక శ్రీకాకుళం | బి. కావేరి ప్రకాశం |
| 3. | 8 నుండి 10వ తరగతి వరకు | కంచర్ల శివ నందిని విజయవాడ | మన్నేపల్లి అపర్ణ నెల్లూరు | న్యాయపతి వేంకట సుజన హారిక విజయవాడ |
| 4. | కళాశాల | జట్టుక నాగమణి శ్రీకాకుళం | దాడి మౌనిక శ్రీ అనకాపల్లి | కదాంచిరాధ నెల్లూరు |
| 5. | మహిళలు | యం. నాగేశ్వరి నెల్లూరు | యం. ఉషారాణి నెల్లూరు | పి. వల్లి ప్రకాశం |
| 6. | పురుషులు | కె. వెంకట శేషయ్య ప్రకాశం | రాథోడ్ గణేశ్ భద్రాచలం | యన్. సత్యనారాయణ ప్రకాశం |

ఈ కార్యక్రమంలో భారత సంస్కృత పరిషత్ - ప్రాంత ప్రముఖ్ శ్రీ చల్లా లక్ష్మీనారాయణ, ప్రాంత సమరసతాప్రముఖ్ శ్రీ విఠ్ఠా సుబ్బారావు, శ్రీ దివి లింగయ్య నాయుడు పాల్గొన్నారు. ప్రఖండ స్థాయి నుండి ప్రాంత స్థాయి వరకు గీతాకంఠస్థ పోటీలలో పూర్వాంధ్రప్రదేశ్‌లో మొత్తము 24,600 మంది పాల్గొన్నారు.

# జనహిత

## పరిగి అంచల్ - ఆచార్యుల అభ్యాసవర్గ

తేది. 28-12-2011 నుండి 1-1-2012 వరకు యానగొంది - శ్రీ మాణేకేశ్వరీ మాత ఆశ్రమంలో పరిగి అంచల్ ఆచార్యుల అభ్యాస వర్గ జరిగింది 28వ తేదీన జరిగిన ఉద్ఘాటనలో శ్రీ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. కేంద్రీయప్రతినిధి శ్రీ పి. రమాకాంత్ ఏకల విద్యాలయాల లక్ష్యం గురించి తెలిపారు. ఈ వర్గలో శ్రీ నల్ల అనంతయ్య, శ్రీ జె. మహేందర్, శ్రీ ఎ. నర్సింలు, శ్రీ శివయ్యలు వివిధ అంశాల గురించి వివరించారు. శ్రీ యన్. వెంకటయ్య, శ్రీ యం. రాములు, శ్రీ రాజేందర్, శ్రీనివాసరాజు, శ్రీగోపాల్, శ్రీ సత్యం, ఆంజనేయులు పాల్గొన్నారు.

## కరీంనగర్ అంచల్ ఆచార్యుల అభ్యాస వర్గ.

కరీంనగర్ అంచల్ ఆచార్యుల అభ్యాస వర్గ తేది. 1-1-2012 నుండి 6-1-2012 వరకు కాశేశ్వరంలోని, శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయంలో జరిగింది. ఉద్ఘాటనలో శ్రీరాం నారాయణగౌడ్, డా॥ సీతారాం, శ్రీ బహ్మానందగౌడ్ పాల్గొన్నారు. ఈ వర్గలో, శ్రీ జంగసమ్మయ్య, శ్రీ వీరన్న, శ్రీరామకృష్ణారెడ్డి, వివిధ అంశాల గురించి వివరించారు. శ్రీ పి. రమాకాంత్ స్వామి వివేకానంద ఆదర్శం గురించి మాట్లాడారు. 6వ తేదీన జరిగిన సమారోప్‌లో - శ్రీ గుడాలకృష్ణమూర్తి శ్రీ గంద గిరి సత్యనారాయణ, పాల్గొని, మార్గదర్శనం చేశారు.

## వరంగల్ అంచల్ ఆచార్యుల అభ్యాస వర్గ

తేది. 2-1-2012 నుండి 7-1-2012 వరకు వరంగల్ అంచల్ ఆచార్యుల అభ్యాసవర్గ - జనగామ మండలం - కొమరవెల్లి శ్రీమల్లికార్జున స్వామి దేవాలయంలో జరిగింది. ప్రారంభోత్సవంతో శ్రీ పి. రమాకాంత్ శ్రీ పి. బ్రహ్మానందగౌడ్, శ్రీవీర

బత్తిని సత్యనారాయణ, శ్రీ పెద్ది తిరుపతి రెడ్డి పాల్గొన్నారు సమారోప్‌లో – శ్రీ జె. మహేందర్ పాల్గొని, హిందువులపై జరుగుతున్న దాడులు, వాటిని ఏ విధంగా ఎదుర్కోవాలో" వివరించారు. శ్రీ చీకట్ల బాపురాజు, శ్రీ ఎల్ కృష్ణంరాజు, శ్రీ బి. తార, శ్రీ వి. రాజు, శ్రీ డి. జితేందర్, పాల్గొన్నారు.

## నిజామాబాద్ అంచల్ ఆచార్యుల అభ్యాస వర్గ

ఈ వర్గ – తేది. 5–1–2012 నుండి 9–1–2012 వరకు ఎల్లారెడ్డి మండలం – బిందర్‌లో జరిగింది. ఉద్ఘాటనలో మాజీ శాసన సభ్యులు శ్రీ. గంగారం, శ్రీ వంగపల్లి నాగభూషణం, శ్రీ భాస్కరరాజు, శ్రీ హన్మంత్ రెడ్డి, శ్రీ పి. రమాకాంత్, శ్రీ పి. బ్రహ్మానంద గౌడ్, శ్రీ డి. సత్యనారాయణ పాల్గొన్నారు. శ్రీ గంగారం మాట్లాడుతూ" ఏకలవిద్యాలయాల మాధ్యమంగా – రామరాజ్యాన్ని తీసుకుని రావాలి" అన్నారు. సమారోప్‌లో – శ్రీ విద్యాసాగర్, శ్రీ కె. నారాయణ, పుష్పలత, శ్రీమల్లేశం, శ్రీ గంగాధర్, మంజుల, మారుతి పాల్గొన్నారు. డా॥నాగేశ్వర్ మాట్లాడుతూ "ఉదయం లేవగానే కాలకృత్యాలు తీర్చుకొని, యోగ అభ్యాసం చేసి, ఆరోగ్యాన్ని రక్షించుకోవాలి" అన్నారు.

## జహీరాబాద్ సంకుల్ ఆచార్యుల అభ్యాస వర్గ

మెదకు జిల్లా న్యాల్‌కల్ మండలం ముంగి ఆశ్రమంలో తేది. 6.1.2012 నుండి 11–1–2012 వరకు వర్గ జరిగింది. వర్గ ప్రారంభంలో పూజ్యశ్రీ దేవగిరి మహరాజ్, శ్రీ హెచ్ వీరన్న, శ్రీ హెచ్. సిద్దన్న పాల్గొని, మాట్లాడారు ఈ వర్గలో – శ్రీ పి. బ్రహ్మానందగౌడ్, శ్రీ జె. మహేందర్ వివిధ అంశాల గురించి వివరించారు. కేంద్రీయ సహ కార్యదర్శి శ్రీ జి. సత్యం కమిటి సభ్యులతో సమావేశమై నేటి దేశ కాలపరిస్థితుల గురించి వివరించారు. నేతి మిఠాయిల వ్యాపారులు శ్రీ బిచ్చారెడ్డి, పారిశ్రామిక వేత్త శ్రీ శ్యాం, పాల్గొన్నారు. ఏకల విద్యాలయాల ఆచార్యులందరు తేది. 12–1–2012న బీదర్ నరసింహ స్వామి క్షేత్రం వరకు పాదయాత్ర చేశారు.

## ఆదిలాబాద్ ఆంచల్ ఆచార్యుల అభ్యాస వర్గ

గుడిహత్నూర్ మండలం, శాంతాపురం గ్రామం రామాలయంలో తేది. 7–1– 2012 నుండి 11–1–2012 వరకు వర్గ నిర్వహించబడింది. ఉద్ఘాటనలో శ్రీ యస్. రాంరెడ్డి, శ్రీరాంచందర్, శ్రీ సత్యానాయక్, శ్రీ పి. శివాజీ పాల్గొన్నారు.

శ్రీ సిహెచ్. మల్లేశం, శ్రీ రామకృష్ణారెడ్డి, వివిధ అంశాల గురించి తెలిపారు. సమారోప్‌లో శ్రీ యస్. రాంరెడ్డి, మాట్లాడుతూ, ఏకల విద్యాలయాల ద్వారా సామాజిక పరివర్తన తీసుకొనిరావాలి. అవిద్యతోపాటు అంటరానితనాన్ని కూడ రూపుమాపాలి" అన్నారు. శ్రీ పరమేశ్వర్, శ్రీ మాధవ్, శ్రీరాంచందర్ పాల్గొన్నారు.

## శ్రీ రామేశ్వర - పంచభూత లింగయాత్ర

తేది - 25-1 2012న ప్రారంభం కావలసిన శ్రీ రామేశ్వర - పంచభూత లింగయాత్ర యాత్రికుల కోరిక మేరకు తేది. 2-5-2012 నుండి 22-5-2012 వరకు జరుపబడును.

ముహూర్తం - స్వస్తి శ్రీ నందన నామ సంవత్సర వైశాఖ శుద్ధ ఏకాదశి బుధవారం **తేది. 2-5-2012 ఉదయం గం॥ 11-17ని॥లకు పుబ్బా నక్షత్ర యుక్త కర్కాటక లగ్నమందు ఇంటి నుండి బయలుదేరి హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లోని అష్టలక్ష్మి ఆలయం దర్శించి భోజనానంతరం మ.1.30 ని॥లకు ప్రయాణం సాగించుట.**

చార్జీలు :- ఉదయం అల్పాహారం - మధ్యాహ్నం భోజనం - రాత్రి ఉపాహారం ఆశ్రమములు, సత్రములు - లాడ్జిలో రాత్రి బస 36 సీటర్ల (2+2) పుష్ బ్యాక్ బస్సులో ప్రయాణంతో సహ ఒకరికి చార్జి రూ. 12,600-లు

రాయితీ:- ధర్మయాత్ర మహాసంఘ్ పశ్చిమాంధ్ర శాఖ ఆజీవన సభ్యులకు $2^1/_2$ శాతం రాయితీ ఇవ్వబడును.

### అమెరికా సెనెట్‌లో - విఘ్నేశ్వర పూజ

అమెరికా సెనెట్‌లో మున్నెన్నడు లేని విధంగా అధికార పూర్వకంగా రెండు గంటలపాటు విఘ్నేశ్వరపూజ, ఋగ్వేదంలోని కొన్ని శ్లోగాలు పఠించి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆ తర్వాత ఆదేశ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రారంభించుకున్నారు. ఇది హిందుత్వ విశాలత్వమునకు పరాకాష్ఠ

- శ్రీ సాయి రామానందస్వామి

# ధార్మిక, జాతీయ, సాంస్కృతిక సాహితీ పురస్కారములు

2011 సంవత్సరమునకై కీ॥శే॥ వెంకటరావు పంతులు, కీ॥శే॥ ముళ్ళపూడి సూర్యనారాయణమూర్తి, కీ॥శే॥ ఓగేటి అచ్యుత రామశాస్త్రి గారల పేరిట నెలకొల్పబడిన ధార్మిక, జాతీయ, సాంస్కృతిక సాహితీ పురస్కారములను ప్రకటించుటకై ఆచార్య కసిరెడ్డి గారి అధ్యక్షతన కమిటీ ఏర్పడినది. కమిటీ నిర్ణయాన్ని ఇందుమూలముగా కమిటీ సూచన మేరకు తెలియపరచడం అవుతుంది.

**శంకరుపల్లి :** (రంగారెడ్డిజిల్లా) కేంద్రంగా నెలకొల్పబడ్డ కీ॥శే॥ శ్రీ వెంకటరావు పంతులు ధార్మిక సాహితీ పురస్కారము (2011 కోసం) తేది. 12-2-2012 నాడు ప్రధానము.

**పురస్కారమును గ్రహించువారు :**

డా॥ భేరి సునీతా రాంమోహన్‌రెడ్డి గారు, మల్కాజిగిరి, హైదరాబాద్.

**వివరములు :**

1. భక్తి పత్రికలు - తాత్విక వివేచన పరిశోధనతో పి.హెచ్.డి. పట్టా పొందారు.
2. తమ సోమా జ్యోతిర్మయ - సాయి శతకం - ప్రణతి, సుచిత్రాలు, దివ్యాంజలి, రాజరాజేశ్వర చరిత్ర, శివానంద ఆశ్రమ చిన్నస్వామి చరిత్ర మొదలగు ముద్రిత గ్రంథాలు.
3. ఈ.టి.వి., ఎ.బి.ఎన్., భక్తి, వనిత, ఎన్.టి.వి., జాగృతి డి.డి., మొదలగు చానల్స్‌లో సామాజిక, ధార్మిక, ఆధ్యాత్మిక అంశములపై చర్చలు, ప్రసంగాలలో పాల్గొనడం.
4. జాతీయ సాహిత్య పరిషత్, విశ్వహిందూపరిషత్, సేవికా సమితి సంస్థల వేదికలపై రాష్ట్రంలో అనేకచోట్ల ప్రసంగాలలో పాల్గొనడం.
5. భాగ్యనగరంలో హిందూధర్మ ప్రచార పరిషత్, తిరుపతివారి సూచనల మేరకు వివిధ దేవాలయములలో పర్వదినముల సందర్భంగా ప్రవచనములు, ప్రసంగాలు.

6. జాతీయ సాహిత్య పరిషత్ మల్కాజిగిరి శాఖ అధ్యక్షురాలుగా క్రియాశీల కార్యకర్త, శివానంద భారతి సంపాదకురాలు.

**వికారాబాదు :** (రంగారెడ్డిజిల్లా) కేంద్రంగా కీ॥శే॥ ముళ్ళపూడి సూర్యనారాయణ మూర్తి జాతీయ సాహితీ పురస్కారం (2011 కోసం) తేది. 25.3.2012 నాడు ప్రధానం.

**పురస్కార గ్రహీత :** శ్రీ బాబూదేవీ దాసరావుగారు, ఆత్మకూరు. మహబూబ్‌నగర్ జిల్లా.

**వివరములు :** విశ్రాంత ప్రధానోపాధ్యాయులు. 1982లో జాతీయ సాహిత్యం ప్రారంభించి, నాటి నుండి నిర్విఘ్నంగా కార్యక్రమాలు చేస్తున్న కార్యకర్త. కవితలు, వ్యాసములు, పద్యాల ద్వారా సామాజిక, ధార్మిక, ఆధ్యాత్మిక విషయాలు జాతీయ దృక్పథంతో తెలియజేస్తున్నవారు. 58 ముద్రిత గ్రంథాలు తనవి గలిగి సుమారు 20 వరకు ఇతర రచయితల గ్రంథాలు జాతీయ సాహిత్య పరిషత్ ద్వారా వెలుగులోకి రావడానికి కారణం అయినవారు.

**తాండూరు :** (రంగారెడ్డి జిల్లా) కేంద్రంగా కీ॥శే॥ ఓగేటి అచ్యుతరామశాస్త్రి సాంస్కృతిక సాహితీ పురస్కారం (2011 కోసం) తేది. 2.8.2012 నాడు ప్రధానం.

**పురస్కార గ్రహీత :** డా॥ అయాచితం నటేశ్వరశర్మగారు, కామారెడ్డి.

**వివరములు :**

1. కామారెడ్డిలో ఓరియంటల్ కళాశాల ప్రాచార్యులు.
2. ప్రముఖ సంస్కృత విద్వాంసులు, కవి, పండితులు
3. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఓరియంట్ భాషల విభాగడీన్.
4. ఆది శంకరాచార్యుల విరచిత సౌందర్యలహరిపై పరిశోధన చేసి పి. హెచ్.డి. పొందినారు.

5. వేంకటేశ్వర విలాసము, అభిజ్ఞాన శాకుంతలము మొదలగు 50 ముద్రిత గ్రంథాలు కలిగి, జాతీయ సాహిత్య పరిషత్ కామారెడ్డి శాఖను గత అనేక సంవత్సరాలుగా నిర్వహిస్తున్న కార్యకర్త.

# గావో విశ్వస్య మాతరః

## డా॥ ప్రవీణ్ భాయి తొగాడియా - అంతర్జాతీయ కార్యాధ్యక్షులు

మన పూర్వజన్మ, మన సనాతన పరంపర, సభ్యత – సంస్కృతి, మానవ జీవనం, మన వ్యవసాయం అన్ని గోమాతతో సంబంధం ఉన్నవే.

సృష్టి ప్రారంభంలో మానవజన్మలేదు. భగవంతుని ఇచ్చా శక్తి ద్వారా ప్రకృతి నిర్మాణమైంది. ఆ తర్వాత మానస సంకల్ప సిద్ధి ద్వారా మానవ జన్మ ప్రారంభమైంది. ఆ తర్వాత స్త్రీ – పురుషుల కలియిక ద్వారా మానవ జన్మ ప్రారంభమైంది.

“జాతస్య హిధ్రులో మృత్యుః” మానవ జన్మకు మృత్యువు అనివార్యం. అలాగే పునర్జన్మ కూడా అనివార్యమైనదే. ఇది సృష్టి క్రమం. కర్మసిద్ధాతంపై పునర్జన్మ కలుగుతుంది. ఆయువు. ఆరోగ్యం, ధనం, కీర్తి, అన్ని గతజన్మ కర్మల ఆధారంగానే లభిస్తాయి. బీదవారిని ఆదరించి అన్నం పెడితే గోప్ప పుణ్యం లభిస్తుంది. ఇతరలకు కీడుచేస్తే పాపం పొందుతాడు. గతజన్మ దుష్కర్మ వలన ఆరోగ్యం, ఆయుష్యం, ఆనందం, శాంతి అన్ని కరువైపోతాయి. ఈ కర్మ సిద్ధాంతం, వేద, శాస్త్ర , ఆధారితమైంది.

**కాని గత జన్మలో చేసిన పాపమంత ఈ జన్మలో గోమాత సేవ చేస్తే – అంతమై పోతుంది. అన్ని సత్కర్మలకంటే గోసేవ – చాలా గొప్పది.**

**సకలదేవతలను పూజించడం వలన కలిగే ఫలితం ఒక్క గోమాతను పూజించడం వలన కలుగుతుంది. ఎందుకంటే – గోమాత సకల దేవీ – దేవతల నిలయం.**

**ధర్మప్రసారం :** ఒక ముస్లిం తన ఆహారానికి తన జీవితకాలలో కనీసం 100 గోవులను చంపుతాడు. ఒక ముస్లింను తిరిగి హిందూ ధర్మంలోకి తీసుకొని వస్తే 100 గోవులను రక్షించినట్లు అవుతుంది. ధర్మప్రసార విభాగం ద్వారా మతం మారిన క్రైస్తవ – ముస్లింలను తిరిగి హిందూ ధర్మంలోకి తీసుకొని రావడం మన ముఖ్యకర్తవ్యం.

గోరక్తం ఈ భూమి మీద పడకూడదు. గోహత్య జరగరాదు అని మనం సంకల్పం తీసుకోవాలి. కేవలం కోరిక ద్వారా పని జరగదు. కావాలని కోరడం ఇచ్ఛ. వెంటబడి పనిని సాధించడం సంకల్పం. సంకల్పం ద్వారా సృష్టి నిర్మాణం జరుగుతుంది.

విధ్వంసం కూడా జరుగుతుంది. గోసంరక్షణ గోసంవర్ధనం కొరకు మనం అందరం సంకల్పం తీసుకోవాలి. గో సంరక్షణ పని అనేక వైపుల నుండి జరగాలి. గోరక్షణకై వేరు వేరు సంస్థలు, వేరు వేరు వ్యక్తులు ఉద్యమాలు కొనసాగిస్తున్నారు. వారందరిని కలుపుకొని మనం ముందుకు వెళ్ళాలి. గోరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి. అందుకు.

**దేశంలోని హిందువులందరూ గోరక్షణకై సంకల్పం చేయాలి. గోసంరక్షణ సంకల్పం ఏవిధంగా ఉండాలి? ఎందుకు చేయాలి?**

1. గోవుపాలు మాత్రమే త్రాగుతాం అని సంకల్పం చేయాలి. గోవు లీటర్ల పాలనిస్తే, 5×50=250 రూ॥లు లాభం వస్తుంది.
2. ప్రతి దినం భోజనం చేసేముందు గో్రగ్రాసంతీసి భుజించాలి.
3. కోట్లాది మంది హిందువుల సంకల్పం - గోవుపాలు, గోవు నేయి మాత్రమే వాడుతాం ఈ ఉద్యమం గ్రామ గ్రామాలకు విస్తరించాలి.
4. గోవును ప్రతి ఇంటిలో పోషించాలి. స్థలం లేకపోతే ప్యాక్టరీలో, వ్యవసాయదారుని కొట్టంలో పెంచాలి.
5. ప్రతివ్యక్తి గోరక్షణకై 5 లేదా 10 రూపాయలు ప్రతి దినం సమర్పించాలి.
6. పంచగవ్యం ద్వారా తయారైన మందులనే వాడాలి.
7. గ్యాస్, సుగర్, లావెక్కడం, అన్ని రోగాలు గోమూత్ర ఔషధం ద్వారా దూరమవుతాయి.
8. సబ్బులు, షాంపు, ఆగర్‌బత్తీలు - సౌందర్య ఉత్పాదనలు అన్ని గోమయం ద్వారా తయారు చేయాలి.

**గోరక్షణ - గోవు ఎవరిపై ఆధారపడలేదు.**

ఒకవ్యక్తి పైగాని గ్రామ పంచాయితీపైగాని, అధికారిపైగాని, రాజుపైగాని, ఆధారపడి లేదు. ఈ భూమిని కొందరు స్వార్థపరులు స్వాధీనం చేసుకున్నారు. గోచర భూమిని ఆపహరించిన వారికి నరకం లభిస్తుంది. 1951సం॥లో గుజరాత్‌లో గోరక్షణకై - గోచర భూమి చట్టం తయారుచేయబడింది.

- గోరక్షణకై సమితులను ఏర్పాటు చేయాలి.
- స్వదేశీ గోవులు పెంచడానికి ఆర్థిక సహకారం అందించాలి.
- గోవు - ఎరువు (సేంద్రీయ ఎరువు ద్వారా భూమి 10 సం॥రాలు సారవంతంగా ఉంటుంది. కెమికల్ ఎరువు (రసాయనిక) ద్వారా 1 సం॥లోనే పాడైపోతుంది.
- సేంద్రియ ఎరువు ద్వారా 100 రూ॥ పెట్టుబడితో - 120 రూ॥లు వస్తాయి. రసాయానిక ఎరువుద్వారా 100రూ॥ పెట్టుబడితో (30 కెమికల్స్) 70రూ॥ వస్తాయి.
- 50 గ్రామాల నుండి 5000 మందిని సమీకరించి, గో ఆధారిత వ్యవసాయం గురించి సమ్మేళనాలు జరపాలి.
- గోమూత్రం ద్వారా మందులు, గోమయం ద్వారా ఎరువులు తయారుచేయాలి.
- పంచగవ్యం ద్వారా - గోబల్ గ్యాస్, పినాయిల్, ఆగర్‌బత్తీలు తయారుచేయాలి. భారత్‌కు 50 వేల కొట్ల రూపాయలు ఆదా ఆవుతాయి.
- గోహత్యకు అనేక చట్టాలు ఉన్నప్పటికీ అమలు కావడంలేదు. తగిన చర్యలు తీసుకొని వెంటనే అమలగునట్లు చూడాలి.
- కోట్లాది మంది హిందువుల హృదయాలలో గోరక్షణభావాన్ని కలిగించాలి.
- గోసేవ, సమ్మేళనాలు జరపాలి. ప్రశిక్షణ ఇవ్వాలి.
- వృద్ధాశ్రమాలు చాలా ఉన్నాయి. అవి పెరిగితే మనకు గొప్పతనం లేదు. తల్లి-దండ్రులను ఇంటిలోనే పోషించాలి. లేనివాడు పాపి.
- గోవులు గోశాలలో కాదు - ఇంటిలోనే పెంచబడాలి.
- గో ఆధారిత వ్యవసాయం ద్వారా, గోవుల ద్వారా చాలా లాభాలు ఉన్నాయి.
- నిరుపయోగ గోవు (పాలివ్వనిగోవు) గోమూత్రం వలన మందులు, గోమయం వలన ఎరువులు తయారైతాయి. నిరుపయోగ గోవు ఖర్చు కంటే 1000 రూ॥ ఆదాయం ఎక్కువగా వస్తుంది.

- అన్ని రాష్ట్రాలలో గో–విజ్ఞానం పరీక్షలు నిర్వహించాలి. (ఒకవారం –15 రోజులు) గోరక్షణ, సంవర్ధన లాభాల గురించి వివరించాలి.
- కోట్లాది మంది హృదయాలలో గోసంరక్షణ భావాలను నింపుతూ గోవు – ఒక్క రక్తం బొట్టు కూడ ఈ భూమి మీద పడనీయం అనే సంకల్పంతో పనిచేయాలి. ఈ గోరక్షణ కార్యానికి శ్రీరాముని, శ్రీ కృష్ణుని, శివుని ఆశీస్సులు ఉంటాయి.
- గోరక్షణ ద్వారా శౌర్యం, పరాక్రమం, ఆరోగ్యం, ఐశ్వర్యం అన్ని వృత్తులలో విజయం లభిస్తుంది.
- వ్యక్తిగతంగా కుటుంబ పరంగా, భౌతికంగా, ఏ రకంగా చూసినప్పటికి, గోవు – వలన అనేక లాభాలు ఉన్నాయి.

**మాన్యశ్రీ హుకుం చంద్ సావ్లా – కేంద్రీయ ఉపాధ్యక్షులు**

మనం తను, మన, ధనాలను సమర్పించి ఏకాగ్రతతో పని చేసినప్పుడు విజయం సాధిస్తాం. ఏదైనా మాట్లాడం అతి సులభం. అచరించడం చాలా కష్టం. ప్రతివ్యక్తి సమర్థుడైన కార్యకర్తగా నిర్మాణం కావాలి. ప్రచారం, వ్యాఖ్యానం వక్తృత్యం, నాయకత్వం అన్నీ సులభమే. తనను తాను కార్యకర్తగా మలచుకుంటూ కార్యరంగంలో పని చేయడం అతికష్టం.

వివిధ స్థాయిలలో సమితులను నిర్మాణం చేసినప్పుడే మనకు కార్యకర్తలు లభిస్తారు. లేదా ఉద్యమం ద్వారా కూడా లభించగలరు. అల్‌కబీర్ – యాంత్రిక పశువధశాలకు వ్యతిరేకంగా భాగ్యనగరంలో – ఒక జైనముని నిరహారదీక్షకు పూనుకుంటున్నప్పుడు కేంద్రం నుండి శ్రీ అశోక్ జీ సింఘాల్ వచ్చి, వారు మాత్రమే కాదు వారి వెంట మన మందరం నిరహారదీక్ష చేద్దాం అంటూ ప్రేరణను ఇచ్చి గొప్ప ఉద్యమాన్ని లేవదీశారు. రుద్రారం గ్రామం – గణేశ్ ఆలయంలో పశురక్షాయజ్ఞం కూడ నిర్వహించబడింది. అయోధ్య – శ్రీరామజన్మభూమి ఉద్యమంవలే ఇది కూడా చరిత్రలో నిలచి పోయింది.

గోరక్షణకు చేయూత నిస్తున్న ఆర్యసమాజ్, గాయత్రీపరివార్, జైనసమాజ్, సిక్కు తదితర సంస్థలను కలుపుకొని ఉద్యమాన్ని కొనసాగించాలి. అశారాం బాపు, రాందేవ్ బాబావంటి మహానుభావుల, భాషను సహకారం కూడ గతంలో లభించింది.

ప్రాంతాలవారిగా వందలాది మందిని గో - సంపదమాస పత్రిక చందాదారులను చేర్పించాలి. ఆర్థిక భారం పడకుండ పత్రిక సజీవంగా సాగించడానికి సంవత్సరానికి ఒకసారి ప్రత్యేక సంచికను విడుదల చేయాలి. వ్యాపార ప్రకటనలను సమకూర్చుకోవాలి. పత్రిక విడుదలకు గోపాష్టమి లేదా ఇతర పవిత్ర దినాన్ని ఎన్నుకోవాలి.

ఒక బిక్షగాడు - బిక్ష మెత్తుకోవడానికి అందమైన నవాబుసాబ్ ఇంటికి వెళ్ళాడు. ఆసమయంలో నవాబు ఆ ఇంటిలో ఒంటరిగా ఉన్నాడు. బిక్షగాడు "బిక్షం వేయండి అన్నాడు, నవాబు ఏమీ మాట్లాడలేదు. రెండవసారి బిక్షం వేయండి అని కొంచెం గట్టిగా అడిగాడు. నవాబుసాబ్ మారు పలుకలేదు. మూడవసారి బిక్షగాడికి కోపం వచ్చి బిక్షం వేయండి లేక లేదని చెప్పండి ఇంకొక ఇంటికి వెళ్ళుతాను" అని గట్టిగా అరచాడు. అప్పుడు నవాబ్ సాబ్ బిక్షం వేయడానికి మా ఇంటిలో మనుషులులేరు అన్నాడు. అప్పుడు బిక్షగాడు కొంత సమయంవరకు నాకు భిక్షం వేసేవరకు మరే మనిషిగా తయారుకండి అన్నాడు. ఇది కథ

మన కథ కూడ ఇంతే - మన గోరక్ష ఆయాంలో అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధ్యక్షులు, కేంద్రీయ పదాధికారులు, ప్రాంతపదాధికారులు, గోరక్షప్రముఖులు, విభాగ్ ప్రముఖులు చాలామంది పదాధికారులు ఉన్నారు. కానీ... నవాబుసాబ్ ఇంట్లో మనుషులు లేనట్లు మన ఆయాంలో కార్యకర్తలు లేరు. కొంత సమయం వరకు మన పదవులను బాధ్యతలను మరచి, కార్యకర్తలుగా మన లక్ష్యసాధనకు పని చేయాలి.

గోసంరక్షణ చేయబడాలంటే - గోసంరక్షణ జరగాలి. ఆవుపాలే త్రాగాలి. మనం భోజనం చేయడానికి ముందు మొదటి రొట్టెను గోవుకు సమర్పించాలి. గోమూత్రం మందులు వాడాలి. గోమయంద్వారా తయారైన సేంద్రీయ ఎరువువాడాలి. అప్పుడు ఇతరులు మనలను అనుసరిస్తారు. కార్యకర్త కర్తవ్యం, సంకల్పం, ఈ రెండు విషయాలు మీ ముందు ఉంచబడ్డాయి. గోసేవ పరమేశ్వర కార్యం. గోరక్షణకై సకారాత్మకమైన ఉద్యమంద్వారా మన పనిలో విజయం సాధించి, చరిత్రను సృష్టిదాం.

**కూర్పు - మర్పల్లిరాంరెడ్డి**

# కేంద్రీయ ట్రస్టు బోర్డు, ప్రబంధ సమితి సమావేశాలు

## 2011 డిశంబనే 10,17,18 ఎర్నాకులం-కేరళ

## 3వ తీర్మానము

- **హిందువుల అధికారాలు, జీవనోపాధిని హరించే కుట్రలను సహించం.**
- **హిందూ ఓ.బి.సి. హరిజన జాతి, గిరిజన జాతి, ఓపన్ కేటగిరిలలో మేము ఏ ఒక్క ఉద్యోగాన్ని, లేదా అధికారాన్ని ముస్లింలకు, క్రైస్తవులకు ఇవ్వనివ్వము.**
- **ఓ.బి.సి. రిజర్వేషన్ నుండి ముస్లిలకు ఒక్క ఉద్యోగాన్ని కూడా ఇవ్వనివ్వము.**
- **ముస్లిం రిజర్వేషన్ రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నది. మత ఆధారిత రిజర్వేషన్ దేశాన్ని ముక్కలు చేసే కుట్ర.**

విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ ట్రస్టు బోర్డు మరియు ప్రబంధసమితి ఏకగ్రీవంగా, తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదేమనగా - యు.పి.ఏ. ప్రభుత్వం సచ్చార్ కమిటి నివేదిక సాకుతో మతం ఆధారంగా హిందూ సమాజం యొక్క వెనుకబడిన తరగతులు (ఓ.బి.సి.) 27 శాతం రిజర్వేషన్ నుండి 6 శాతం అలాగే హరిజాతికి కేటాయించిన రిజర్వేషన్ నుండి కూడ ఏ కొంత భాగాన్ని ముస్లింలకు ఇవ్వకూడదు.

మత ఆధారిత రిజర్వేషన్ భారతీయ రాజ్యాంగానికి విరుద్ధం. భారత సమైక్యతకు, అఖండతకు ప్రమాదం. అలాగే దేశ వేర్పాటువాద భావాలను లేవదీసే విధంగా ఉంది. దీనిని అమలు పరచినట్లయితే దేశం మరొకసారి విభజన అయ్యే ప్రమాదం ఉంది. అందు కొరకు ఈ సమావేశం ఈ రిజర్వేషన్‌ను గట్టిగా వ్యతిరేకిస్తున్నది.

ఇంతకు ముందే ముస్లింలలోని వెనుకబడిన వర్గాలకు హిందువుల వెనుకబడిన వర్గాల (ఓ.బి.సి.) కోటా నుండి రిజర్వేషన్ లభించింది. ముస్లిం విద్యాసంస్థలకు ప్రభుత్వం నుండి సబ్సిడి లభిస్తున్నది. ఐనప్పటికి ఈ సంస్థలలో హిందూ (ఎస్.సి / బి.సి) యువకులకు రిజర్వేషన్ సౌకర్యం తొలగించబడింది. ముస్లింలు, క్రైస్తవుల వికాసం నెపంతో వారిని సంతోష పరచడానికి మూడు-మూడు కమీషన్లు నిర్మాణం చేశారు. ఇంకొక రిజర్వేషన్ ఇవ్వాలని సిపారసు చేయడం ఓటు బ్యాంకు రాజకీయం. అందువలన ఇది రాజ్యాంగ సిద్ధాంతానికి వ్యతిరేకం.

ఆనాడు రాజ్యాంగ సభలో చర్చల సందర్భంగా డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్, పండిత్ జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్, శ్రీ చక్రవర్తి రాజగోపాలా

చారితో పాటు గొప్ప గొప్ప నాయకులందరు మతం ఆధారంగా రిజర్వేషన్ కోరడాన్ని వ్యతిరేకించారు. అంతేకాదు, ప్రథమ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1961 జూన్ 7న మతం ఆధారంగా రిజర్వేషన్ ఇవ్వడాన్ని తిరస్కరిస్తున్నట్లు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఉత్తరాలు వ్రాశారు.

వెనుకబడిన వర్గాల రిజర్వేషన్ నుండి ముస్లింలకు రిజర్వేషన్ ఇవ్వడం ద్వారా యావత్ హిందూ సమాజం భయంకర పరిణామం అనుభవించవలసి వస్తుంది. ఎట్లాగంటే

- వెనుకబడిన జాతుల బలహీన ప్రజలకు (చాలా ఎక్కువ) ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా హాని జరుగుతుంది.
- భవిష్యత్తులో జనసంఖ్య నిష్పత్తిని బట్టి, ముస్లిం, క్రైస్తవులలో రిజర్వేషన్ కోరికను లేపి నిలబెట్టినట్టు అవుతుంది. ఈ రిజర్వేషన్ వారిని దేశ విభజన ఒడ్డున నిలబెడుతుంది.
- మతోన్మాదం, వర్గ సంఘర్షణ అలాగే పోట్లాటలు మొదలగు సంఘటనలు పెరుగుతాయి.
- వెనుకబడిన వర్గాల ఆర్థిక సిబ్బందిలో ముస్లింలు బాగస్థులు కావడం వలన వెనుకబడిన వర్గాలు ఇంకా ఎక్కువ పేదవారుగా, నిరుద్యోగులుగా తయారవుతారు.
- ఆర్థిక రంగంలో ఈనాడు వెనుకబడిన వర్గాల హక్కువారి వ్యవస్థ మరియు వృత్తి, వ్యాపారాలలో వెనుకబడిన వర్గాలకు లభించవలసిన సహాయం ముస్లింలకు పంచబడుతుంది.

అంతర్జాతీయ ముస్లిం సంస్థలు, మరియు క్రైస్తవ సంస్థలు భారత్ యొక్క హిందూ యువకులను తమతమ మతాలలోకి మత మార్పిడి చేసి. తమ జన సంఖ్యను పెంచుకొని, భారత్‌ను అంతర్జాతీయ తీవ్రవాద యుద్ధక్షేత్రంగా నిర్మాణం చేసే కల్పన పెరుగుతుంది. ఇంకా మత మార్పిడికి ప్రోత్సాహం లభిస్తుంది.

ఈ సమావేశం గౌరవనీయ రాష్ట్రపతితో చెప్పదలచుకున్నదేమనగా – ముస్లిం మతంలో కుల వ్యవస్థకు ప్రాముఖ్యత లేదు. కాబట్టి మతం ఆధారంగా కుల పరమైన రిజర్వేషన్ లభించరాదు. మీరు జాతి యొక్క సామాజిక, రాజ్యాంగహితాన్ని దృష్టిలో ఉంచుకొని, దీనిలో జోక్యం చేసుకొని, రాజ్యాంగం మరియు సుప్రీంకోర్టు నిర్ణయానుసారం మత రిజర్వేషన్‌ను రద్దు చేయడానికి, ఈనాటి యు.పి.ఎ. ప్రభుత్వాన్ని ఆదేశించాలి.

ఈనాడు ఓ.బి.సి. రిజర్వేషన్లు లాగుకొనబడుతున్నవి. భవిష్యత్తులో హరిజన జాతి రిజర్వేషన్ లాగుకొని ముస్లిం మరియు క్రైస్తవులకు ఇవ్వబడుతాయి. గిరిజన జాతి రిజర్వేషన్ క్రైస్తవులకు ఇంతవరకే ఇవ్వబడింది. ఇప్పుడు భారత రాజ్యాంగాన్ని సవరించి మతం ఆధారంగా మెరిట్ హిదువుల జీవనోపాధిని లాగుకొని, ముస్లింలు మరియు క్రైస్తవులకు ఇవ్వడానికి కుట్రలతో కూడిన యోజన జరుగుతున్నది.

## మన డిమాండ్లు

1. సామాజిక సద్భావాన్ని నష్టపరచే, వేర్పాటు వాదాన్ని ప్రోత్సహించే - జస్టిస్ రంగనాథ మిశ్ర కమీషన్ మరియు సచ్చార్ కమిటి నివేదికలను వెంటనే రద్దు చేయాలి.
2. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ మొదలగు ప్రాంతాలలో ముస్లిం సమాజం యొక్క పేదరికాన్ని సాకుగా చూపుతూ, ఓటు బ్యాంకు యొక్క అసహ్యకర విధానంతో ఇస్తున్న రిజర్వేషన్‌ను కూడ రద్దు చేయాలి.
3. ఓ.బి.సి. 27 శాతం రిజేర్వేషన్ నుండి ముస్లింలకు వేరుగా 6 శాతం రిజర్వేషను ఇవ్వకూడదు.
4. ఇస్లాంలో కులం లేదు. అందువలన ఈనాడు 27 శాతం ఓ.బి.సి. రిజర్వేషన్‌లో కలసి ఉన్న ముస్లిం జాతులను కూడ తొలగించాలి.
5. హరిజన జాతి రిజర్వేషన్ నుండి ముస్లింలకు, క్రైస్తవులకు రిజర్వేషన్ ఇవ్వకూడదు.
6. గిరిజన జాతి రిజర్వేషన్ నుండి క్రైస్తవులను తొలగించాలి.
7. భారత రాజ్యాంగం మత ఆధారిత రిజర్వేషన్‌ను తిరస్కరించింది. అయితే మత ఆధారంగా రిజర్వేషన్ సిఫారసు మరియు రిజర్వేషన్ కోరే వారికి విరుద్ధంగా దేశద్రోహ కేసు నడిపించాలి.

హిందూ సమాజంలో జన్మించిన హరిజన జాతి, గిరిజన జాతి, ఓ.బి.సి. అందరు కలసి, హిందూసమాజం యొక్క జీవనోపాధిని హరిస్తున్న ముస్లిం/ క్రైస్తవ, ఓటు బ్యాంకు ఆధారిత రాజనీతిని ఓడించాలి.

జాతి ఐక్యత, అఖండతలో విశ్వాసముంచే రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలతో, విశ్వహిందూ పరిషత్ ట్రస్టు బోర్డు మనవి చేస్తున్నదేమనగా – పార్టీ గత రాజాకీయలకు అతీతంగా జాతి హితానికి సంఘటితమై, ఈ సిఫారసులను అమలు పరచడానికి వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో సక్రియాశీలంగా పాల్గొనాలి.

# కుల పెద్దల సమావేశము

ఈ సమావేశంలో కులపెద్దలు, సమాజంలోని ప్రతిష్ఠిత వ్యక్తులు మొత్తం 150 మంది పాల్గొన్నారు.

**వేదిక పైన:** 1. శ్రీ జి రాఘవరెడ్డి – అంతర్జాతీయ అధ్యక్షులు

2. డా॥ప్రవీణ్ భాయి తొగాడియా – అంతర్జాతీయ కార్యాధ్యక్షులు

3. శ్రీ యం.రామరాజు – ప్రాంత కార్యాధ్యక్షులు

4. శ్రీ కైలాస్ నారాయణ బాంగ్డియా – ప్రాంత కోశాధికారి.

**శ్రీ యం. రామరాజు - ప్రాంత కార్యాధ్యక్షులు**

మన ప్రభుత్వం హిందువులను లక్ష్యంగా చేసుకొని, విద్య, వైద్యం, సంస్కృతి, పరంపర, ఉత్సవాలు, కులాలు తదితర వ్యవస్థలన్నింటిపై దాడి చేస్తున్నది. మత హింస నివారణ బిల్లు ద్వారా హిందువులను నాశనం చేయాలని చూస్తున్నది. దేశం, ధర్మం గురించి మాట్లాడే నాథుడేలేడు. నాయకులందరూ మతం గురించే మాట్లాడుతారు. ఓ.బి.సి. ఆర్థికంగా వెనుకబడిన హిందువులకు చెందవలసిన రిజర్వేషన్ సౌకర్యాలను, రాజ్యంగ విరుద్ధంగా ప్రభుత్వం ముస్లింలకు ఇవ్వడం జరుగుతుంది.

గులాంనబీ ఆజాద్ భాగ్యనగరం వచ్చి, “చరిత్ర వక్రీకరించబడింది. ముస్లింలకు తగిన స్థానం ఇవ్వలేదు” అన్నాడు. చరిత్ర ముస్లిలకు విరుద్ధంగా కాదు. హిందువులకే వ్యతిరేకంగా వ్రాయబడింది. శివాజీ, రాణాప్రతాప్ వంటి దేశభక్తులకు చరిత్రలో స్థానం కల్పించలేదు. ఔరంగజేబు లాంటి వారిని నిజాయితీ పరులుగా చిత్రీకరించడం జరిగింది. రిజర్వేషన్ల ద్వారా దేశం మరొక సారి ముక్కలవుతుంది. ఈ రిజర్వేషన్లను ప్రజా ఉద్యమం ద్వారా అడ్డుకుంటాం.

**డా॥ ప్రవీణ్ భాయి తొగాడియా - అంతర్జాతీయ కార్యాధ్యక్షులు**

ఒక వేయి సం॥రాల కాలగమనంలో ఔరంగజేబు, ఘోరీ, గజనీ, పరిపాలించిన కాలంలో జరుగనటువంటి ప్రమాదాలు భారత విభజన సమయంలో జరిగాయి. 10 లక్షల మంది హిందువులు చంపబడ్డారు. ఒక కోటి మంది శరణార్థులుగా భారత్‌లోకి చొచ్చుకొని వచ్చారు. మళ్ళీ అలాంటి భయానక పరిస్థితులు

రాబోతున్నాయని వాటిని ఎదుర్కొనడానికి హిందూ జాతి సంసిద్ధం కావాలని సంకల్పం చేయించడానికే నేను ఇక్కడికి వచ్చాను.

ఓ.బి.సి. రిజేర్వేషన్ 27 శాతం నుండి 22.5 కు కుదిరించి 4.5 శాతం ప్రభుత్వం ముస్లిలకు ఇవ్వచూస్తున్నది. హిందువుల పొట్టగొట్టి, ముస్లింల పొట్ట నింపాలని చూస్తున్నది. దేశవిభజన జరిగినప్పుడు 35 కోట్ల మంది ముస్లింలు భారత్‌లో ఉన్నారు. ఈనాడు 15 కోట్లకు పెరిగారు. మొత్తం భారత్‌నే పాకిస్తాన్‌గా మార్చాలని ప్రయత్నిస్తున్నారు. ముస్లిం ఓటు బ్యాంకు వలలో చిక్కుకున్న ప్రభుత్వం సంతుష్టికరణ విధానంలో భాగాంగా వారి ముందు మోకరిల్లుతుంది. ముస్లిం ఓటు బ్యాంకు రాజకీయం అన్ని పార్టీలపై ప్రభావం చూపుతుంది.

ముస్లింలు ఈ దేశంలో పేదవారుగా ఉన్నారా! అలాగైతే దేశంలో ఎత్తైన మసీదులు ఎలా నిర్మించారు. క్రైస్తవులు బీదవారా? పెద్దపెద్ద చర్చీలు ఎలా కట్టగలిగారు. భారత్‌లో ఉన్న ముస్లింలు పేదవారు కాదు. అందరితో సమానంగా హక్కులు అనుభవిస్తున్నారు. విదేశాలలో మాత్రం ముస్లింలు అనేక బాధలు అనుభవిస్తున్నారు. 2004 రాజేంద్ర సచ్చార్ కమిటి, మైనార్టీలు విద్య, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడ్డారని యు.పి.ఎ. ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. 2005 లో శ్రీరంగనాథమిశ్ర కమీషన్ మైనారీటీలకు రిజర్వేషన్ కల్పించాలని నివేదికలో తెలిపింది.

సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులైన ఓ.బి.సి.లకు 27 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఆర్టికల్ 16 లో (4) లో పేర్కొనబడింది. అందులో నుండి ముస్లిలకు 4.5 శాతం రిజర్వేషన్ కల్పించడం రాజ్యాంగ విరుద్ధం. ఓ.బి.సి. లలో కమ్మ, కాపు, రెడ్డి, వివిధ వెనుక బడిన వారికి ఉద్యోగాలు లభించవు.

ఈ రిజర్వేషన్ ప్రకారం రహీంకు, బ్యాంకుల్లో 10 లక్షల అప్పు లభిస్తుంది. 6 శాతం వడ్డీ మాత్రమే చెల్లించాలి. కాని రామరాజుకు 8.5 లక్షల మాత్రమే అప్పుగా దొరుకుతుంది. 13 శాతం వడ్డీ చెల్లించాలి. 67 జిల్లాలలో ముస్లిం బాలికల కొరకు 36 కళాశాలలు తెరిచారు. హిందువుల బాలికలు చనిపోయరా ఏమిటి? స్కాలర్ షిప్‌లు వ్యాపారాలు ఉద్యోగాలు అన్ని సౌకర్యాలు పొందుతున్న రహీం వ్యాపారం వృద్ధిచెందుతుంది. కాని రామరాజు వ్యాపారం వడ్డీ చెల్లించలేక నష్టపోతుంది. ప్రభుత్వం – ఉద్యోగం, వ్యాపారాల సౌకర్యాలు ముస్లింలకు, క్రైస్తవులకు కల్పించి, హిందువులను మోసం చేస్తున్నది.

హిందువులను ఏవో కేసులలో ఇరికించి జైలుపాలు చేయాలని ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నది. ఔరంగజేబు, మహమ్మద్ గజనీ, ఘోరీ చేయలేని పని ఈనాడు ప్రభుత్వం చేస్తున్నది. హిందువుల – ఉద్యోగ, వ్యాపార, ఆహార హక్కులను అపహరించి, ముస్లిలకు ఇవ్వచూస్తే హిందూ జాతి సహించదు. ఉద్యమం లేవ దీస్తాం. జిల్లాల వారిగా సమావేశాలు ఏర్పాటు చేస్తాం. కమ్మ, కాపు, రెడ్డి, శర్మ అన్ని కులాల వారిని ఒక వేదిక మీదకు తీసుకొనివస్తాం. ముస్లిం ఓటు రాజకీయాలకు తగిన గుణపాఠం చెబుతాం. కులాలు, వర్గాలు అందరిని కలుపుకుని రిజర్వేషన్లు రద్దు చేయడానికి రాష్ట్రపతికి వినతి పత్రం సమర్పిస్తాం, కరపత్రాలు పంచుతాం, యస్.ఎమ్.యస్. ద్వారా ప్రచారం చేస్తాం.

## హిందూ జాతిని జాగృతం చేసే రకాలు.

1. కుల,వర్గ, భాష, ప్రాంతం, అన్నింటికి అతీతంగా హిందువులందరిని ఒకే వేదిక మీదకు తీసుకొని వస్తాం.
2. ప్రభుత్వం హిందూవుల హక్కులను అపహరిస్తున్న కుట్రలు–కుతంత్రాల గురించి విద్యార్థులకు తెలుపుతాం.
3. యువకుల సమ్మేళనాలు నిర్వహించి వారిని జాగృతం చేస్తాం.
4. మహిళలలో చైతన్యం తీసుకొని వస్తాం.

## హిందువుల డిమాండ్లు

1. ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు సమర్పించిన రాజేంద్ర సచ్చార్ కమిటీ, రంగనాథమిశ్ర కమీషన్‌ల రిపోర్టులను రద్దు చేయాలి.
2. ఓ.బి.సి. 27 శాతం రిజర్వేషన్ నుండి 4.5 శాతం రిజర్వేషన్లను ముస్లింలకు ఇవ్వకూడదు.
3. బీదరికం సాకును చూపించి, ఓటు బ్యాంకు వ్యామోహంతో, ముస్లిం సమాజానికి ఇవ్వబడిన రిజర్వేషన్లలను రద్దుచేయాలి.
4. ఇస్లాంలో కులంలేదు. 27 శాతం ఓ.బి.సి రిజర్వేషన్ నుండి ముస్లింలను తొలగించాలి.
5. హరిజన జాతుల రిజర్వేషన్‌ల నుండి ముస్లింలకు, క్రైస్తవులకు రిజర్వేషన్లు కల్పించకూడదు.
6. గిరిజన జాతి రిజర్వేషన్ నుండి క్రైస్తవులను తొలగించాలి.
7. భారత రాజ్యాంగం మతం ఆధారంగా రిజర్వేషన్ కల్పించదు. తిరస్కరిస్తుంది. మతం ఆధారంగా రిజర్వేషన్ కొరకు సిఫార్స్ చేసే వారికి విరుద్ధంగా దేశద్రోహం కేసు నమోదు చేయాలి.

# భారత భాగ్య విధాత శ్రీ గురూజీ

– ఆర్. మల్లికార్జునరావు

ఎవరైనా మహాపురుషుడ్ని అర్థం చేసుకోవాలంటే ఆ మహా పురుషుడు జన్మించిన నాటి పరిస్థితులు అర్థం చేసుకోవాలి. అప్పుడే ఆ మహాపురుషుడు సాధించిన విజయాలు మనకు అర్థమవుతాయి. భారత దేశంలో స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న రోజులలో ఈ దేశంలో అనేకమంది మహాపురుషులు జన్మించారు. ఒకరి తరువాత ఒకరు ఈ దేశ పునర్నిర్మాణమునకు తమవంతు పనులు చేసుకొంటూ వెళ్లారు. ఒకప్రక్క ఈ దేశానికి స్వాతంత్ర్యం సంపాదించుటకు ఉద్యమిస్తూనే మరోప్రక్క పరిష్కారానికి ప్రయత్నాలు చేసుకొంటూ వచ్చారు. ఈ రెండింటిలో ఎవరి ప్రాధాన్యతలు వారివి. గాంధీజి స్వాతంత్ర్య పోరాటం సాగిస్తూనే దేశంలోని అంటరానితనం తొలగించటానికి, స్వదేశీ ఆర్థిక వికాసం కొరకు కృషి చేశారు. స్వామి వివేకానంద ఈ దేశంలో యువకులను ఉత్తేజపరచటానికి కృషి చేశారు. డాక్టర్ కేశవరావు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూనే "హిందూ సమాజ సంఘటనకు" చేయవలసిన పనుల గురించి స్వయంగా ఆలోచిస్తూ, అనేకమందితో చర్చిస్తూ వచ్చారు. ఒక స్పష్టమైన ఆలోచనకు వచ్చి 1925 వ సంవత్సరంలో రాష్ట్రీయ స్వయంసేవక సంఘాన్ని ప్రారంభించారు. 15 సంవత్సరాల పాటు నిర్విరామంగా కృషి చేసి సంఘకార్యాన్ని దేశమంతటా వ్యాప్తి చేశారు. ఆ తదుపరి ఆ పనిని విరామం లేకుండా దేశంలో నాలుగు మూలలకు విస్తరింపచేయటానికి కృషి చేసినవారు శ్రీ గురూజీగా ప్రసిద్ధి పొందిన మాధవరావు సదాశివరావు గోల్వల్కర్.

శ్రీ గురూజీ సర్‌సంఘచాలక్ బాధ్యతలు తీసుకునే నాటికి దేశంలో క్లిష్ట పరిస్థితులు నిర్మాణమయి ఉన్నాయి. దేశవిభజనకు ఆలోచనలు బలపడుతూ వస్తున్నాయి. ఈ సమయంలో అన్ని పరిస్థితులను అధిగమించేందుకు తగు శక్తిని నిర్మాణం చేయటానికి దేశమంతా విస్తృతంగా పర్యటించారు. ఈ సమయంలో జరిగిన దేశ విభజనను నివారించలేకపోయిన విభజన కారణంగా విడిపోయిన భూభాగాల నుండి వచ్చిన వారికి సురక్షిత వ్యవస్థ ఏర్పాట్లలో స్వయం సేవకులు నిర్విరామంగా పనిచేశారు.

విడిపోయిన భూభాగాలలో హిందువులకు ధైర్యం చెప్పేందుకు ఆ ప్రాంతాలలో శ్రీ గురూజీ పర్యటించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఒకప్రక్క గాంధీజీ ప్రతిపాదించిన దేశీయ విధానాలు, నెహ్రూ అనుసరించిన రష్యన్ అభివృద్ధి విధానాలు : మరోప్రక్క పెరుగుతున్న కమ్యూనిజంకి మధ్య ఈ దేశ అభివృద్ధి విధానాల ప్రయాణం ప్రారంభమైంది.

ఈ దేశం యొక్క అన్ని జీవన రంగాలలో భారతీయ దృష్టి కోణంతో వికాసం కోసం ప్రయత్నాలు చేయవలసిన ఒక చారిత్రాత్మక ఆవశ్యకత ఏర్పడింది. ఈ ఆవశ్యకతను పూరించటానికి భారత్‌ను భారత్‌గా నిలబెట్టడానికి శ్రీ గురూజీ సంకల్పించారు. ఆ దిశలో పనులు చేయటానికి స్వయం సేవకులకు మార్గదర్శనం చేసారు. ఆ క్రమంలో విద్యార్థి రంగంలో ఏ.బి.వి.పి., విద్యారంగంలో విద్యాభారతి, ధార్మిక రంగంలో విశ్వహిందూ పరిషత్, కార్మికరంగంలో బి.ఎమ్.ఎస్. మొదలైన సంస్థలు ప్రారంభమైనాయి. సంఘం శాఖపనితోపాటు, ఈ పనులన్నీ సక్రమంగా నిర్వహించుటకు ఒక ప్రణాళికాబద్ధంగా ప్రయత్నాలు చేసింది. దాని ఫలితంగా ఈ రోజున ఆ వివిధ క్షేత్రాలు జాతీయ క్షేత్రాలుగా దేశమంతటా విస్తరించాయి. దేశం యొక్క అన్ని జీవన రంగాలలో అగ్రస్థానంలో నిలబడి పనిచేస్తున్నాయి. ప॥పూ॥శ్రీ గురూజీ స్వయంగా ప్రారంభించిన విశ్వహిందూపరిషత్ ఈ రోజున ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులకు సంబంధించిన సంస్థగా వికసించింది. ధార్మిక, ఆధ్యాత్మిక గురు పరంపరలను సమన్వయపరుస్తూ, అందరినీ కలుపుకొని పోగల శక్తిగా నిర్మాణమైంది. విద్యార్థిరంగంలో ఎ.బి.వి.పి. ఈ దేశంలో మొదటిస్థానంలో నిలబడి విద్యార్థి రంగ సమస్యలు, విద్యాక్షేత్ర వికాసము కొరకు పనిచేస్తున్నది. భారతీయ మజ్దూర్ సంఘం ఈ దేశానికే కాక, ప్రపంచంలో చాల దేశాలకు ఆదర్శవంతంగా నిలబడింది. సమాజానికి సంబంధించిన అన్ని రంగాలలో లక్షలమంది కార్యకర్తలు పనిచేస్తున్నారు. దీనితోపాటు అన్ని క్షేత్రాలు కూడా సేవా కార్యక్రమాలు ప్రారంభించాయి. సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలను మిగతా సమాజంతోపాటు అభివృద్ధి దిశలో పయనింప చేయటానికి కృషి ప్రారంభమైంది. దేశహితం అనే గీటురాయిమీద ఈ క్షేత్రాలన్నీ పనిచేస్తున్నాయి.

గోహత్య నిషేధం విధించాలని కోరుతూ స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజులలో పూజనీయ శ్రీ గురూజీ మార్గదర్శనంలో పెద్దఎత్తున సంతకాల సేకరణ చేసి ఆనాటి రాష్ట్రపతికి ఇవ్వటం జరిగింది. 2009 సంవత్సరంలో విశ్వమంగళ గోగ్రామ యాత్ర

పేరుతో దేశంలో గో ఆధారిత వ్యవసాయం, వైద్యం, గో ఆధారగ్రామాలు మొదలైన వాటిని జాగృతం చేసేందుకు విశేష ప్రయత్నం జరిగింది. ఒకప్పుడు ఈశాన్య భారత్ మన చేతులలో ఉంటుందా? అనే భయం ఉండేది. ఈ రోజు ఈశాన్య భారత్‌లో వనవాసీ కళ్యాణక్షేత్రం, విద్యాభారతి మొదలైన సంస్థల పని కారణంగా ఈశాన్య భారత్‌లోని పరిస్థితులను అధిగమించగలం అనే విశ్వాసం ఏర్పడుతున్నది. పూజనీయ శ్రీ గురూజీ ప్రేరణతో ఈ దేశంలో జరుగుతున్న ప్రయత్నాలతో భారతదేశం భారత దేశంగా నిలబడింది. ఈ రోజున దేశవ్యాప్తంగా అందరి విశ్వాసాన్ని చూరగొంటున్నది.

సంఘ ప్రార్థనలో “పరమ వైభవ స్థితి” కల్పన స్వయం సేవకుల ముందు ఉంచి ఈ రోజున జరుగుతున్న పనులు ఒకవేళ ప్రారంభం కాకుండా ఉండి ఉన్నట్లయితే పరిస్థితులు ఎట్లా ఉండేవో అలోచిస్తే అర్థమవుతుంది. పూజనీయ డాక్టర్‌జీ 1940 వ సంవత్సరంలో జరిగిన శిక్షావర్గలో “హిందూరాష్ట్రం యొక్క చిన్నరూపాన్ని నేను చూస్తున్నాను” అని అన్నారు. 1973వ సంవత్సరం మార్చి 23, 24 తేదీలలో జరిగిన అఖిల భారత ప్రతినిధి సభలో పూ॥శ్రీ గురూజీ “మన పనికి విజయమే విజయం లభిస్తున్నది” అన్నారు. దేశంలో వేర్పాటువాదంతోపాటు అనేక ఇతర సమస్యలు పెరుగుతున్నాయి. వీటన్నింటిని అధిగమించేందుకు ఏకాగ్రతతో పనిచేయాలని ఆ సభలో పిలుపునిచ్చారు. ఈ రోజున హిందుత్వమును కాపాడుకొనుటకు దేశంలో పనిచేస్తున్న అనేకమంది సాధుసంతులను అందరిని కలుపుకొనిపోయే ఒక సమన్వయ శక్తిగా సంఘం సమాజం ముందు నిలబడింది. సంఘము – సమాజం ఏకరూపత ఈ రోజున కనబడుతున్నది. పూ॥శ్రీ గురూజీ జీవనం, వారి మార్గదర్శనం ఈ అద్భుతమైన కార్యసాధనకు ప్రేరణ.

## హిందుత్వ విజయం

ఇటీవల రష్యాలో భగవద్గీతను నిషేధించండి. శ్రీకృష్ణుడు తీవ్రవాదాన్ని ప్రోత్సహించి నక్సలైట్ అగ్రనాయకుడయ్యాడు “అని దేశకోర్టులో వాదించగా, శ్రీకృష్ణ చైతన్య సంస్థ (ఇస్కాన్) తరపున పై విమర్శలన్నింటిని త్రిప్పికొట్టి విజయం సాధించింది. ప్రపంచవ్యాప్తంగా 75 భాషలలో “భగవాన్ ఉవాచ” భాసించుచున్నది. రష్యన్ భాషలో కూడ వెలుగొందుచున్నది.

– శ్రీ సాయి రామానందస్వామి

# ప్రేమను స్వాగతిద్దాం ! వాలెంటైన్స్‌డేని బహిష్కరిద్దాం !!

– డి.జి. విజయలక్ష్మి

మన సంస్కృతిలో ప్రేమ అనేది విశ్వజనీనం. ఎవరు ఎవరినైనా ప్రేమించవచ్చు. 'ప్రేమమయం జగత్' అన్నారందుకే. ఈ ప్రేమభావం ఎక్కువైతే భక్తి అంటాం. మనం బాధపడుతుంటే అవతలవారి కంట్లో నీరు తిరగటం, మనం నవ్వితే మన కంటే ఎక్కువగా వారు సంతోషించగల్గటం నిజమైన ప్రేమ. ఒక్కొక్కసారి మనకిష్టమైన దానికోసం మిగతావన్నీ వదులుకోవటానికి కూడ సిద్ధపడతాం. ఆ త్యాగం ప్రేమకు పరాకాష్ఠ.

కాని నేటి సభ్య సమాజంలో ప్రేమ అనే పదానికి అర్థం మారిపోయింది. అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి తిరగటమే ప్రేమ అని భాష్యం చెప్తున్న సినిమాలు, వికృతమైన వస్త్రధారణతో యువతను వెర్రెక్కించి వెంట తిప్పుకున్న సన్నివేశాలు చూస్తూ పిల్లలు పాడైపోతున్నారని నిట్టూర్చే జనాలున్నంత వరకూ ఈ స్థితి మారదు. దీనివల్ల కల్గే విపరీత పరిణామాలకు ప్రేమ ముసుగు వేస్తున్నారు.

తాను ప్రేమించిన అమ్మాయి 'ఐ లవ్ యూ" చెప్పలేదని, యాసిడ్ ముఖాన పోసేవాడిదీ, బ్లేడుతో గొంతునరాలు కోసేవాడిదీ ప్రేమ అనగలమా? ప్రేమ పేరుతో క్లబ్బులు–పబ్బులు, పార్కులు తిప్పుతూ కడుపుచేసి వదిలేసేవాడిది ప్రమౌతుందా? అందమైన అమ్మాయిలపై ప్రేమవలవేసి, లవ్ జిహాద్‌లంటూ విదేశాలకు విక్రయించేవారిదీ ప్రేమేనా? అయితే ఇవి రాక్షసత్వ, పైశాచికత్వపు ప్రేమలనాలి.

ప్రేమించటం అంటే ప్రాణమివ్వటం కాని ప్రాణం తియ్యటంకాదు. మనం ప్రేమించేవారి కోసం ఏమైనా చెయ్యగల ప్రేమను, ప్రేమికులను ఎవ్వరూ వ్యతిరేకించరు. ఈ మధ్య ఈ ప్రేమను బహిరంగంగా వ్యక్తం చేయటం ఫ్యాషనైపోయింది. గ్రీటింగ్స్ చెప్పటం, గిఫ్టులివ్వటం కాక పబ్లిగ్గా కౌగిలించుకోవటం వరకూ వచ్చింది. వాలైంటైన్స్‌డే రోజు ఈ ప్రేమ పూర్తిగా బాజారెక్కుతుంది. అచ్చ తెలుగులో చెప్పాలంటే ప్రేమికులదినం. ఆరోజు టీవి ప్రతి ఛానల్లో ప్రేమకథలు, ప్రేమికులులే వుంటారు. సెల్‌లో ప్రతిక్షణం ప్రేమ సందేశాలు వస్తుంటాయి. నిజానికి వీళ్లెవరికీ వాలెంటైన్ గురించి తెలిసి వుండదు. తెలిస్తే ఈ హంగామా వుండదేమో!

వాలెంటైన్ ఎవరంటే ప్రేమికుడు మాత్రం కాదు. ఒక చర్చిలో మత ప్రబోధకుడు. ఇంకా చెప్పాలంటే రాజాజ్ఞను ధిక్కరించి యువతను తప్పుదారి పట్టించబూనిన దేశద్రోహి అనవచ్చు. 268–70 మధ్యకాలంలో రోమ్ నగరంలో ఒక చర్చిలో పనిచేస్తున్న వాడు వాలెంటైన్, ఆ దేశపు రాజు క్లాడియస్ దేశ సంక్షోభస్థితి నెదుర్కొనటానికి యువకులందరూ సైన్యంలో చేరాలని ఆజ్ఞలు జారీ చేస్తే, ఇతను చర్చిలో రహస్యంగా ప్రేమ వివాహాలు

జరిపించే వాడట. ఇది తెలుకున్న రాజు, అతనిని పిలిపించి, దేశ పరిస్థితి వివరించి, వారించబోతే, మీరు కూడ యుద్ధం మానేసి శత్రువులతో ప్రేమ ప్రకటించమన్నాడట. అపుడు రాజు 'యుద్ధానికి సిద్ధమై వస్తున్నవారు మనమాట వింటారా? ఎదుర్కొనకపోతే నగరం శత్రువుల పాలౌతుంది. యువకులకు దేశరక్షణ గురించి చెప్పు' అన్నాడు. కాని వాలెంటైన్ వినక ప్రేమ వివాహాలు జరిపిస్తుంటే చెరసాలలో పెట్టించారు. అక్కడకూడ తనను చూడవచ్చిన యువతకు ప్రేమ బోధలు చేస్తుంటే రాజు అతనికి ఫిబ్రవరి 14న ఉరి తీయమని శాసించాడు.

తర్వాత 200 సంవత్సరాలకు 498లో ఆచర్చికి వచ్చిన పోప్ గెలిలియస్ ఈ సంగతి తెల్సుకుని ఫిబ్రవరి 14ను వాలెంటైన్‌డేగా ప్రకటించాడు. కనుక ఇది ప్రేమికుల రోజుకాదు. దేశరక్షణ కంటే ప్రేమ గొప్పదని భావించిన పరదేశ, పరమతస్థుడైన వ్యక్తి తద్దినం రోజు.

ఈ దేశంలో ప్రేమ త్యాగానికి కూడ సిద్ధమంటుంది. కొత్తగా పెళ్లై యుద్ధరంగంలో భర్త తనమీద ప్రేమతో వెనకడుగు వేయకూడదని, తనతల నరికి భర్తకు పంపి కర్తవ్యపాలనకు అడ్డుతొలగిన ప్రేమమూర్తి మధురాణి పుట్టిన దేశమిది. నవవధువైనా వీరతిలకం దిద్ది భర్తను యుద్ధానికి పంపిన మాంచాల పుట్టిల్లు ఈ దేశం. నాదేశం, ప్రజలకోసం నా సీతనైనా వదులుకుంటానన్న రాముడు పుట్టిన దేశం ఇది. తనవలెనే అన్ని ప్రాణులను ప్రేమించాలనే ప్రేమతత్త్వం జీర్ణించుకున్న మనం దేశం కంటే ప్రేమ గొప్పదన్న పరమతస్థుడి దినం సంబరంగా జరుపుకుంటున్నందుకు సిగ్గుపడాలి.

మనం ప్రేమను వ్యతిరేకించటంలేదు. వాలెంటైన్ తద్దినాన్ని వ్యతిరేకిస్తున్నాం. ప్రేమ వివాహాల్ని వ్యతిరేకించటం లేదు. ప్రేమ పేరుతో వివాహానికి ముందు జరిగే విశృంఖత్వాన్ని వ్యతిరేకిద్దాం. రెండు మనసుల్ని కలిపే అద్భుత మంత్రం ప్రేమ. అది వివాహంతో పవిత్రమౌతుంది. సంతానంతో పటిష్టమౌతుంది. ప్రేమ మనసుల్ని ఒకటి చేస్తే, పెళ్ళి మనుషుల్ని ఒకటి చేస్తుందని, ప్రేమకు శృంగారానికి మధ్యనున్న తెర వివాహం తర్వాతే తొలగించాలనే సంప్రదాయం వెనుక ఎన్నో నీతులు, రీతులు, కుటుంబ మర్యాదలు, కట్టుబాట్లు ముడివడి వున్నాయి.

"ప్రేమకు, పెళ్లికి విలువనిచ్చే సంప్రదాయానికి వారసులమైన మనం ప్రేమను స్వాగతిద్దాం! వాలెంటైన్ తద్దినాన్ని బహిష్కరిద్దాం. మనల్ని ప్రేమించే వారిని ప్రేమిద్దాం. మనచుట్టూ వున్నవారిని ప్రేమిద్దాం. మనకు నచ్చినవారిని, మనలను నచ్చినవారినే పెళ్లి చేసుకొందాం, అని యువత మాటల్లో కాక చేతల్లో చూపగల్గితే ప్రేమకు విలువ, ప్రేమికుల పరువు పెరుగుతుంది.

# మాతా అమృతానందమయి

*డా॥ బొడుపల్లి మాణిక్యాచార్యులు*

స్వాములు, సాధ్వీమ తల్లులు, ధర్మాచార్యులు, పీఠాధిపతులు తపస్సంపన్నులుగా సాధన చేస్తూ సమాజములో ధర్మ ప్రచారం చేస్తుంటారని సర్వ సామాన్యులకు తెలిసిన విషయమే. అందుకొందరు తమ తపోబలము వల్ల అతీంద్రియ శక్తులనుపయోగించి భక్తుల మానసిక శారీరక జాఢ్యములను కూడా దూరంచేస్తూ వుంటారు. దేనికి తోడుగా బీద, దు:ఖతుల ఈతి బాధలు తొలగించు ప్రయత్నంలో అనేకానేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ దరిద్రనారాయణ సేవ చేస్తున్నారు.

ఈ విషయంలో వారు సాధారణంగా ప్రచారం చేయరు. దీనికి కారణం సర్వమానవాళిని సమాజ పరమేశ్వర స్వరూపంగా ఆరాధించే భావకులు, భక్తులు సమాజసేవను తమ కుటుంబము వారికి చేసిన సేవగానే భావిస్తారు. మనం మన కుటుంబ వ్యక్తులకు సేవచేసి విశేషసేవగా అన్యులకు చెప్పము. కాబట్టి మహాత్ములు చేసే సేవాకార్యములను ప్రచారం చేయరు. కాని వారు చేస్తున్న దరిద్ర నారాయణసేవలో మనం సహకరించాలి. అలాంటి ఆధ్యాత్మిక వేత్తలల్లో కేరళ రాష్ట్రంలోని మాతాఅమృతానందమయిగారు చేస్తున్న సామాజిక సేవ అనన్యసామాన్యమైనది.

**వైద్యసేవ** – ఎ.ఐ.యం.యస్. అమృతా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సు : ఇది 1600 పడకల సూపర్ స్పెషాలిటీ అసుపత్రి కోచ్చిన్ కేరళలో వుంది. 5000 మంది ఆసుపత్రి పరిచారక బృందంతో 25 అత్యున్నత ప్రమాణముగల ఆపరేషన్ థియేటర్లు 210 ఐ.సి.యు.మంచాలతో 50 వివిధ శాఖలు కల్గి, 1998 సంవత్సరం నుండి మామూలు ప్రజలకు, బీదవారికి అందుబాటులో వుంటూ ఆత్మీయతతో రోగులకు సేవలందిస్తున్నారు. ప్రతిదినం 24 గంటల సేవలందిస్తూ టెలీ మెడికల్ సర్వీస్ కూడా ఏర్పాటు చేశారు. దీనితో పాటు వైద్యకళాశాల. డెంటల్ కాలేజ్, ఫార్మసీ కళాశాల మొదలగునవి నడుపబడుచున్నవి. అమెరికా, కెనడా, యూరోప్, ఇతర దేశాలతో వైద్యనిపుణుల పరస్పర సలహా సహకార వ్యవస్థ వుంది.

ఇది గాక బొంబాయిలో క్యాన్సర్ కేంద్రం, తిరువనంతపురంలో ఏయిడ్స్ చికిత్సాకేంద్రం, కేరళ గ్రామాలలో ఉచిత డిస్పెన్సరీస్, అంబులెన్స్ వ్యవస్థ ఏర్పాటు

చేశారు. పంపా ఒడ్డున ఉచిత వైద్యసేవలు, మైసూరు కర్నాటక గ్రామాల్లో కూడా ఆసుపత్రులు ఆశ్రమంవారు నిర్వహిస్తున్నారు.

అల్లోపతితో అయుర్వేద ఆసుపత్రులు, ఆయుర్వేద కళాశాలలు, పరిశోధన కేంద్రాలు నెలకొల్పారు.

ప్రకృతి వైపరీత్య ప్రమాదాలలో అనేక సహాయ కేంద్రాలను నెలకొల్పి రక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. సునామీ, గుజరాత్ భూకంపం, కశ్మీర్ భూకంపం, వరద భీబత్సం బీహార్, గుజరాత్, బొంబాయిలోను హరికేన్ యు.యస్.ఎ. అమెరికాలో సహాయకార్యాలు పెద్దఎత్తున నిర్వహించారు.

**విద్య :** అమ్మ ప్రపంచ మానవాళిని తన ఆధ్యాత్మిక ఆత్మకౌగిట ఆశీర్వదించి దైవిక పరావిద్యను ప్రసాదిస్తూ వుంది.

మనిషి జీవనోపాధికి కావలసిన విశ్వవిద్యాలయ విద్యను గూడా పెద్ద ఎత్తున ప్రజలకు ముఖ్యంగా బడుగువర్గాలకు అందజేస్తుంది. 1987 నుండి పాఠశాల విద్యతో ప్రారంభించి నేటికి అమృతా విశ్వవిద్యాపీఠము ఆధ్వర్యములో 60 విద్యాసంస్థల పైబడి ఐ.టి. ఇంజనీరింగ్ వైద్యకళాశాలలు, మ్యానేజిమెంట్ జర్నలిజం వంటి కోర్సులను దేశంలో పలురాష్ట్రాలలో బోధిస్తున్నారు.

**సాంస్కృతిక, ఆధ్యాత్మిక విద్య :** ప్రపంచములో పూజ్య అమృతానందమయి మాత వంటి జగద్గురువులు భారతదేశంలో పుట్టి ఆధ్యాత్మిక విద్యను ప్రచారం చేయుట వల్లనే భారతమాతకు జగద్గురు స్థానం లభించింది. సత్యం, ఆహింస, బ్రహ్మచర్యం, త్యాగశీలం, సర్వప్రాణులలో ఆత్మదర్శనం, ధ్యానం, తపస్సువల్ల ఆత్మసాక్షాత్కారం పొందాలనే, హిందూజీవన లక్ష్యం. దీనికై ఆమ్మ బ్రహ్మస్థానం ఆలయ నిర్మాణం, నిత్యఅగ్నిహోత్రం విధి, లలితాసహస్రనామ, మానసపూజ, సర్వజనులచేత పఠనము, భక్తితన్మయత్వంలో సంకీర్తన, ధ్యానం ప్రచారం చేస్తున్నారు. దేశ విదేశాలల్లో అమ్మ ఆశ్రమాల్లో ఈ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నవి.

**సామాజిక సేవాకార్యం :** నిష్కామకర్మ, సమర్పణ భావంతో చేయుసేవ మానవ ఔన్నత్యానికి పునాదికాగలదని అమ్మ చెప్పారు. అందువల్ల అనేక సామాజిక సేవలు తమ ఆశ్రమం ద్వారా నిర్వహిస్తున్నారు. 1987లో ఇల్లు నీడలేని అభాగ్యులకు ఒక లక్ష ఇండ్లు కట్టిచ్చారు. (అమృత కుటీర్ యోజన పేరుతో) తల్లిదండ్రుల రక్షణలేని 30,000 పిల్లలకు అనేక అనాథశరణాలయాలు ప్రారంభించారు.

– సశేషం



తేది. 25-12-2011న ఒంగోలులో జరిగిన ప్రాంతస్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేస్తున్న పూజ్యశ్రీ పరిపూర్ణానందస్వామి




తేది. 29-12-2011న - ఓబిసి రిజర్వేషన్ 27 శాతం నుండి - చీల్చి 4.5 శాతం రిజర్వేషన్లను ముస్లింలకు ప్రభుత్వం ఇస్తున్నందున - నెల్లూరులో మత రిజర్వేషన్లను రద్దుచేయాలని ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం.



తేది. 23-1-2012న భాగ్యనగరం - చార్మినార్ ఆవరణలోని భాగ్యలక్ష్మీ దేవాలయంలో గంటలు మ్రోగించడాన్ని అడ్డుకున్న వారిని వ్యతిరేకిస్తూ, పూజారులను పరామర్శిస్తున్న విశ్వహిందూపరిషత్ ప్రాంత సహకార్యదర్శి శ్రీ యమన్‌సింగ్.

పశ్చిమ గోదావరిజిల్లా, జంగారెడ్డిగూడెం ప్రఖండ, పేరంపేట గ్రామంలో,
తేది. 4-1-2012న జరిగిన పునరాగమన కార్యక్రమాల దృశ్యాలు.



పేరంపేటలో పాదయాత్ర చేస్తున్న పూజ్య స్వామీజీలు



మతం మారిన మన సోదరులను 53 మందిని తిరిగి హిందూ ధర్మంలోకి
ఆహ్వానిస్తున్న పూజ్యశ్రీ శివస్వామి, శైవక్షేత్ర పీఠాధిపతులు.



పునరాగమనం సందర్భంగా యజ్ఞం, పూజ నిర్వహిస్తున్న దృశ్యం.



తేది. 12-1-2012 స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిజామాబాద్ - విశ్వహిందూ పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న శ్రీ గంగాకిషన్, ప్రక్కన శ్రీ ఎ. పాండురంగారెడ్డి





తేది- 27-11-2011న ఒంగోలులో జరిగిన భగవద్గీత కంఠస్థ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేస్తున్న దృశ్యం.

- గీతా కంఠస్థ పోటీలలో పాల్గొన్న విద్యార్థినీ - విద్యార్థులు.